
RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com




# వుదయం




గుంటూరు 14-08-2026 శుక్రవారం | సంపుటి : 13 | సంచిక : 152 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on



## 18 రోజుల రచ్చ తర్వాత
# సభలోకి అమిత్ షా

**న్యూఢిల్లీ, ఆగస్టు 13 (వుదయం) :**

వరుసగా 18 రోజుల పాటు తీవ్ర ఆటంకాల నడుమ సాగిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం ముగిశాయి. సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి తొలిసారిగా లోక్‌సభలోకి అడుగుపెట్టిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలోనే.. సభ ప్రారంభమైన కేవలం నాలుగు నిమిషాల్లోనే స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా (సినే డై) వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

నిమిషాల్లోనే ముగిసిన సభా కార్యకలాపాలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రహదారుల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో కలిసి అధికార పక్షం ముందు వరుసలో హోంమంత్రి అమిత్ షా ఆసీనులయ్యారు. స్పీకర్ ఓం బిర్లా సభలోకి రాగానే సభ్యులందరినీ జాతీయ గేయం కోసం నిలబడాలని కోరారు. గేయం పూర్తయిన వెంటనే సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. గత 18 రోజులుగా సభలో నెలకొన్న పరిస్థితులతో పోలిస్తే గురువారం నాటి దృశ్యం తీవ్ర వ్యత్యాసంగా కనిపించింది. గత కొద్ది రోజులుగా సభ ప్రారంభం కాగానే విపక్ష ఎంపీలు సభలోని 'వెల్' ప్రాంతంలోకి దూసుకెళ్తూ నిరసన తెలిపారు. జులై 20న జంతర్ మంతర్ వద్ద నిరసనకారులపై జరిగిన పోలీసు చర్యపై అమిత్ షా సభకు వచ్చి ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో వరుస వాయిదాల నడుమ ఎలాంటి శాసన సభ కార్యకలాపాలు సాగకుండానే సమావేశాలు కొనసాగాయి.

నీట్ లీకేజీ, విద్యార్థులపై పోలీసు చర్యలపై విపక్షాల నిరసన

నీట్ పేపర్ లీకేజీ, ఇతర సమస్యలపై నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు బలాన్ని ఉపయోగించడంపై హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబట్టాయి. అంతేకాకుండా ఈ వ్యవహారంలో ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశాయి.

ఆఫర్ ఇచ్చిన అమిత్ షా.. తిరస్కరించిన రాహుల్ గాంధీ

బుధవారం రోజున అమిత్ షా మాట్లాడుతూ.. సభను సజావుగా సాగనిస్తే విపక్షాల ప్రశ్నలన్నింటికీ సమాధానమిచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.

**"సభ సాగేలా సహకరిస్తే ప్రశ్నోత్తరాల సమయాన్ని కూడా రద్దు చేసి, మధ్యాహ్నం 3 గంటల నుంచే చర్చకు మేం సిద్ధం. విపక్షాలు స్పీకర్‌కు లేఖ రాస్తే నేనే స్వయంగా సభలో ఉండి అన్నింటికీ స్పష్టమైన సమాధానం ఇస్తాను."**
**— అమిత్ షా, కేంద్ర హోంమంత్రి**

తాను 'లపాటా' (కనిపించకుండా పోయారు) అన్న విపక్షాల విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి రోజువారీగా పార్లమెంటుకు వస్తూ తన ఛాంబర్‌లోనే ఉంటున్నానని, సభ నిరంతరం వాయిదా పడుతున్నప్పుడు లోపలికి రావడం వల్ల ఉపయోగం ఏముంటుందని ప్రశ్నించారు. ఈ మేరకు స్పీకర్ ఓం బిర్లాకు కూడా ఆయన లేఖ రాశారు. అయితే ఈ ప్రతిపాదనను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తోసిపుచ్చారు. తమకు హోంమంత్రి సాధారణ 'ఉపన్యాసాలు' కాకుండా, నిర్దిష్టమైన ప్రశ్నలకు ఖచ్చితమైన సమాధానాలు కావాలని స్పష్టం చేశారు.

**"గాలి పోయిన బెలూన్‌లో చివరి నిమిషంలో మళ్లీ గాలి నింపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అమిత్ షాకు ధైర్యం లేదు."**
**— రాహుల్ గాంధీ, ప్రతిపక్ష నేత**

మరోవైపు, సభ సాగడానికి సహకరిస్తే నీట్ లీకేజీపై తక్షణమే చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందో లేదో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కూడా బుధవారం స్పష్టం చేశారు. అయినప్పటికీ రెండు పక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చివరికి సభ నిరవధిక వాయిదాతో ముగిసింది.

## నా ప్రసంగం తర్వాత
# శుద్ధీకరణ చేస్తారా?

**న్యూఢిల్లీ, ఆగస్టు 13 (వుదయం) :**



వరుసగా 18 రోజుల పాటు తీవ్ర ఆటంకాల నడుమ సాగిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం ముగిశాయి. సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి తొలిసారిగా లోక్‌సభలోకి అడుగుపెట్టిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలోనే.. సభ ప్రారంభమైన కేవలం నాలుగు నిమిషాల్లోనే స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా (సినే డై) వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.


నిమిషాల్లోనే ముగిసిన సభా కార్యకలాపాలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రహదారుల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో కలిసి అధికార పక్షం ముందు వరుసలో హోంమంత్రి అమిత్ షా ఆసీనులయ్యారు. స్పీకర్ ఓం బిర్లా సభలోకి రాగానే సభ్యులందరినీ జాతీయ గేయం కోసం నిలబడాలని కోరారు. గేయం పూర్తయిన వెంటనే సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. గత 18 రోజులుగా సభలో నెలకొన్న పరిస్థితులతో పోలిస్తే గురువారం నాటి దృశ్యం తీవ్ర వ్యత్యాసంగా కనిపించింది. గత కొద్ది రోజులుగా సభ ప్రారంభం కాగానే విపక్ష ఎంపీలు సభలోని 'వెల్' ప్రాంతంలోకి దూసుకెళ్తూ నిరసన తెలిపారు. జులై 20న జంతర్ మంతర్ వద్ద నిరసనకారులపై జరిగిన పోలీసు చర్యపై అమిత్ షా సభకు వచ్చి ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో వరుస వాయిదాల నడుమ ఎలాంటి శాసనసభ కార్యకలాపాలు సాగకుండానే సమావేశాలు కొనసాగాయి.

నీట్ లీకేజీ, విద్యార్థులపై పోలీసు చర్యలపై విపక్షాల నిరసన

నీట్ పేపర్ లీకేజీ, ఇతర సమస్యలపై నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు బలాన్ని ఉపయోగించడంపై హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబట్టాయి.

## ఇంతే కదా...!




**హైదరాబాద్, ఆగస్టు 13 (వుదయం) :**

# హిందూ, ముస్లింలు నా రెండు కళ్లు
## సీఎం రేవంత్ రెడ్డి



"హిందూ ముస్లింలు ఇద్దరూ నాకు రెండు కళ్లలాంటి వారు. వీరి మధ్య నాకు ఎలాంటి వ్యత్యాసం లేదు" అని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులంతా 'తెలంగాణ రైజింగ్' లక్ష్య సాధన కోసం అంకిత భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో గురువారం నిర్వహించిన "తెలంగాణ మైనారిటీల ప్రతిభా సదస్సు"కు ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రూప్ 1, 2, 3, 4 తదితర కేటగిరీల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారితో పాటు నీట్, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ చాటిన 782 మంది మైనారిటీ అభ్యర్థులకు సీఎం అభినందనలు తెలిపారు.

చదువు, నైపుణ్యాలే భవిష్యత్తుకు ఆధారం

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, సమాజంలో

- నైపుణ్యాలే భవిష్యత్తుకు పునాది
- మైనారిటీ యువత 'తెలంగాణ రైజింగ్' కోసం పనిచేయాలి
- అడ్డంకులను అధిగమించి ఉద్యోగాలు భర్తీ చేశాం

**"గతంలో గ్రూప్-1 ప్రశ్నాపత్రాలను మార్కెట్‌లో పల్లీ బఠానీల్లా విక్రయించి నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకున్నారు. అర్హత లేని వారిని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో నియమించడం వల్లే ఈ పరిస్థితి దాపురించింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక UPSC చైర్మన్, నిపుణుల సలహాలతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిగా ప్రక్షాళన చేశాం." — ఎ. రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి**



మార్పునకు విద్య ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు చదువుకున్న తర్వాత విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి (స్కిల్స్) పై దృష్టి సారించాలని సూచించారు.

అంతర్జాతీయ అవకాశాలు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలు ఉన్నవారికి జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో అపారమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని వెల్లడించారు.

సంస్కరణలు: యువతను గ్లోబల్ స్థాయి పోటీకి సిద్ధం చేయాలనే లక్ష్యంతోనే ఐటీఐలను 'ఏటీసీ'లుగా మార్చామని, పాలిటెక్నిక్ కళాశాలలను 'స్కిల్స్ యూనివర్సిటీ' పరిధిలోకి తీసుకువచ్చామని వివరించారు.

4 శాతం రిజర్వేషన్ల పరిరక్షణ - సంక్షేమ ఫలాలు

మైనారిటీలకు దక్కిన 4 శాతం రిజర్వేషన్లను తొలగించేందుకు అనేక కుట్రలు జరిగినప్పటికీ, వాటిని సమర్థవంతంగా అడ్డుకున్నామని సీఎం తెలిపారు. ప్రజా ప్రభుత్వం మైనారిటీ సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, 200 యూనిట్ల వరకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకం వల్ల మైనారిటీలకే ఎక్కువ లబ్ధి చేకూరుతోందని అన్నారు.

టీజీపీఎస్సీ ప్రక్షాళన - న్యాయపోరాటంతోనే ఉద్యోగాల భర్తీ

గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామకాల తీరుపై సీఎం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

అభ్యర్థులను తమ కుటుంబ సభ్యులుగా భావించి, నియామకాల నిలిపివేతకు ఎదురైన అడ్డంకులను తొలగించేందుకు హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు ఉద్దండులైన న్యాయవాదులతో పోరాటం చేసి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, TGMREIS ప్రెసిడెంట్ మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'ఉక్కు గోడ' మాట అబద్ధం

**తెహ్రాన్ :**



హోర్ముజ్ జలసంధిపై తమకే పూర్తి నియంత్రణ ఉందంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా తిరస్కరించింది. వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన ఈ సముద్ర మార్గం ఇప్పటికీ తెహ్రాన్ అధికార పరిధిలోనే ఉందని ఇరాన్ సీనియర్ అధికారి గురువారం స్పష్టం చేశారు.

హోర్ముజ్ మా నిర్వహణలోనే ఉంది

ఇరాన్ ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ)కి చెందిన పారామిలిట్రీ దళం 'బసిజ్' అధిపతి హుస్సేన్ తాయిబ్ ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "హోర్ముజ్ జలసంధి పూర్తిగా ఇస్లామిక్ రిపబ్లిక్ నిర్వహణ, నియంత్రణలోనే ఉంది. మా దేశం పూర్తి భద్రతతో తన మార్గంలో ముందుకు సాగుతోంది" అని తాయిబ్ వ్యాఖ్యానించారు.

మరోవైపు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వాషింగ్టన్ ప్రకటనలను తీవ్రంగా ఖండించారు. ఇంటెలిజెన్స్ వైఫల్యాల కారణంగా అమెరికా ఎప్పటినుంచో తప్పుడు అంచనాలు వేస్తోందని, గతంలో ఇరాన్‌పై యుద్ధం ప్రకటించడం ఒక ఉదాహరణ అయితే, ఇప్పుడు హోర్ముజ్ జలసంధి విషయంలో అంతకంటే పెద్ద తప్పుడు అంచనా వేసిందని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

**అమెరికా, ఇజ్రాయెల్ నౌకలపైనే ఆంక్షలు**

హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకల రవాణాపై విధించిన ఆంక్షలు కేవలం అమెరికా, ఇజ్రాయెల్‌లకు చెందిన నౌకలకే వర్తిస్తాయని ఇరాన్ పార్లమెంట్ సభ్యుడు, జాతీయ భద్రతా కమిటీ సభ్యుడు బెహ్నామ్ సైదీ స్పష్టం చేశారు. "యుద్ధ సమయమైనా, శాంతి సమయమైనా జియోనిస్ట్ పాలనకు (ఇజ్రాయెల్) చెందిన నౌకలకు హోర్ముజ్ జలసంధి దాటే హక్కు ఎంతమాత్రమూ లేదు" అని ఆయన పేర్కొన్నారు.

'ఉక్కు గోడ' అన్న ట్రంప్.. ఇరాన్ ప్రత్యుత్తరం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'ట్రూత్ సోషల్' వేదికగా స్పందిస్తూ, "హోర్ముజ్ జలసంధిపై అమెరికాకు పూర్తి నియంత్రణ ఉంది. దానిని మేం అలాగే ఉంచుకుంటామని భావిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు. తమ నౌకాదళం విధించిన దిగ్బంధనాన్ని 'ఉక్కు గోడ'గా అభివర్ణించిన ట్రంప్, దానిని అడ్డుకోవడం ఇరాన్ వల్ల కాదని పేర్కొన్నారు.

# 'ఇందిరమ్మ ఇండ్లు' టవర్స్ శంకుస్థాపన

**హైదరాబాద్, ఆగస్టు 13 (వుదయం) :**



"గత పదేళ్ల బీఆర్ఎస్ దుర్మార్గపు పాలనకు, అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల మా ప్రజా పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలంతా బేరీజు వేసుకోవాలి" అని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో రూపుదిద్దుకోనున్న "ఇందిరమ్మ ఇండ్లు" టవర్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ఉద్వేగభరితంగా మాట్లాడారు.

కూకట్‌పల్లి అభివృద్ధే నా ప్రాధాన్యం

తాను గతంలో ఎంపీగా పోటీ చేసినప్పుడు కూకట్‌పల్లి ప్రజలు ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని సీఎం గుర్తు చేసుకున్నారు. ప్రత్యేక నిధులు: అప్పట్లో ప్రతిపక్షంలో ఉండటం వల్ల గత ప్రభుత్వం నిధులు ఇవ్వక ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయానని తెలిపారు. మంత్రికి ఆదేశాలు: ప్రస్తుతం కూకట్‌పల్లిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే అధికారం తమకు ఉందని, ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మంత్రి శ్రీధర్ బాబును ఆదేశించినట్లు వెల్లడించారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌లపై
# కాంగ్రెస్ సర్కార్ కుట్ర



**హైదరాబాద్, ఆగస్టు 13 (వుదయం) :**

రాష్ట్రంలో పేద యువతుల పెళ్లిళ్లకు ఆసరాగా నిలుస్తున్న 'కళ్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలను నిలిపివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

హైకోర్టు పిల్‌పై ప్రభుత్వ నిర్లక్ష్యం

గత జులై 8న విజయ్ గోపాల్ అనే న్యాయవాది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సవాలు చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారని ఆర్ఎస్పీ తెలిపారు. జీవోల ద్వారా కాకుండా చట్టబద్ధత లేకుండా ఈ పథకాలు అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని, సామాజిక న్యాయానికి గొడ్డలిపెట్టని పిటిషనర్ పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు.. బీసీ, ఎస్సీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలకు నోటీసులు జారీ చేసిందని వివరించారు. నోటీసులు ఇచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు నాలుగు సార్లు విచారణ వాయిదా పడినా, నెల రోజుల సమయం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయలేదని నిలదీశారు. ప్రభుత్వం స్పందించకపోవడం వెనుక పథకాన్ని ఎత్తివేసే దురుద్దేశం దాగి ఉందన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలపై ధ్వజం

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు నోడల్ ఏజెన్సీగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహరిస్తున్నారని పేర్కొంటూ ఆయనపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు గుప్పించారు.

**"మేము ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే మంత్రి పొన్నం ప్రభాకర్ మమ్మల్ని 'తాడు బొంగరం లేనోళ్లు' అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. మరి ఇప్పుడు పథకానికి ముప్పు వాటిల్లుతుంటే స్పందించని పొన్నం ప్రభాకర్ మాటలకు, ఇతర సంక్షేమ శాఖల మంత్రుల వైఖరికి ఏమైనా 'తాడు బొంగరం' ఉందా?"**
**— ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ**

ప్రభుత్వానికి నిజంగా పేదల సంక్షేమంపై పట్టింపు ఉంటే వెంటనే హైకోర్టులో బలమైన కౌంటర్ దాఖలు చేసి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రక్షించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.




# మున్సిపాలిటీ 15వ వార్డులో పలు అభివృద్ధి పనులు

**కోహీర్ ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి )**



కోహీర్ మున్సిపాలిటీలోని 15వ వార్డులో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.
స్థానిక కౌన్సిలర్ మహమ్మద్ అస్లాం జావీద్ ఆధ్వర్యంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు.వార్డు ప్రజల సౌకర్యార్థం నిమిత్తం పాత విద్యుత్ వైర్ల స్థానంలో 85 మీటర్ల కొత్త వైర్ ను అమర్చారు.రాత్రి వేళల్లో చీకటి సమస్యను నివారించడానికి కొత్తగా 18 (ఎల్ ఈ డి )లైట్లను బిగించారు.వీధి దీపాల నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కౌన్సిలర్ తెలిపారు. ప్రజలకు రాత్రి వేళల్లో రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.వార్డులో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నిరంతరం నిఘా ఉంచుతామని హామీ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చే మౌలిక వసతుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు.స్థానిక ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.కొత్త ఎల్ఈడీ లైట్ల ఏర్పాటుతో వీధుల్లో చీకటి సమస్య, తొలగిపోయింది.అన్నారు ఈ అభివృద్ధి కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది ప్రత్యక్షంగా పాల్గొని సేవలుందించారు.కార్యక్రమంలో 11 వార్డు కౌన్సిలర్ ఎం. ఎ.ఖలీం వార్డు ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా భవిష్యత్తులో మరిన్ని పనులు చేస్తామని నాయకులు వెల్లడించారు.సమస్యల పరిష్కారానికి ప్రజలు నేరుగా తనను సంప్రదించవచ్చని కౌన్సిలర్ సూచించారు.వార్డు సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

# పేదరికానికి వైద్యం చిక్కనివ్వం!

- **ఆపన్నులకు అండగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**
- **లబ్ధిదారు కుటుంబానికి రూ.2.50 లక్షల ఎల్ఓసీ పత్రం అందజేత**

**గద్వాల ఆగస్టు 13 (వుదయం కరస్పాండెంట్)**



ఆపదొస్తే ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనడానికి సీఎంఆర్ఎఫ్ సాయమే నిదర్శనమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గద్వాల 27వ వార్డుకు చెందిన సత్యమ్మ, లక్ష్మన్న దంపతులు వైద్య ఖర్చుల భారాన్ని భరించలేక ఇబ్బందిపడుతున్న తరుణంలో, వారి పరిస్థితిని తెలుసుకుని వెంటనే రూ.2.50 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని మంజూరు చేయించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఈ ఎల్ఓసీ లెటర్‌ను బాధితులకు అందజేసి, వారిలో నూతన ధైర్యాన్ని నింపారు.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్ష



- **ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశం**

**నాగర్ కర్నూల్ ఆగస్టు 13 (వుదయం బ్యూరో):**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టర్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. వేదిక నిర్మాణం, జాతీయ పతాకావిష్కరణ, పోలీస్ పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ స్టాళ్ల ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు.కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు, విద్యార్థులు, అధికారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, సీటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల కార్యక్రమాలు ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని, సమయపాలన పాటించాలని సూచించారు.ఎస్పీ మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని, వాహనాల పార్కింగ్, కదలికలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ అర్చన, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై పీర్ ఎడ్యుకేషన్ కీలకం



- **పి హెచ్ సి ఉప్పేర్‌లో ఆశా కార్యకర్తలు, హెల్త్ సిబ్బందికి శిక్షణ**

**గద్వాల, ఆగస్టు 13 (వుదయం కరస్పాండెంట్)**

రాష్ట్రీయ కిషోర్ స్వస్థ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పేర్ పరిధిలో ఆశా కార్యకర్తలు, హెల్త్ సిబ్బందికి పీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ డా. మొహమ్మద్ అస్గర్ అలీ, మెడికల్ ఆఫీసర్ డా. భరత్, డెమో హీర్యా నాయక్ పాల్గొని పీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమం అమలు విధానం, యుక్తవయస్సు బాలబాలికలకు అందించాల్సిన ఆరోగ్య అవగాహనపై వివరించారు.

**ప్రతి ఆశా పరిధిలో నలుగురు పీర్ ఎడ్యుకేటర్ల ఎంపిక**

శిక్షణలో భాగంగా ప్రతి ఆశా కార్యకర్త తన పరిధిలోని 10-19 సంవత్సరాల వయస్సు గల నలుగురు పీర్ ఎడ్యుకేటర్లను ఎంపిక చేయాలని సూచించారు. వీరిలో ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు ఉండేలా చూడాలని తెలిపారు. ఎంపికైన పీర్ ఎడ్యుకేటర్లు 15-20 మందితో గ్రూపును ఏర్పాటు చేసి నెలకు నాలుగు సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఆయా సమావేశాల్లో యుక్తవయస్సు వారికి అవసరమైన ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించాలన్నారు.

**పోషకాహారం నుంచి మాదక ద్రవ్యాల నివారణ వరకు..**

పీర్ ఎడ్యుకేషన్ ద్వారా పోషకాహారం, రక్తహీనత నివారణ, మెన్స్ట్రువల్ హైజీన్ మేనేజ్‌మెంట్ (MHM), మానసిక ఆరోగ్యం, మాదక ద్రవ్యాల నివారణ తదితర అంశాలపై యువతకు అవగాహన కల్పించాలని శిక్షణలో వివరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్పిహెచ్ఈఓ రవీందర్, ఎన్సిడి సూపర్వైజర్ శ్యామ్ సుందర్, పిహెచ్ఎన్ నర్సమ్మ, ఎమ్పిహెచ్ఎస్ లక్ష్మి, పి హెచ్ సి ఉప్పేర్ పరిధిలోని ఆశా నోడల్స్, ఆశా ఫెసిలిటేటర్లు, ఏ ఎన్ ఎమ్ లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మనీషా ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద లబ్ధిదారులకు తీవ్ర అవస్థలు

**కోహీర్ ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి )**



కోహీర్ మండల కేంద్రంలోని మనీషా ఇండియాన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద గ్యాస్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్లకు ఈకేవైసీ (eKYC) తప్పనిసరి చేయడంతో రోజువారీగా వందలాది మంది లబ్ధిదారులు ఏజెన్సీ వద్దకు వస్తున్నారు . సాంకేతిక లోపాలు, సర్వర్ డౌన్ సమస్యల కారణంగా గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడినా ఈకేవైసీ ప్రాసెస్ సక్సెస్ కావడం లేదు.
రోజులు తరబడి తిరగాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
వయోవృద్ధులు, పసిపిల్లలతో వచ్చే మహిళలు, రోజువారీ కూలీలు తమ పనులను వదులుకుని ఉదయం నుంచే క్యూలో వేచి చూస్తున్నారు.
గ్యాస్ బుకింగ్ ప్రక్రియలోనూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం అని వినియెగదారులు ఆరోపిస్తున్నారు.
డిఎస్‌సి (DSC )నెంబర్ వచ్చేంతవరు గ్యాస్ దొరుకడం లేదు అని లబ్బిదారులు వాపోతువున్నారు. ఏజెన్సీ వద్ద రద్దీకి తగ్గట్టుగా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల రోజురోజుకూ ప్రయాసం పెరుగుతోంది.గ్యాస్ సిలిండర్ల డెలివరీ విషయంలోనూ ఏజెన్సీ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని వినియోగదారులు మండిపడుతున్నారు.బుకింగ్ చేసుకున్న రోజుల తరబడి సమయానికి సిలిండర్లు ఇంటికి చేరడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.ఏజెన్సీ వద్ద కనీస సదుపాయాలైన తాగునీరు, కూర్చోవడానికి వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.దూర ప్రాంతాల గ్రామాల నుంచి ప్రయాణ ఖర్చులు పెట్టుకుని వచ్చినా, రోజు ఆఖరున పని కాకుండా ఖాళీ చేతులతో తిరిగి వెళ్లాల్సి వస్తోంది.
ఏజెన్సీ నిర్వహణలో లోపాలు, వినియోగదారులకు సరైన సమాచారం అందడం లేదు.సంబంధిత సివిల్ సప్లై (పౌరసరఫరాల) శాఖ అధికారులు వెంటనే స్పందించి మనీషా ఇండియన్ ఏజెన్సీలో క్షేత్రస్థాయి పరిశీలన జరపాలి.సాంకేతిక లోపాలను సరిచేసి, ఈకేవైసీ ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు డెలివరీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మనీషా ఇండియన్ గ్యాస్ వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

# కోయిల్ సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలని ధర్నా రాస్తారోకో

**మరికల్ ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి)**



మరికల్ మండల కేంద్రంలోని గురువారం ఇందిరా గాంధీ చివరస్త దగ్గర టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కోయిల్ సార్ నీరుని వెంటనే విడుదల చేయాలని ధర్నా రాస్తారోకో చేశారు టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు లంబడి తిరుపతయ్య సమావేశంలో మాట్లాడుతూ రైతులకు తీలేరు పంప్ హౌస్ నుండి రెండు మోటార్లు స్టార్ట్ చేసి వెంకటాపూర్ పల్లెగడ్డ మాదారం పెద్ద చింతకుంట పీలేరు అప్పంపల్లి మరికల్ గ్రామా రైతులకు నీటిని వెంటనే విడుదల చేయాలని ఆయన అన్నారు పంటలు పంటలు ఎండిపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తూ కోయిల్ సాగర్ కాలువ నుండి నీటిని విడుదల చేయకుండా చేస్తుందని బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు తొమ్మిదేళ్లు పాడిపంటలు పండించాలని ఆయన అన్నారు వెంటనే ప్రభుత్వం స్పందించి వరి పంటకు నీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రవికుమార్ కృష్ణారెడ్డి వీరభసంత కానుగంటి నారాయణ రామస్వామి రాఘవరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి రాజారెడ్డి తో పాటు వివిధ గ్రామాల నుండి టిఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అవయవదానం మహాదానం ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలి

- **మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్**
- **కల్వకుర్తి జూనియర్ కళాశాలలో అవయవదాన అవగాహన సదస్సు**

**కల్వకుర్తి ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి):**



ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అవయవదాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం ఆధ్వర్యంలో నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవయవదానం మహాదానమని, సమాజంలో ప్రతి ఒక్కరు దీనిని ప్రోత్సహించి ఇతరులకు పునర్జన్మ ఇవ్వాలని పిలుపునిచ్చారు.అవయవ మార్పిడిలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా 3వ స్థానంలో ఉందని, అయినప్పటికీ సరఫరా కీలకమైన డిమాండ్‌లో కొంత భాగాన్ని మాత్రమే తీరుస్తోందని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తెలుగు రాష్ట్రాలు జీవందన్ ద్వారా మృతదేహ అవయవ మార్పిడిని చురుకుగా ప్రోత్సహిస్తున్నాయని, ప్రస్తుతం వేలాది మంది నిరీక్షణ జాబితాలో నమోదు చేసుకున్నారని తెలియజేశారు.బ్రెయిన్ డెత్, అవయవాల అక్రమ సేకరణకు సంబంధించిన అపోహలను తొలగించేందుకు వైద్య కళాశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ సంస్థలు నేడు అవగాహన యాత్రలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు.
ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యుల బైక్‌లకే నిబంధనలు..

# బడాబాబుల కార్లకు ఎందుకు వర్తించవు?






- **ధర్నా టెంట్ వెనుక బైక్ పార్క్ చేస్తే న్యూసెన్సా? రోడ్డుపై లైన్ దాటి కార్లు పెడితే మాత్రం నిబంధనలు కనిపించవా?**

**ముషీరాబాద్, ఆగస్టు 13 (వుదయం)**

చట్టం అందరికీ సమానమే అయితే..ఆ చట్టం అమలు విషయంలో ఈ వివక్ష ఎందుకు? ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద సామాన్యుడు తన బైక్‌ను రోడ్డుకు అడ్డంగా కాకుండా, ధర్నా టెంట్ వెనుక ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగని ప్రదేశంలో పార్క్ చేసినా పోలీసులు నిబంధనల పేరుతో రుబాబు చూపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
బైక్ పార్క్ చేసిన ప్రదేశంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకపోయినా.. ప్రజలకు ఇబ్బంది లేకపోయినా.. న్యూసెన్స్, ట్రాఫిక్ జామ్ లేకపోయినా.. సామాన్యుడి బైక్‌పైనే ఆంక్షలు, హెచ్చరికలు ఎందుకు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
మరోవైపు అదే ఇందిరా పార్క్ ధర్నా చౌక్ పరిసరాల్లో రాజకీయ నాయకులు, బడాబాబుల వాహనాలు రోడ్డు లైన్‌ను దాటి పార్క్ చేసినా.. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా కార్లు నిలిపినా.. వారిపై చర్యలు ఎందుకు కనిపించడం లేదని ప్రజలు నిలదీస్తున్నారు.

**ఒకరికి ఒక న్యాయం.. మరొకరికి మరో న్యాయమా?**

"సామాన్యుడి బైక్ కనిపిస్తే నిబంధనలు గుర్తొస్తాయి..రాజకీయ నాయకుల కార్లు కనిపిస్తే అదే నిబంధనలు ఎందుకు మర్చిపోతారు?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనం ఎవరిదైనా చర్యలు తీసుకోవాల్సిందే. అయితే సామాన్యులపై మాత్రమే కఠినంగా వ్యవహరించి.. అధికారంలో ఉన్నవారు, రాజకీయ నాయకులు, బడాబాబుల వాహనాల విషయంలో చూసీచూడనట్లు వ్యవహరించడం ఏ విధమైన న్యాయమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో నిబంధనలు అమలు చేస్తే ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్దైనా.. నగరంలోని మరే ప్రాంతంలోనైనా.. అందరికీ ఒకే విధంగా అమలు చేయాలి.ధర్నా టెంట్ వెనుక ఎలాంటి న్యూసెన్స్ లేని చోట బైక్ పెట్టిన సామాన్యుడిని ప్రశ్నించే పోలీసులు.. రోడ్డుపై లైన్ దాటి వాహనాలు నిలిపే పెద్దలను కూడా అదే స్థాయిలో ప్రశ్నించాలి.అధికారం ఉన్నవారికి ఒక చట్టం.. సామాన్యుడికి మరో చట్టం అనే పరిస్థితి ప్రజాస్వామ్యంలో ఉండకూడదు.సామాన్యుడిపై రుబాబు కాదు.. చట్టాన్ని సమానంగా అమలు చేయాలి.బైక్ అయినా.. కారు అయినా.. సామాన్యుడిదైనా.. రాజకీయ నాయకుడిదైనా.. బడాబాబుదైనా—చట్టం ముందు అందరూ సమానమే."సామాన్యుడి బైక్‌కు నిబంధనలు వర్తిస్తే.. బడాబాబు, రాజకీయ నాయకుల కార్లకు కూడా అవే నిబంధనలు వర్తించాలి. లేకపోతే ఇది ట్రాఫిక్ నిబంధనల అమలు కాదు.. స్పష్టమైన వివక్ష!"

# సర్పంచుల సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా ఏకమవ్వాలి

- **ఆగస్టు 20న మహబూబ్‌నగర్‌లో ఉమ్మడి జిల్లాల చైతన్య సదస్సు**

**నాగర్ కర్నూల్ రూరల్ ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి):**



గ్రామ ప్రజల విశ్వాసంతో ఎన్నికైన సర్పంచులు గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ నాయకులు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన రోడ్లు, డ్రైనేజీలు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, కుల సంఘాల భవనాలు, విద్యాభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం సర్పంచులు చొరవ చూపాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు, విధులు, అధికారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి చట్టబద్ధంగా సాధించేందుకు సర్పంచులంతా పార్టీలకు అతీతంగా సంఘటితంగా పోరాడాలని సూచించారు. సర్పంచుల సమస్యల పరిష్కారం ఐక్యతతోనే సాధ్యమవుతుందని తెలిపారు.సర్పంచుల హక్కుల కోసం 1995లో వైవీబీ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం ఏర్పడిందని, తెలంగాణ ఆవిర్భావం అనంతరం చింపుల సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్‌గా ఏర్పడిందని నాయకులు గుర్తు చేశారు. దాదాపు మూడు దశాబ్దాలుగా సంఘం సర్పంచుల హక్కుల కోసం పోరాడుతూ పలు ప్రభుత్వ ఉత్తర్వులు, కోర్టు తీర్పులు, నిధుల విడుదలలో కీలక పాత్ర పోషించిందన్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణలో సర్పంచుల సమస్యలపై చైతన్యం కల్పించేందుకు ఆగస్టు 20న ఉదయం 10:30 గంటలకు మహబూబ్‌నగర్‌లోని ఓల్డ్ ఎం.బి. ఎస్. కాలేజ్ సమీపంలోని క్రౌన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల సర్పంచుల చైతన్య సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సును విజయవంతం చేసి రాష్ట్రంలోని ఇతర జిల్లాల సర్పంచులకు మార్గదర్శకంగా నిలవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ నాయకులు చింపుల సత్యనారాయణ రెడ్డి, మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి, బాదేవల్లి సిద్ధార్థ, మందిపల్ వెంకట్, జిల్లా కన్వీనర్ లింగారం శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొననున్నారు. గద్వాల్ కన్వీనర్ కేజీ రాజశేఖర్, నాగర్‌కర్నూల్ కన్వీనర్ వీరోజు సుప్రియ మురళి, వనపర్తి కన్వీనర్ డాక్టర్ పలుసా శేఖర్, మహబూబ్‌నగర్ కన్వీనర్ బత్తుల వెంకట్రాములు గౌడ్ తదితరులు సర్పంచులను సదస్సుకు ఆహ్వానించారు.

# చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

**ఎస్ఐ మధుకర్ రెడ్డి**

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 13...**

మెదక్ జిల్లా మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో రాత్రి వేళల్లో దేవాలయాలలో చోరీలు జరగడం, హుండీలను ఎత్తుకెళ్లడం వంటి నేరాలు వెలుగులోకి వచ్చాయని, ఈ విషయమై పోలీస్ శాఖ తీవ్రంగా పరిగణించి ఇప్పటికే నిఘా పెంచడం జరిగిందని శివ్వంపేట ఎస్ఐ మధుకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని దేవాలయాల భద్రత దృష్ట్యా గ్రామ ప్రజలు, ఆలయ నిర్వహకులు, సాధ్యమైనంత వరకు హుండీలలోని డబ్బును ఎప్పటికప్పుడు తీసి బ్యాంకు ఖాతాలో జమ చేయాలని, రాత్రి వేళల్లో కాపలాగా గ్రామ యువకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు రాత్రి వేళల్లో వంతులవారీగా ఆలయాల వద్ద కాపలా ఉండాలని ఎస్ ఐ విజ్ఞప్తి చేశారు. రాత్రి వేళల్లో ఆలయ ప్రాంగణంలో, హుండీలు ఉన్న ప్రదేశాల్లో తగినంత కరెంటు లైటింగ్ ఉండేలా చూడాలి. అలాగే విలువైన వస్తువుల భద్రత కోసం రాత్రి వేళల్లో ఆలయంలో ఉండే ప్రధాన ఆభరణాలను ఆలయంలో కాకుండా సురక్షిత లాకర్ల లల్లో ఉంచాలని ఎస్ఐ మధుకర్ రెడ్డి కోరారు.



# నెల రోజులు వైభవంగా శ్రావణ మాస ఉత్సవాలు



**కోహీర్ ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి )**

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని బడంపేట్ గ్రామంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ రామలింగేశ్వర స్వామి మరియు శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో శ్రీ క్రోధి నామ సంవత్సర శ్రావణ మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ పవిత్ర శ్రావణ మాసంలో నెల రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక జలాభిషేకాలు, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శ్రావణ మాసంలో స్వామివార్ల దర్శనం సమస్త పాపహరమని, శుభప్రదమని ఆలయ అర్చకులు తెలిపారు.విశేష పూజలు: నెల రోజుల పాటు ప్రత్యేక జలాభిషేకం, కుంకుమార్చనలు. నెల రోజులకు ₹2,500/.నెల రోజుల పూజలో పాల్గొనే భక్తులకు స్వామి వారి శేష వస్త్రములు ప్రసాదంగా అందజేయబడును.భక్తుల సౌకర్యార్థం ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులందరూ ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివార్ల కృపా కటాక్షాలు పొందాలని ఆలయ అర్చక బృందం,బడంపేట్ గ్రామస్థులు కోరారు.

# శ్రీ ఉమా మహేశ్వర క్షేత్రంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతుల వరుణ యాగం



**అచ్చంపేట,ఆగస్టు13 (వుదయం ప్రతినిధి)**

శ్రీశైలం ఉత్తర ద్వారంగా వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం ప్రముఖ పుణ్యక్షేత్రంగా భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది.నల్లమల అడవుల మధ్య, ప్రకృతి రమణీయతతో కొలువై ఉన్న ఉమామహేశ్వరం క్షేత్రానికి విశిష్టమైన ఆధ్యాత్మికప్రాధాన్యతఉంది.ఈ పవిత్ర పుణ్యక్షేత్రంలోగురువారం రోజునమహావరుణయాగం
నాగర్ కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ దంపతులు ఈ మహా వరుణ యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగింది.వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు సస్యశ్యామలంగా వర్ధిల్లాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనిఆకాంక్షిస్తూ ఈ యాగాన్ని నిర్వహించడం జరిగింది.
శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం చైర్మన్ బిరం మాధవరెడ్డి, పాలకమండలి సభ్యులుమహావరుణయాగంఏర్పాట్లను చేశారునల్లమల అచ్చంపేటకు ఆధ్యాత్మిక వైభవాన్నిచాటేశ్రీఉమామహేశ్వరదేవస్థానము భక్తి, ప్రకృతి, ఆధ్యాత్మికతల సంగమమైన మహా పుణ్యక్షేత్రం
ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బీరంమాధవరెడ్డి,పాలకమండలి సభ్యులు, వేద పండితులు ఆలయ అర్చకులుభక్తులుప్రజలుప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు,

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి

**పటాన్చెరు (వుదయం ఆగస్టు 13):**



తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJ-IJU) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీని సంగారెడ్డి జిల్లా నూతన కమిటీ సభ్యులు, పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కమిటీ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బి. యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు రాష్ట్ర యూనియన్ కార్యాలయంలో విరాహత్ అలీని పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కమిటీలకు శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ బలోపేతానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని, జర్నలిస్టుల సమస్యలపై జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఐక్యంగా పోరాడాలని సూచించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం TUWJ-IJU నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. జర్నలిస్టుల హెల్త్ కార్డుల సమస్య పరిష్కారం కోసం కూడా యూనియన్ కృషి చేస్తోందని, త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. జర్నలిస్టులంతా ఐక్యంగా ఉండి తమ సమస్యలను సాధించుకునేందుకు సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# టి జి ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ

- **అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**మహబూబ్ నగర్ ఆగస్టు 13 (వు దయం ప్రతినిధి)**

దేవరకద్ర మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ జూనియర్ కళాశాల, హాస్టల్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కళాశాల, హాస్టల్‌లోని వంటగది పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, మౌలిక వసతులు, హాస్టల్ సేవలను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, విద్యా ప్రమాణాలు, హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాలు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల సమస్యలు, అవసరాలను తెలుసుకున్న అదనపు కలెక్టర్ వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు.విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించాలని, విద్యా, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను సూచించారు.ఈ తనిఖీలో దేవరకద్ర ఎం.పి.ఓ, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## టీయుడబ్ల్యూజే వికారాబాద్ కమిటీ ఏకగ్రీవం





**-గౌరవ అధ్యక్షులుగా కే. నర్సింలు, ఎల్. విశ్వనాథం, ఎం. నాగిరెడ్డి**
**-అధ్యక్షుడిగా కే. గోపాల్, ప్రధాన కార్యదర్శిగా కె. సంతోష్ కుమార్**

**వికారాబాద్ 13 (వుదయం బ్యూరో )**

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJ) H143 వికారాబాద్ నియోజక వర్గ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.రాష్ట్ర నాయకులు ఆసిఫ్ హుస్సేన్, జిల్లా కన్వీనర్ రవీందర్, కోకన్వీనర్లు జి. నర్సింలు, టి. ఆనంద్, సయ్యద్ జావీద్ పాషా, కే. సంతోష్ కుమార్, బి. రాజు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ జరిగింది.నూతన కమిటీగౌరవ అధ్యక్షులు: కే. నర్సింలు, ఎల్. విశ్వనాథం, ఎం. నాగిరెడ్డిఅధ్యక్షుడు: కే. గోపాల్వర్కింగ్ ప్రెసిడెంట్: పి. అరుణ్ రెడ్డిఉపాధ్యక్షుడు: ఎం. అమరేందర్ప్రధాన కార్యదర్శి: కె. సంతోష్ కుమార్కోశాధికారి: ఎం. వెంకటేష్సంయుక్త కార్యదర్శులు: వి. రామకృష్ణాచారి, పి. అంజిలయ్యమీడియా ఇంచార్జీలు: బి. నర్సింలు, టి. నరేందర్కార్యదర్శులు: బి. నర్సింలు (రాజు), షఫీకార్యవర్గ సభ్యులు: కే. లాలయ్య, టి. జగన్, సందీప్ గుప్తా, ఎన్. అరుణ్, సి. విజయ్, ఎస్. శ్రీకాంత్.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు రాష్ట్ర, జిల్లా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

## ఆయుష్ జేఏసీ ఉద్యమం తీవ్రం

**- 2016 నుంచి పెరగని స్టైఫండ్.. ఏళ్లుగా నిర్లక్ష్యమేనా?**

**ముషీరాబాద్, ఆగస్టు 13(వుదయం)**



తెలంగాణ ఆయుష్ హౌస్ సర్జన్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. 2016 నుంచి ఇప్పటివరకు స్టైఫండ్ పెంచకపోవడంపై ఆయుష్ వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య రంగంలో కీలక సేవలు అందిస్తున్న తమను ప్రభుత్వం ఏళ్ల తరబడి పట్టించుకోవడం లేదని జేఏసీ నాయకులు మండిపడ్డారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా స్టైఫండ్ మాత్రం పెరగకపోవడం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. 2016లో ఉన్న స్టైఫండ్‌నే ఇప్పటికీ కొనసాగించడం వల్ల హౌస్ సర్జన్స్, పీజీ విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఒకవైపు వైద్య సేవల్లో తమపై బాధ్యతలు పెరుగుతున్నా.. మరోవైపు పారితోషికం మాత్రం ఏళ్లుగా అదే స్థాయిలో ఉండటం దారుణమన్నారు. "వైద్య సేవలు అందించడంలో మేము ముందుంటే.. మా హక్కుల విషయంలో ప్రభుత్వం ఎందుకు వెనుకబడుతోంది?" అంటూ జేఏసీ నాయకులు ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్టైఫండ్‌ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, ఆయుష్ హౌస్ సర్జన్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేసిన ఆయుష్ వైద్య విద్యార్థుల సమస్యలకు ఇకనైనా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

## శంకర్‌పల్లిలో ఘనంగా తిరంగా ర్యాలీ

**-మన త్రివర్ణ పతాకం జాతీయ గౌరవం, ఐక్యతకు ప్రతీక**
**– చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం**

**శంకర్‌పల్లి**



మన త్రివర్ణ పతాకం జాతీయ గౌరవానికి, ఐక్యతకు, దేశభక్తి స్ఫూర్తికి ప్రతీక అని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం అన్నారు. గురువారం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని కన్వీనర్ బి. వీరేందర్, కోకన్వీనర్ ఆర్. వెంకట్ రాంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వివేకానంద, చైతన్య, జాగృతి కళాశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులతో పాటు బీజేపీ నాయకులు జాతీయ జెండాలు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. గెస్ట్‌హౌస్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. విద్యార్థులు, నాయకులు 'వందేమాతరం' నినాదాలతో దేశభక్తి స్ఫూర్తిని చాటుతూ ర్యాలీని కొనసాగించారు. అనంతరం ర్యాలీ ప్రధాన చౌరస్తా వద్ద ముగిసింది. ఈ సందర్భంగా కె.ఎస్. రత్నం మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన అమరవీరులు, స్వాతంత్య్ర సమరయోధుల సేవలను ప్రతి ఒక్కరూ గౌరవంగా స్మరించుకోవాలని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ర్యాలీ అనంతరం నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు జనగళ్ల రాములు గౌడ్, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మమత, పరమేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బీర్ల సురేష్, నరసింహా రెడ్డి, బీర్ల నరసింహ, వెంకటేష్, ఆర్. నరేష్ కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తెల్లాపూర్‌లో రూ.48 కోట్ల పాఠశాల

**- ఆగస్టు 17న భూమిపూజ.. కేజీ నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన**
**పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**రామచంద్రాపురం, ఆగస్టు 13(వుదయం)**





పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో తెల్లాపూర్‌లో రూ.48 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక ప్రభుత్వ పాఠశాల నిర్మించనున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం తెల్లాపూర్‌లోని సర్వే నంబర్ 323, గద్దర్ విగ్రహం వెనుక పాఠశాల నిర్మించనున్న స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఎకరా విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాలలో ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో విద్యాబోధన అందించనున్నట్లు తెలిపారు. డిజిటల్ తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, విశాలమైన క్రీడా మైదానంతోపాటు ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు.పెరుగుతున్న జనాభా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తెల్లాపూర్‌లో ఆధునిక ప్రభుత్వ పాఠశాల అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఆగస్టు 17న భూమిపూజ నూతన ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి ఆగస్టు 17న భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

## ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**-దోమల నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి.**
**-ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ బాస లింగమయ్య**

**మేడిపల్లి వుదయం ప్రతినిధి ఆగస్టు 13.**



ప్రతి శుక్రవారం పట్టణాల పరిశుభ్రత లక్ష్యంగా నిర్వహించే ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పురస్కరించుకొని శుక్రవారం బోడుప్పల్ సర్కిల్ 10వ డివిజన్ లో వార్డ్ ఆఫీసర్ బాస లింగమయ్య ఆధ్వర్యంలో ALO (యాంటీ లార్వల్ ఆపరేషన్స్) బృందం చే డివిజన్ లోని పలు కాలనీల్లో దోమల నివారణకు దోమల మందు పిచికారి చేయించారు, ఈ సందర్భంగా బాస లింగమయ్య మాట్లాడుతూ..... ప్రజలు నిత్యం తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చాలా కాలంగా నీటి నిల్వలు అనగా మూతలేని నీటి డ్రమ్ములు, పాడైన వాహనాల టైర్లు, వాడి పడవేసిన కొబ్బరి బొండాలు,మొదలుగునవి దోమలకు ఆవాసాలుగా మారి దోమల వ్యాప్తి వేగంగా పెరగడానికి కారణాలుగా మారుతున్నాయి, అలా దోమల వ్యాప్తి విపరీతంగా పెరగడం వల్ల ప్రజలు వర్షాకాలం విష జ్వరాల బారిన పడే అవకాశం ఉందని అన్నారు, ప్రజలు ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా తమ ఇంటి ఆవరణలోని పరిసరాలను ఉంచుకోవాలని ఆయన కోరారు, ముఖ్యంగా చాలా కాలం నిల్వ ఉండే మురుగునీటి నిలువలను వెంటనే తొలగించి దోమల లార్వ నియంత్రణ కి భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో ALO బృందం తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దుకై ఉద్యోగుల మహాధర్నా

**- పి ఆర్ టి యు టి ఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి..**

**శంకర్ పల్లి ఆగస్టు 13(వుదయం)**



సిపిఎస్ రద్దుకై సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాద్ లోని పార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పి ఆర్ టి యు ఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం శంకర్ పల్లి మండలంలోని పాఠశాలల్లో పి ఆర్ టి యు టి ఎస్ 2026 సంవత్సరమునకు గాను సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎస్ రద్దు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పి ఆర్ సి డి వెంటనే ప్రకటించాలని కోరారు. మండలంలోని మహాలింగాపురం జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల, బుల్కాపురం, చిన్న శంకర్ పల్లి, మున్సిపల్ పరిధి గణేష్ నగర్ ప్రాథమిక పాఠశాల, అయ్యప్ప రెడ్డిగూడెం, శంకర్ పల్లి జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల పాఠశాలల్లో సభ్యత నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మండల శాఖ అధ్యక్షులు బి. మాణిక్యం, ప్రధాన కార్యదర్శి కె. బాలరాజ్, పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు రమ, ఆరిఫ్ పాషా, సంఘం కార్యవర్గ సభ్యురాలు సరిత, యాదయ్య, అంజిరెడ్డి, నరేందర్, శ్రీరాములు, మల్లేశం, ఉదయ్ కిరణ్, ఉమామహేశ్వరరావు. మల్లికార్జున్ గీతాంజలి అనుపమ తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు కార్యాచరణ

**రంగారెడ్డి**



గత సీజన్‌లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి – అదనపు కలెక్టర్ చంద్ర రెడ్డి

ఖరీఫ్ 2026-27 సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ చంద్ర రెడ్డి అధికారులను ఆదేశించారు.

ఖరీఫ్ 2026-27 ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి గురువారం నిర్వహించిన కార్యాచరణ ప్రణాళిక సమావేశంలో అదనపు కలెక్టర్ వివిధ శాఖల అధికారులు, సంబంధిత సంస్థల ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో ధాన్యం కొనుగోళ్లపై సమగ్రంగా సమీక్షించారు. గత కొనుగోలు సీజన్‌లో ఎదురైన సమస్యలు, ఇబ్బందులను పరిశీలించి, అవి ఈ సీజన్‌లో పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు సుమారు 20,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో 33 ధాన్యం కొనుగోలు కేంద్రాలు (PPCs) ఏర్పాటు చేయడానికి DRDO, DCO అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు సమావేశంలో వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, సిబ్బంది, తూకం యంత్రాలు, గన్నీ బ్యాగులు, తాగునీరు, షెడ్లు, విద్యుత్ సౌకర్యం, ధాన్యం తరలింపు వంటి అన్ని అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చిన వెంటనే నిబంధనల ప్రకారం నాణ్యత పరిశీలన, తూకం, కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

ధాన్యం నాణ్యత పరిశీలన, తూకం, రవాణా, మిల్లులకు తరలింపు తదితర ప్రతి దశలో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు స్పష్టమైన సమాచారం అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.గత సీజన్‌లో ఎదురైన సమస్యలు, లోపాలు, జాప్యాలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, కొనుగోలు ప్రక్రియ ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లను పూర్తిచేసి ప్రతి స్థాయిలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అదనపు కలెక్టర్ చంద్ర రెడ్డి స్పష్టం చేశారు.రైతులకు సకాలంలో, పారదర్శకంగా ధాన్యం కొనుగోలు సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారులు వనజాత, జిల్లా మేనేజర్ హరీష్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, షూస్ పంపిణీ

**శంకర్‌పల్లి ఆగస్టు 13(వుదయం)**



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పర్వేదలో షూస్ ను పర్వేద సర్పంచ్ సురేందర్ గౌడ్, ఉప సర్పంచ్ సునీత వెంకట్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, షూస్ ను సద్వినియోగం చేసుకొని మంచిగా చదువుకొని పరీక్షలు బాగా రాసి, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచిగా పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలకు తమ సహకారం ఎల్లపుడు ఉంటుందని వారు తెలియచేశారు. అదే విధంగా ఇవాన్సీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్వేర్ సంస్థ వారు పాఠశాలకు పది ల్యాపటాపులు అందజేశారు. నేడు విద్యారంగంలో ఉన్న టెక్నాలజీ వినియోగించుకొని, విద్యార్థులు డిజిటల్ తరగతులు వినాలానే మంచి ఆలోచనతో ల్యాప్టపులు ఇవ్వడం జరిగిందని వారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు ఏఏపీసి చైర్మన్ మంజుల, వార్డు మెంబర్లు రవి, కిట్టు సత్యనారాయణ, శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ,ఇవాన్సీస్ ప్రతినిధి మల్లికార్జున్ బృందం, ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ చారి, నందు, విశ్వనాధ్, కవిత, కాంచన లక్ష్మి, బసవరాజు పాల్గొన్నారు.

## మన ఓటు – మనకే.. ఇక మనకే రాజ్యాధికారం"

**ముషీరాబాద్, ఆగస్టు 13 (వుదయం):**



బీసీల ఆత్మగౌరవం, రాజకీయ హక్కులు, రాజ్యాధికార సాధన కోసం బీసీ సంఘాలు, బహుజన సంస్థలు, సామాజిక వర్గాలన్నీ ఏకతాటిపైకి రావాలని బహుజన రాజ్యాధికార పార్టీ పిలుపునిచ్చింది. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకునే రాజకీయాలకు చరమగీతం పాడి, తమ ఓటుతో తమ రాజకీయ నాయకత్వాన్ని ఎన్నుకునే దిశగా బీసీ ప్రజలు చైతన్యవంతం కావాలని పార్టీ నేతలు కోరారు. తెలంగాణలో జనాభాలో బీసీల వాటా గణనీయంగా ఉన్నప్పటికీ రాజకీయ ప్రాతినిధ్యం, విద్య, ఉద్యోగాలు, ఆర్థిక రంగాల్లో తగిన వాటా దక్కడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన రాజకీయ పార్టీలు బీసీలకు సముచిత రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. "మన ఓటు – మనకే.. ఇక మనకే వర్గాల బీసీలకు చట్టసభల్లో సముచిత రాజకీయ వాటా కల్పించడం, బహుజనులకు రాజ్యాధికారాన్ని సాధించడమే పార్టీ ప్రధాన లక్ష్యమని నేతలు స్పష్టం చేశారు. ప్రతి డివిజన్, ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను వివరించి రాజకీయ చైతన్యం పెంచాలని పిలుపునిచ్చారు."ఓటు మనది.. అధికారం కూడా మనదే.బీసీ-బహుజనుల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం" అని పార్టీ నేతలు స్పష్టం చేశారు.


**దక్షిణ మధ్య రైల్వే**

**ఇ-టెండరు ప్రకటన నెం.09/ డిప్యూటీ సిఎస్‌టిఇ/ఎస్‌సి/2026-27 తేది: 11.08.2026** PUB/550

భారత రాష్ట్రపతి తరపున మరియు కొరకు డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ (నిర్మాణం-II), దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు కాంపిటెంట్ అథారిటీ ఆమోదంతో దిగువ పనుల కొరకు 07.09.2026న 15.00 గం.ల వరకు ఇ-టెండరు (బహిరంగ) ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం. 01 టెండరు నెం. సి-ఎస్‌టిఇ-సి-36-5-236ఎ-2026-27. పని పేరు: (i) ద.మ.రైల్వే యొక్క హైదరాబాద్ డివిజన్ యొక్క ఎపిఎల్‌యు - ఉలింద‌కొండ మధ్య డబ్లింగ్‌కు సంబంధించి 238 కి.మీ /ఎపిఎల్‌యు నుండి 256.500 కి.మీ మధ్య టెలికమ్యూనికేషన్ సంబంధిత పనులు మరియు వరుసగా కెఆర్ఎన్‌ఎల్ & దూపాడు (ఇండోర్ & ఔట్‌డోర్ సహా బ్లాక్ కనెక్టివిటీ నకు డబ్లింగ్ కనెక్టివిటీ కొరకు అలంపూర్ & దూపాడు వద్ద ఇ1 నకు ఆల్టరేషన్స్ & కర్నూలు టౌన్ & దూపాడు స్టేషన్ల వద్ద ఇన్‌బిల్ట్ బ్లాక్‌తో ఎలక్ట్రిక్ ఇంటర్ లాకింగ్ ఏర్పాటు చేయుటతోపాటు ఎంఎసిపిఎల్ఎస్ ఇండోర్ మరియు ఔట్‌డోర్ పనులు. (ii) యుటిలిటీ షిఫ్టింగ్ మరియు స్లైట్ వర్కింగ్ కూడా ఇట్టి పని యొక్క భాగంగా ఉన్నవి. (iii) హెచ్‌డిడి /మైక్రో టన్నెలింగ్ పద్ధతి (అనగా రిడండెంట్ పాత్) తో ట్రాక్ యొక్క ఇతర వైపున 2x48 ఎఫ్ మరియు ఒకవైపున క్వాడ్ మరియు 2x48ఎఫ్ మ్యాట్ జగుటకు మరియు ఇచ్చిన కంప్లీట్ సెక్షన్‌లో ట్రాక్ యొక్క ఇరువైపులా ఓఎఫ్‌సి 4x48ఎఫ్ వేయవలెను. సుమారు విలువ (₹): 153582639/-, బిడ్ సెక్యూరిటీ (₹): 3071700/-, పూర్తిచేయు కాలం: 12 నెలలు.

1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కొరకు దయచేసి వెబ్‌సైట్ https://ireps.gov.in నకు లాగిన్ కండి.
2) బిడ్ సెక్యూరిటీ చెల్లింపును షెడ్యూలు కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి బ్యాంకు గ్యారంటీ బాండ్‌గా సమర్పించవలెను లేదా ఇ-పేమెంట్ గేట్ వే ద్వారా నగదు రూపంలో కాని జమ చేయవలెను.
3) టెండరుదారులు టెండరు ముగింపునకు 15 రోజుల కాలవ్యవధి అయిన టెండరు సమర్పించు కాలంలో వారి ఆఫరును ఆన్‌లైన్‌లో సమర్పించాలి.
4) టెండరుదారులు టెండరు సమర్పించు కాల వ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును) కొరకు గమనించగలరు.

డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికమ్యూనికేషన్ ఇంజనీర్, (నిర్మాణం-II)/సికింద్రాబాద్

**ఇ-టెండరు ఆహ్వానిస్తూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)** PUB/551

భారత రాష్ట్రపతి తరపున మరియు కొరకు చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (నిర్మాణం), దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు టెండరింగ్ యొక్క సింగిల్ ప్యాకెట్ విధానంలో దిగువ పనుల కొరకు ఇ-టెండరు ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.01, ఎన్ఐటి నెం. టెండరు నెం.:04-2026-27-ఇ-జిఎస్-సిఎస్ 07.08.2026, పని పేరు: టెండరు నెం.: 04-2026-27-ఇ-జిఎస్-సిఎస్-టిఎస్ఎంటి/మౌలాలి: టిఎస్ఎంటి / మౌలాలి వద్ద వందేభారత్ రేకుల యొక్క నిర్వహణ కొరకు మౌలిక సదుపాయాలు విస్తరించుట. అంచనా విలువ (₹): 23068460.31/- ఇఎండి (₹): 461400.00/-, డాక్యుమెంట్ ధర: లేదు. పూర్తిచేయు కాలం: 06 (నెలలు). ముగింపు తేది: 03.09.2026న 15.00 గం.లు.

1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కొరకు దయచేసి వెబ్‌సైట్ http://ireps.gov.in నకు లాగిన్ కండి.
2) బయానా సొమ్ము ధరావతు మరియు టెండరు డాక్యుమెంట్ ధర చెల్లింపు ఐఆర్ఇపిఎస్ లో ఆన్‌లైన్‌లో అందుబాటులోగల నెట్ బ్యాంకింగ్ / పేమెంట్ గేట్‌వే సదుపాయాల ద్వారా మాత్రమే చేయవలెను.
3) టెండరుదారు టెండరు ముగింపునకు 15 రోజుల కాలవ్యవధి అయిన టెండరు సమర్పించు కాలంలో వారి ఆఫరును ఆన్‌లైన్‌లో సమర్పించాలి.
4) టెండరుదారు టెండరు సమర్పించు కాల వ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును) కొరకు గమనించగలరు.

చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (నిర్మాణం), సికింద్రాబాద్

**ఇ-టెండరు ఆహ్వానిస్తూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)** PUB/552

భారత రాష్ట్రపతి తరపున మరియు కొరకు చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ నిర్మాణం, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు టెండరింగ్ యొక్క సింగిల్ ప్యాకెట్ విధానంలో దిగువ పనుల కొరకు ఇ-టెండరు ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.01, ఎన్ఐటి నెం. ఇ29సిటిఆర్‌డి ఎస్‌సి. 07.2026-27 తేది: 07.08. 2026 పని పేరు: టెండరు నెం.: ఇ29సిటిఆర్‌డి ఎస్‌సి.07.2026-27 తేది: 07.08.2026 "దక్షిణ మధ్య రైల్వే యొక్క నాందేడ్ డివిజన్‌లో అకోలా యార్డులో ప్రతిపాదిత కొత్త లైన్ల దృష్ట్యా ప్రస్తుత ఓహెచ్ఈ నకు మోడిఫికేషన్లు సహా 25కెవి, 50హెచ్‌జెడ్ సింగిల్ ఫేజ్ ఎసి ట్రాక్షన్ ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్ ఎల్ 65 చ.మి.మీ కేటనరీ మరియు 107/150 చ.మి.మీ కాంటాక్ట్ వైర్, ఎటిటి సప్లై ట్రాన్స్‌ఫార్మర్ స్టేషన్ల యొక్క రూపకల్పన, సరఫరా, స్థాపించుట, పరీక్షించుట & పని చేయించుట. అంచనా విలువ (₹): 2,06,36,496.50/- ఇఎండి/ బిడ్ సెక్యూరిటీ (₹): 4,12,700.00, డాక్యుమెంట్ ధర: ఆన్‌లైన్ టెండరు డాక్యుమెంట్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. పూర్తిచేయు కాలం: 09 నెలలు. ముగింపు తేది: 03.09.2026న 15.00 గం.లు.

1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కొరకు దయచేసి వెబ్‌సైట్ http://ireps.gov.in నకు లాగిన్ కండి.
2) బిడ్డరు IREPS.gov.in ద్వారా బిడ్ సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి లేదా భారతదేశములోని షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకు నుండి బ్యాంకు గ్యారంటీ బాండ్‌గా సమర్పించాలి. బ్యాంకు గ్యారంటీ బాండ్ అనుబంధం-VII ప్రకారం ఉండాలి మరియు అది బిడ్ చెల్లుబాటయ్యే కాల వ్యవధి తరువాత 90 రోజులు కాల వ్యవధి కొరకు చెల్లుబాటవ్వాలి. డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్స్ చెక్, డిపాజిట్ రసీదులు, ఎఫ్‌డిఆర్ మొదలగు వాటి ద్వారా స్వయంగా చెల్లింపులు అనుమతించబడవు.
3) టెండరుదారు టెండరు ముగింపునకు 15 రోజుల కాలవ్యవధి అయిన టెండరు సమర్పించు కాలంలో వారి ఆఫరును ఆన్‌లైన్‌లో సమర్పించాలి.
4) టెండరుదారు టెండరు సమర్పించు కాల వ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును) కొరకు గమనించగలరు.

చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ నిర్మాణం, సికింద్రాబాద్

**ఇ-టెండరు ఆహ్వానిస్తూ ప్రకటన (https://ireps.gov.in ద్వారా)** PUB/553

భారత రాష్ట్రపతి తరపున మరియు కొరకు సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ వారు టెండరింగ్ యొక్క సింగిల్ ప్యాకెట్ సిస్టంలో దిగువ పనుల కొరకు ఇ- టెండర్లు ఆహ్వానిస్తున్నారు:

క్ర.సం.01: ఎన్ఐటి నెం.: సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/18/2026-27 పనిపేరు: టెండరు నెం. సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/18/2026-27 తేది: 10.08.2026, టిఆర్‌డి అరేంజ్‌మెంట్లు: మాణిక్‌పూర్: కాజీపేట - బల్లార్షా సెక్షన్‌లో బల్లార్షా ఎండ్ వైపు డౌన్ లైన్‌లో మాణిక్‌పూర్ వద్ద గూడ్స్ లోడింగ్ లైన్ ఏర్పాటు చేయుట. అంచనా విలువ (₹): 2,18,42,054.80, పూర్తి చేయు కాలం: 12 నెలలు, ముగింపు తేది: 02.09.2026న 15.00 గం.లు.

క్ర.సం.02: ఎన్ఐటి నెం.: సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/19/2026-27 పనిపేరు: టెండరు నెం. సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/19/2026-27 తేది: 10.08.2026, ఎస్‌సి-వాడి సెక్షన్-రుక్మాపూర్: ఎస్‌సి-వాడి సెక్షన్‌లో వాడి ఎండ్ అప్‌లైన్ సైడ్‌పై రుక్మాపూర్ స్టేషన్ వద్ద లాంగర్ లూప్‌లైన్ ఏర్పాటు చేయుట - టిఆర్‌డి అరేంజ్‌మెంట్లు. అంచనా విలువ (₹): 1,81,11,838.2/-, పూర్తి చేయు కాలం: 12 నెలలు, ముగింపు తేది: 02.09.2026న 15.00 గం.లు.

క్ర.సం.03: ఎన్ఐటి నెం.: సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/20/2026-27 పనిపేరు: టెండరు నెం. సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/20/2026-27 తేది: 10.08.2026, (1) టిఆర్‌డి అరేంజ్‌మెంట్లు - ఎన్‌జెడ్‌బి-ఎస్‌సిఎల్ సెక్షన్ యొక్క మూడు (3) టెండర్ల మ్యాన్డ్ నాన్ ఇంటర్ లాకింగ్ లెవెల్ క్రాసింగ్ గేట్లు (ఎల్‌సి నెం. 42, 24 & 15) యొక్క ఇంటర్ లాకింగ్ (2) పిపిజెడ్ స్టేషన్ వద్ద ఒక గుంటీ మరియు ఆర్‌జిపిఎం స్టేషన్ వద్ద ఎండ్ గూంటీకు రెండు టెండర్లకు సంబంధించి ఎటి లు ఏర్పాటు చేయుట. (3) ఆర్‌డిఎం స్టేషన్ వద్ద ఆర్‌బిజి & ఎండ్ జంక్షన్ల యొక్క నిర్మాణము కొరకు ప్రతిపాదన - టిఆర్‌డి అరేంజ్‌మెంట్లు - సంబంధించి. అంచనా విలువ (₹): 95,46,792.24, పూర్తి చేయు కాలం: 4 నెలలు, ముగింపు తేది: 04.09.2026న 15.00 గం.లు.

1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కొరకు దయచేసి వెబ్‌సైట్ http://ireps.gov.in నకు లాగిన్ కండి.
2) టెండరు షరతులు/ఇతర వివరాలు ireps.gov.in వద్ద ఐఆర్ఇపిఎస్ వెబ్‌సైట్‌పై టెండరు డాక్యుమెంట్లలో లభిస్తాయి. వీటిని డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును, పాల్గొనవచ్చును మరియు ఏదేని మార్పులు ఉంటే పరిశీలించవచ్చు.
3) టెండరుదారు టెండరు సమర్పించు కాల వ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును) కొరకు దయచేసి గమనించగలరు.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, టిఆర్‌డి, సికింద్రాబాద్

**టెండరు నెం టిఎం265001ఎ** PUB/554

దిగువ టెండరు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా విడుదల చేయబడినది. టెండరుదారులు వెబ్‌సైట్ www.ireps.gov.in దర్శించవలసిందిగా మరియు వారి ఆఫర్లు సమర్పించవలసిందిగా కోరబడుచున్నారు. స్వయంగా లేదా పేపరుపై సమర్పించే ఆఫర్లు అంగీకరించబడవని దయచేసి గమనించగలరు. పోస్టుద్వారా పంపే ఆఫర్లు పరిశీలించబడం జరగదు.

క్ర.సం.01, టెండరు నెం.: టిఎం265001ఎ వివరణ: అన్‌అటెండెడ్ యూనికల్ బాక్స్ యాక్సిలరేషన్ మెజర్‌మెంట్ సిస్టం (యుఎబిఎఎంఎస్) యొక్క సరఫరా, స్థాపించుట & పని చేయించుట. టెండరు విలువ (₹): 9301421/ గడువు తేది: 03.09.2026.

పూర్తి వివరాల కొరకు దయచేసి www.ireps.gov.in చూడండి.

డిప్యూటీ చీఫ్ ఇంజనీర్/టిఎం/హెచ్‌క్యూ A641

తదుపరి టెండరు షరతులు/వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దయచేసి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.



**IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE:CITY CIVIL COURT AT SECUNDERABAD**
**O.S.NO. 1007 OF 2024**

**Between:**
State Bank of India, Mudfort Branch,
Situated Secunderabad
**...Plaintiff**

**AND**

Mr. Ganapathinidi Venkateshwara Rao
**...Defendants**

To,
Mr. Ganapathinidi Venkateshwara Rao S/o. Late. Achyutha Ramaiah Aged about: 51 years,Occ:Rank CT/GD, Barrack No.4, GC CRPF Campus, Keshogiri, Barkash, Chandrayangutta, Hyderabad-500005.
**...Defendants**

Please take Notice that the above-named plaintiff Bank has filed above suit Against you, for recovery of its dues and subsequent interest Rs. **2,15,042 / -** Your are here by summoned to appear in the above court. The Hon'Ble court posted the above case on **17-09-2026** .at10.30.a.m.for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

***(By Order Of the Court)***

**Sd/-**
**B.YOGENDRA PRASAD,**
**Advocate**
**H.No.3-5-218/55,Krishna Nagar Colony,Moulali,Hyderabad.**

**IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE:CITY CIVIL COURT AT SECUNDERABAD**
**O.S.NO. 1002 OF 2024**

**Between:**
State Bank of India, Mudfort Branch,
Sikh Village,Secunderabad.
**...Plaintiff**

**AND**

Mr. Lieutrnant Mallela Naresh
**...Defendants**

To,
Mr. Lieutrnant Mallela Naresh S/o. Srinivasa Rao, aged about 38 years, R/O 54, Artillery Brigade, PIN 926954, C/O 56 APO, Bowenpally, Hyderabad-500011.
**...Defendants**

Please take Notice that the above named plaintiff Bank has filed above suit Against you, for recovery of its dues and subsequent interest, of Rs. **8,09,783 /--** Your are here by summoned to appear in the above court. The Hon'Ble court posted the above case on : **29-09-2026** .at10.30.a.m.for your appearance either in person or through an advocate,failing which the case will be heard and decided on merits in your absence.

***( By Order Of the Court)***

**Sd/-**
**B.YOGENDRA PRASAD,**
**Advocate**
**H.No.3-5-218/55,Krishna Nagar Colony,Moulali,Hyderabad.**




## నీళ్ల విషయంలో రాజీపడేదే లేదు

"తెలంగాణ నీటి వాటాల విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీ.ఆర్.ఎమ్.బీ) సమావేశానికి హాజరవుతాం. రాష్ట్ర ప్రయోజనాల కోసం బలమైన వాదనలను వినిపిస్తాం. నీటి వాటాల విషయంలో గత బీఆర్ ఎస్ ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేసింది. కానీ మా ప్రభుత్వం కృష్ణా, గోదావరి జలాల్లో నీటి వాటాలను సాధించి తీరుతుంది. కేంద్రం ఇబ్బంది పెట్టినా వదిలేది లేదు. రాష్ట్రంలో పరిశ్రమలకు ప్రోత్సాహాలు ఇవ్వాల్సిన అవసరముంది. తెలంగాణ నీటి వాటాల విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదు."

- దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర మంత్రి

## వే'మన'పద్యం

పాలు పంచదార పాపర పండ్లలోఁ
జాలఁబోసి వండఁ జవికిరావు
కుటిల మానవులకు గుణమేల కల్గురా
విశ్వదాభిరామ! వినుర వేమ!



## సంపాదకీయం

# పేదల కడుపు నింపాలి

రేషన్‌కార్డుల అసలు లక్ష్యం ఆహారభద్రత. కానీ ప్రజలకు అవి పూర్తిస్థాయి ప్రయోజనాన్ని అందించలేక పోతున్నాయి. ఆ కార్డును ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హతగా పరిగణించడం దాని అసలు లక్ష్యాన్ని దెబ్బతీ స్తున్నాయి. పాలక పార్టీలు అధికార కాంక్షలకు ఆ కార్డులను ఆయుధంగా వాడుకుంటున్నాయి. ఓట్లు, సీట్ల రాజకీయాల చేస్తూ కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల రాయితీలిస్తున్నాయి. నిరుపేదలకొచ్చేసరికి లెక్కలు కడుతున్నాయి. అంతేగాక ఉచితాల పేర పథకాలను ఎత్తేసే కుట్రలూ చేస్తున్నాయి. కొత్త పథకాల సంగతి పక్కనబెడితే, ఉన్నవి ఊడపీకే పరిస్థితులను కల్పి స్తున్నాయి. రేషన్‌కార్డుల ద్వారా కనీస సరుకులు ఇవ్వాల్సిందిపోయి, బియ్యమొక్కటేనన్న దుస్థితికి లబ్దిదారులను నెట్టేశాయి. తెలంగాణలో 2014 తర్వాత కొత్త రేషన్ కార్డులివ్వలేదు. నూతనంగా పెండ్లి చేసుకున్న వారికి, వలసెళ్లిన వారికి కార్డులు మంజూరు కావడం లేదు. చిన్న చిన్న కారణాలతో ఉన్న కార్డులను రద్దుచేసే పరిస్థితి నెలకొంది. అన్నీ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ప్రాథమిక కెవైసీగా మారింది. కొత్తగా తెల్ల రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15న సంగారెడ్డిలో చేపట్టనుంది.వీటిని కొత్తగా ఇవ్వడం లేదు. కార్డుల సంఖ్యను పెంచితే సరిపోతుందనే భావనలో ప్రభుత్వం ఉంది. అదే గొప్పగా అన్నట్టుగా వ్యవ హరిస్తున్నది. ఈ కార్డులతో ఉపయోగం అంతంత మాత్రమే. నిరుపేదల కనీసావసరాలనూ తీర్చడం లేదు. ఆయా ప్రభుత్వాలు వీటిని దశలవారీగా నిర్వీర్యం చేస్తూ వస్తున్నాయి. గతంలో ఇచ్చిన సరుకులేవి లబ్దిదారులకు నేడు అందడం లేదు. దారిద్ర్యరేఖ దిగువనున్న వారికి రేషన్‌కార్డులను ఎర వేయడం ద్వారా ఎన్నికల రాజకీయాలను గట్టెక్కే ప్రయత్నమే ఎక్కువగా జరుగుతున్నది. ఆ ఇచ్చే కార్డులతో ప్రజలకు ఎంతమేరకు మేలు జరుగుతున్నది ? ఏ తరహా ప్రయోజనం ఒనగూరుతున్నదనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.ఒట్టి బియ్యమిచ్చి అదే పదివేలు అన్నచందంగా మార్చే శారు. ఉమ్మడి రాష్ట్రంలో బియ్యంతోపాటు కంది, గోధుమలు, పామా యిల్, ఉప్పు, చక్కెర, చింత పండు, కారం, పసుపు తదితర తొమ్మిది రకాల వస్తువులకు నిరుపేదలకు చేరేవి. అప్పట్లో కిరోసిన్ సైతం సరఫరా జరిగేది. అనక గులాబీ సర్కారు కాస్త సంచిని మొత్తం ఖాళీ చేసేసింది. పూర్తిగా బియ్యంతో నింపేసింది. దీంతో సామాన్యులు పౌష్టికా హార లోపాన్ని తీవ్రంగా ఎదుర్కోవాల్సి వస్తున్నది. ప్రధానంగా పిల్లలు, మహి ళలు, రక్తహీనతకు లోనై అనారోగ్యం పాలవు తున్నారు. అది ఏకంగా జాతీయ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ఉండాల్సిన బరువును కోల్పోయే దుస్థితికి కారణమైంది. మానసిక, శారీరక ఎదుగుదలా మందగిస్తున్నది. కోటికిపైగా రేషన్‌కార్డులి స్తున్నామంటూ గొప్పలుపోతున్న సర్కారు, అమ్మహస్తం సంచిని తిరిగి నింపి నిరుపేదలకు పంచుతుందా? లేదా? అనే సంగతిని పంద్రాగస్టున జరిగే సంగారెడ్డి సభలో ప్రకటించాలి. అంతకుముందు రోజున జరిగే రాష్ట్ర క్యాబి నెట్‌నూ చర్చించాలి. వామపక్ష సర్కార్ కేరళలో అధికారంలో ఉన్నప్పుడు పద్నాలుగు రకాల సరుకులను అందించింది. అక్కడ అమలు చేసిన విధానాన్ని తెలుసుకోవాలి. పేరుకు కార్డులిచ్చి 'తాంబూలాలిచ్చాం తన్నుకు చావండి' అంటే సరిపోదు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్న ముఖ్యమంత్రి, మంత్రుల హామీలు ఆచరణలో రుజువు చేయాలి. రాజకీయ భావోద్వేగాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, తన మ్యానిఫెస్టోను మననం చేసుకోవాలి. ఆ దిశగా సర్కారును నడిపించాలి. రాజకీయ పక్షాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండటం సహజం. ఉండాలి కూడా. లేకపోతే భావాల ఘర్షణ జరగదు. పాలన రొటీన్‌గా సాగి ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలుగుతుంది. బహిరంగ మార్కెట్‌ను చూస్తే భారాలమయంగా మారింది. సర్కారీ రేషన్‌షాపులు, సూపర్‌బజార్లలో సరుకులు నిండుకుంటున్నాయి. ప్రతిమనిషికి నెలా నెలా ఆరుకిలోల బియ్యం ఇస్తే సరిపోతుందా? అనేది ఆలోచించాలి. అన్నం పెట్టినోళ్లు, మిగతా వాటి గురించి ఎందుకు పట్టించుకోరు? కోవిడ్ సమయంలో కీలకపాత్ర పోషించిన రేషన్‌డీలర్లను నామమాత్రం చేశారు. నేడు రేషన్‌కార్డు ఒక 'మాస్టర్ కీ'గా మారి పోయింది. కార్డు లేకపోతే ఆరోగ్యశ్రీ లేదు, పెన్షన్ లేదు, ఇల్లూ లేదు. సర్కార్ రకరకాల సరుకులివ్వడం ద్వారా రేషన్‌కార్డును బలోపేతం చేస్తేనే నిరుపేద కడుపు నిండుతుంది. ఈ విషయాన్ని పాలకులు గుర్తెరగాలి. ఆదిశగా కార్యా చరణ చేపట్టాలి. లేదంటే భవిష్యత్తులో రేషన్ కార్డు అంటే పథకాలకు లబ్దిదారులను గుర్తించడానికేనని అనుకోవాల్సి వస్తుంది.



## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020



పైడిమర్రి సుబ్బారావు

## పాఠశాలల్లో "ప్రతిజ్ఞ" రచయిత

మనదేశంలో ఉదయం దాదాపు ప్రతి పాఠశాలలో ప్రార్థనా సమయంలో ఇంగ్లీష్ లోనో, తెలుగు లోనో, ఇతర భాషలలోనో తప్పని సరిగా పిల్లలు చదివే "భారత దేశం నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు.." అనే "ప్రతిజ్ఞ" (ప్లెడ్జ్) రాసిన గొప్ప జాతీయ భావాలు కలిగిన రచయిత మాత్రం చాలా మందికి తెలియదు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాల దిన చర్యను ప్రారంభించే ముందు వందే మాతరం, జనగణమన జాతీయ గీతాలతో పాటు 'భారతదేశము నా మాతృభూమి..' అనే ప్రతిజ్ఞను సామూహికంగా చేసే విషయం నిత్య అనుసరణీయమే.వందేమాతరం రాసింది బంకించంద్ర ఛటర్జీ, జనగణమన రాసింది రవీంద్రనాథ్ ఠాగూర్ అని, సారే జహాసే అచ్ఛా రాసింది మహమ్మద్ ఇక్బాల్ అని పిల్లలను అడిగితే సమాధానం చెప్తారు. పాఠశాల క్విజ్ పోటీలలో తప్పక వేసే ప్రశ్నలు ఇవి. కానీ ప్రతిజ్ఞ రచయిత గురించి పుస్తకాలలో లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియ పరచకుండా ఉంచడమే బాధాకరం. తెలంగాణ లోని నల్గొండ సమీపంలోని అన్నెపర్తిలో పుట్టడమే ఆయన చేసుకున్న పాపమో, లేక ఈ తెలంగాణ గడ్డకు కలిగిన శాపమో? నాటి పాలకుల పక్షపాత వైఖరియో తెలియదు కాని...జాతీయ భావం ప్రేరేపించే ప్రతిజ్ఞ యాభై ఏళ్లకు పైబడి పాఠ్య పుస్తకాల్లో ముద్రితమై కనిపిస్తున్నా అది రాసిన రచయిత పేరు దశాబ్దాలుగా ఎక్కడా ప్రస్తావించక పోవడం బాధాకరం. తెలుగుతో పాటు సంస్కృతం, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, గుజరాతీ, మరాఠీ.. తొమ్మిది భాషల్లోకి అనువాదమై, ఆరు దశాబ్దాల కిందటి నుంచే పాఠ్య పుస్తకాల్లో ప్రచురించిన ఈ ప్రతిజ్ఞను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గుర్తించడం గమనార్హం. కారణం ఈ ప్రతిజ్ఞను రాసింది తెలంగాణ వాసి కావడమే. ఆయనే నల్గొండ జిల్లా, అన్నెపర్తికి చెందిన తెలుగు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు. వెంకట సుబ్బారావు (1916 జూన్ 10 – 1988 ఆగష్టు 13) 1916, జూన్ 10న పైడిమర్రి వెంకట రామయ్య, రాంబాయమ్మ దంపతులకు నల్లగొండ కేంద్రానికి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండ లోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు. హైదరాబాద్ రాష్ట్రం లోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన జమిందారీ, భూస్వామ్య వెట్టిచాకిరీని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. ఆయన తన 18వ ఏటనే కాలభైరవుడు (1936) పేరున చిన్న నవల రాశారు. దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్య కావ్యాలు, బ్రహ్మ చర్యము, గృహస్థ జీవితము, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార, శ్రీమతి అనే నాటకాలు రాశారు. సింగపురీ నృకేసరీ శతకం, బాల రామాయణం మొదలైన రచనలు, అనేక అనువాద రచనలు కూడా చేశారు. గోలకొండ, సుజాత, ఆంధ్రపత్రిక, భారతి, నవజీవన్, ఆనందవాణి పత్రికలలో అయన రచనలు ప్రచురితమైనాయి. ఆయన పద్యాలు గోలకొండ కవుల సంచికలోను, కథలు ఉషస్సు కథా సంకలనం, తెలంగాణ తొలితరం కథలులో 'నౌకరి' కథ వచ్చింది.

రామ కిష్టయ్య సంగన భట్ల,

# యువతే దేశానికి దశా దిశ

దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉంటుంది. యువత విజ్ఞానం, శ్రమ, శాస్త్రీయ దృక్పథంతో ఎదిగితే దేశం అభివృద్ధి చెందుతుంది. కానీ మార్కెట్ శక్తులు రూపొందించిన వినిమయ సంస్కృతి వలలో యువత చిక్కుకుంటే సమాజం తీవ్రమైన మూల్యం చెల్లించాల్సి వస్తుంది. నేటి వ్యవస్థ యువతను పౌరులుగా మాత్రమే కాకుండా నిరంతరం వినియోగదారులుగా మార్చేందుకు ప్రయత్నిస్తోంది. మొబైల్ ప్రకటనలు, సోషల్ మీడియా, వినోదం, ఆన్‌లైన్ మార్కెట్, డిజిటల్ సేవలు యువత సమయం, దృష్టి, డబ్బును ఆకర్షిస్తున్నాయి.

ఇది వ్యక్తిగత అలవాటు మాత్రమే కాదు, లాభాల కోసం మార్కెట్ వ్యవస్థ రూపొందించిన సామాజిక, ఆర్థిక వ్యూహం. వినిమయ సంస్కృతి అంటే వస్తువులు కొనడం మాత్రమే కాదు. మనిషి ఆలోచనలు, సంబంధాలు, కలలు, అభిరుచులు, భవిష్యత్తును కూడా మార్కెట్‌కు అప్పగించే పరిస్థితి. ప్రకటనలు కొత్త అవసరాలను సృష్టిస్తూ, ఖరీదైన వస్తువులు, బ్రాండ్లు, విలాస జీవితాన్ని విజయానికి చిహ్నాలుగా చూపిస్తున్నాయి. సోషల్ మీడియా నిరంతర పోలికలు, లైక్స్, ఫాలోవర్లు, వైరల్ కావాలనే ఒత్తిడిని పెంచుతూ సమయాన్ని వృథా చేయడంతో పాటు మానసిక ఒత్తిడికి కారణమవుతోంది. డ్రగ్స్, మద్యం, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్ వంటి వ్యసనాలు యువత జీవితాలను, కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తున్నాయి.సినిమా, ఓటీటీ, సీరియల్స్, వినోద పరిశ్రమల్లో లాభాల కోసం విలాస జీవితం, అధిక వినియోగం, హింస, మూఢనమ్మకాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. క్రీడలు కూడా వ్యాపారీకరణకు గురై కార్పొరేట్ లాభాల సాధనంగా మారుతున్నాయి. కృత్రిమ మేధస్సు వంటి సాంకేతికతను సక్రమంగా వినియోగించకపోతే తప్పుడు సమాచారం, డీప్‌ఫేక్‌లు, డేటా నియంత్రణ వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.మీడియా ప్రజలకు సమాచారం అందించాల్సిన సాధనం అయినప్పటికీ సంచలనాలు, ప్రకటనలు, వినోదం కోసం అసలు ప్రజా సమస్యలను పక్కకు నెట్టే పరిస్థితి ఏర్పడింది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్య, వైద్యం వంటి సమస్యలపై ప్రజల దృష్టి తగ్గుతోంది. అవకాశవాద రాజకీయాలు కూడా యువతను డబ్బు, మద్యం, కులం, మతం, ప్రాంతీయ విభజనల ద్వారా ప్రభావితం చేస్తున్నాయి. రుణ సంస్కృతి వస్తువులపై వ్యామోహాన్ని పెంచి, ఈఎంఐలు, క్రెడిట్ కార్డులు, అప్పుల ద్వారా యువతను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతోంది. నిరుద్యోగం, కాంట్రాక్ట్ ఉద్యోగాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం యువతలో భవిష్యత్తుపై ఆందోళన పెంచుతున్నాయి. విద్య కూడా వ్యక్తిత్వ వికాసం కంటే మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మారుతోంది.

మరోవైపు ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్, బ్రాండ్ల ప్రభావం యువత ఆహారపు అలవాట్లను మార్చి ఆరోగ్య సమస్యలకు దారి తీస్తోంది.త్వరగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో బెట్టింగ్, జూదం, ప్రమాదకరమైన ట్రేడింగ్, మోసపూరిత పథకాలు, సైబర్ నేరాలు వంటి వాటివైపు కొందరు ఆకర్షితులవుతున్నారు. వినిమయ సంస్కృతితో పాటు మతోన్మాదం, మనువాద భావజాలం కూడా యువతను శాస్త్రీయ దృక్పథం నుంచి దూరం చేస్తున్నాయి. మతం, కులం, జాతి పేరుతో విభజిస్తూ నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్య, వైద్యం, ఆకలి వంటి అసలు సమస్యలను మరచిపోయేలా చేస్తున్నాయి. ఖరీదైన ఫోన్లు, బ్రాండెడ్ దుస్తులు, విలాస జీవితం, త్వరగా ధనవంతులు కావాలనే ఆకాంక్షలు యువతను వాస్తవ జీవిత సమస్యల నుంచి దూరం చేస్తున్నాయి. అయితే పరిస్థితి పూర్తిగా నిరాశాజనకంగా లేదు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత ఉద్యోగాల కోసం, పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా, రైతులు, మహిళలు, కార్మికులు, పర్యావరణం, ప్రజా విద్య, వైద్యం కోసం జరుగుతున్న ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. ఇది యువతలో సామాజిక చైతన్యం ఇంకా సజీవంగా ఉందని చూపుతోంది. చరిత్రలో ప్రతి గొప్ప మార్పులో యువత కీలక పాత్ర పోషించింది.సమాజాన్ని మార్చేది వినియోగం కాదు.. చైతన్యం. భవిష్యత్తును నిర్మించేది విలాస జీవితం కాదు.. ప్రజల కోసం చేసే పోరాటం. నేటి యువత తమ శక్తిని డ్రగ్స్, బెట్టింగ్, వ్యసనాల వైపు కాకుండా జ్ఞానం, శ్రమ, సృజనాత్మకత వైపు మళ్లించాలి. మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి. సోషల్ మీడియాను వ్యసనంగా మార్చుకోకుండా విజ్ఞానం, సమాచారం, సామాజిక చైతన్యం కోసం వినియోగించాలి. మతోన్మాదం, కుల వివక్షలకు బదులుగా మానవత్వం, సమానత్వం, సోదరభావాన్ని పెంపొందించాలి. అవకాశవాద రాజకీయాలకు బదులుగా ప్రజాస్వామ్య విలువలను కాపాడే శక్తిగా యువత ఎదగాలి. సమాజం, చరిత్ర, ఆర్థిక వ్యవస్థలను అధ్యయనం చేస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన పెంచుకోవాలి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్య, వైద్యం, సామాజిక అసమానతలు వంటి సమస్యల పరిష్కారం కోసం జరిగే ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలి. విద్యార్థి, యువజన, కార్మిక, రైతు ఉద్యమాలతో కలిసి సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల కోసం గొంతెత్తాలి. సమాజాన్ని మార్చే శక్తి యువత చేతుల్లోనే ఉందన్న సత్యాన్ని గుర్తించాలి.





మొబైల్ ప్రకటనలు, సోషల్ మీడియా, వినోదం, ఆన్‌లైన్ మార్కెట్, డిజిటల్ సేవలు యువత సమయం, దృష్టి, డబ్బును ఆకర్షిస్తున్నాయి. ఇది వ్యక్తిగత అలవాటు మాత్రమే కాదు, లాభాల కోసం మార్కెట్ వ్యవస్థ రూపొందించిన సామాజిక, ఆర్థిక వ్యూహం. వినిమయ సంస్కృతి అంటే వస్తువులు కొనడం మాత్రమే కాదు. మనిషి ఆలోచనలు, సంబంధాలు, కలలు, అభిరుచులు, భవిష్యత్తును కూడా మార్కెట్‌కు అప్పగించే పరిస్థితి. ప్రకటనలు కొత్త అవసరాలను సృష్టిస్తూ, ఖరీదైన వస్తువులు, బ్రాండ్లు, విలాస జీవితాన్ని విజయానికి చిహ్నాలుగా చూపిస్తున్నాయి. సోషల్ మీడియా నిరంతర పోలికలు, లైక్స్, ఫాలోవర్లు, వైరల్ కావాలనే ఒత్తిడిని పెంచుతూ సమయాన్ని వృథా చేయడంతో పాటు మానసిక ఒత్తిడికి కారణమవుతోంది. డ్రగ్స్, మద్యం, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్ వంటి వ్యసనాలు యువత జీవితాలను, కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తున్నాయి.

## నమ్మకం

అక్రమ సంపాదన ...
పరాయి స్త్రీ వ్యామోహం
సంపన్నుల చేత కూడా..
జైలు కూడు తినిపిస్తాయి !

నమ్మిన వాళ్లను వదలకు..
నమ్మని వాళ్ల వెంటపడకు
నమ్మకం ఓ అరుదైన సుగుణం
నమ్మకమే నీ ధైర్యం కావాలి !

దొరక్కపోతే నోరూరుతుంది
బాగా దొరికితే రుచి పోతుంది
దొరికిన దానితో తృప్తిపడు
దొరకని దాని వెంట పడకు !

అందరూ ఏడిపించే వారే..
నువ్వు నవ్వులను పంచు
ఏడిపించడం రాక్షసత్వం
నవ్వించడం దైవత్వం !

జేబులోని మల్లె పూలు..
పరిమళాల్ని పంచుతాయి
మనసులోని మంచి గుణాలు ..
మానవత్వాన్ని పంచుతాయి !


మధుపాళీ
9949700037

# యాదవ వృత్తి సంస్కృతి – గొర్ల పోచమ్మ పండుగ

మానవ నాగరికత వికాస పరిణామ క్రమంలో పశుపోషణ అనేది అత్యంత ప్రాచీనమైనది, సామాజిక ఆర్థిక వ్యవస్థకు మూలమైనది. తెలుగు నేలపై యాదవుల జీవన వృత్తి పశుపోషణతోనే ముడిపడి ఉంది. సమాజానికి తమ నిరంతర శ్రమను, పశుసంపదను అందిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించే విశిష్ట జీవన విధానం వారిది. యాదవులు తాము కాపాడుకునే, తమకు ఆధారమైన మూగజీవాలను కేవలం జంతువులుగా కాకుండా వారి ప్రాణ సమానంగా భావిస్తారు. అడవుల్లో మేతకు వెళ్లే ఆవులు, గొర్రెల మందలను క్రూర జంతువుల నుండి, రోగాల బారిన పడకుండా రక్షించే ప్రత్యక్ష దైవంగా వారు గొర్ల పోచమ్మను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. ఈ ఆరాధన వెనుక యాదవుల శ్రమజీవన సౌందర్యం, ప్రకృతితో వారికున్న అవిచ్ఛిన్నమైన బంధం, తరతరాలుగా వస్తున్న విశిష్టమైన వృత్తి సంస్కృతి దాగి ఉన్నాయి.యాదవుల జీవనంలో గొర్ల పోచమ్మ పండుగ, బోనాల నిర్వహణకు ఒక నిర్దిష్టమైన కాల నియమం ఉంది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వచ్చే శ్రావణ మాసపు (ఆగస్టు) చివరి ఆదివారం నాడు అమ్మవారికి అత్యంత వైభవంగా బోనాలు సమర్పిస్తారు. ఆ సమయంలో వర్షాలు సమృద్ధిగా పడి, ప్రకృతి పచ్చదనంతో నిండుతుంది. అదే సమయంలో మందలు(గొర్ల గుంపు) మేతకు వెళ్లినప్పుడు వాతావరణం వల్ల వచ్చే వ్యాధుల బారిన పడకుండా చూడమని ప్రకృతి స్వరూపిణి అయిన పోచమ్మ తల్లిని వేడుకుంటూ బోనమెత్తుతారు. యాదవులు ఈ బోనాల ఉత్సవాన్ని ప్రతి ఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తారు. అయితే, ప్రధానమైన గొర్ల పోచమ్మ పండుగను మాత్రం గ్రామీణ పరిస్థితులు, మందల వృద్ధిని బట్టి రెండు సంవత్సరాలకు ఒకసారి, మూడు సంవత్సరాలకు ఒకసారి లేదా ఐదు సంవత్సరాలకు ఒకసారి ఒక ఉత్సవంగా జరుపుకుంటారు. కాలపరిమితి ఏదైనా, ప్రతి ఏటా క్రమం తప్పకుండా చేసే ఈ బోనాలు యాదవ సమాజపు సాంస్కృతిక అస్తిత్వానికి నిలువెత్తు నిదర్శనం.

**గొర్ల పోచమ్మ పుట్టుక :**

జానపద మౌఖిక సాహిత్యం ప్రకారం గొర్ల పోచమ్మ పుట్టుక వెనుక ఒక విశిష్టమైన పురాణ కథ ప్రచారంలో ఉంది. ఆదిశక్తి అవతరమైన పార్వతీదేవి ఒక వెండి గొర్రెను, ఒక బంగారు గొర్రెను పెంచుకుంటుంది. ఆ గొర్రెలు ఒక్కొక్కటిగా విస్తరించి పెద్ద మంద అవుతుంది. వాటిని కాయడం ఆమె వల్ల కాకపోవడంతో శివున్ని ఆ గొర్రెల మందకు కాపలాగా ఉండమంటుంది. శివుడు ఒక అరణ్యంలో ఆ గొర్రెల మందతోపాటు అక్కడే వుంటూ, ఆ మంద మధ్యలోనే మంచం మీద పడుకున్నప్పుడు ఆయన జడలను గొర్రెలు కొరికేస్తాయి. ఇక వాటిని భరించడం తన వల్ల కాదని పార్వతి దేవితో చెప్తాడు, అప్పుడు ఆమె వాటిని చూసుకునేదెవరని శివుణ్ణి అడిగితే, గొల్ల కులస్తులు మాత్రమే ఈ మందను కాయగలరు. మొదట కొల్లపురిలో వున్న మన మల్లయ్య కాస్తాడు ఆ తర్వాత అతని చేతుల్లోనుండి యాదవుల చేతుల్లోకి వెళ్తాయని చెప్తాడు. ఆ సమయం వచ్చేవరకు ఈ గొర్ల గుంపును ఎక్కడైనా దాచాలని చుట్టూ చూసి, శివపార్వతులిద్దరు ఆ పక్కనే ఉన్న పెద్ద పుట్టలో ఆ గొర్రెలను వదిలేసి పార్వతీదేవి ముక్కుపుడకతో ఆ పుట్టకు తాళం వేస్తారు. ఇక కొంత కాలానికి కొల్లపురి పట్టణంలో ఉన్న మల్లయ్య దేవుడు అక్కడ రెడ్డి కులస్తుల హింస భరించలేక ఎక్కడైనా వ్యవసాయం చేసుకుని బతుకుతానని బయలుదేరి, ఈ గొర్రెల మంద ఉన్న అరణ్యంలోకి వచ్చి, ఆ పుట్ట ఉన్నచోట పొలాన్ని చదును చేసి, చెట్లన్నీ కొట్టి ఆ పుట్ట మీద వేస్తాడు. ఆ కట్టెలన్నీ ఎండిన తర్వాత వాటిని తగలపెడతాడు. ఆ మంటల్లో పార్వతి దేవి ముక్కుపుడక కరిగిపోయి అందులో ఉన్న గొర్రెలన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తాయి. అది చాలా పెద్ద



మంద అవుతుంది. ఈ మందను ఏం చేయాలో అర్థం కాక మల్లయ్య, శివున్ని వేడుకుంటాడు. శివపార్వతులిద్దరూ యాదవ రూపంలో ఆ వ్యవసాయ క్షేత్రానికి వచ్చి మల్లయ్య నువ్వు మంద కాసే సమయం వచ్చింది, నువ్వే ఈ గొర్రెల మందను చూసుకోవాలని చెప్తాడు. అప్పుడు మల్లయ్య "నేను ఒక్కడినే ఇంత పెద్ద మందను ఎలా చూసుకుంటాను" అంటాడు. బదులుగా శివుడు 'నువ్వు ఒక్కడివే కాదు ఒంటికాలు బయ్యన్న నీకు తోడుగా ఉంటాడు. మీరిద్దరూ ఈ మందను చూసుకోండి' అన్నారు. 'ఒంటికాలువాడైనా బయ్యన్న నేను మాత్రమే ఎలా చూసుకోగలం' అని మల్లన్న అడుగుతాడు. 'మీకు తోడుగా పోచమ్మ కూడా ఉంటుంది అని చెప్పి, శివుడు పోచమ్మను గొర్రెల మంద నుంచి అవతరింపజేస్తాడు. అందుకని ఆమెను 'గొర్ల పోచమ్మ' అంటారు. అలాగే గొర్రెల గుంపును మంద అనడంవల్ల ఆమెను 'మంద మాదవసాని' అని కూడా అంటారు.

ఆ ముగ్గురిని మంద కాపలా వుండమన్నప్పుడు మల్లయ్య ఇలా అంటాడు 'మేము ఈ మందనే చూసుకుంటూ ఉంటే మాకు భోజనం ఎలా వస్తుందంతాడు'. అందుకు శివుడు ఐదు నిప్పు కణికలు ఇచ్చి వీటిని గొర్రెల ఎరువు కింద దాచి, మీకు అవసరమైనప్పుడు ఆ నిప్పు బయటికి తీసి వాటిమీద కొంత గొర్రెలు ఎరువు వేసి మంట పెడితే మీకు కావలసిన ఆహారం అగ్నిదేవుడు ఇస్తాడని చెప్పాడు. అలా వాళ్ళు ఆ మందను కాస్తూ ఉండగా ఒకనాడు జోరు వాన కురిసే ఆ నిప్పు కణికలన్నీ చల్లారిపోతాయి. వాళ్లకి అరణ్యంలో నిప్పు ఎక్కడ దొరకదు. అప్పుడు మల్లన్న అక్కడే ఉన్న పెద్ద మోదుగు చెట్టు ఎక్కి ఉత్తరం దిశగా చూస్తే 'బొక్కశ్రీకోట' నుండి పొగ వస్తున్నట్టుగా కనిపిస్తుంది. అది చూసిన తర్వాత అక్కడికి వెళ్లి తిరిగి రావడంలో దారి మర్చిపోతానే ఉద్దేశంతో అతను ఎక్కిన కొమ్మను నరికి కింద వేస్తాడు. అలాగే ఆ దారిలో వెళుతూ ఒక్కొక్క చెట్టు కొమ్మను నరుక్కుంటూ కోట వరకు చేరుకుంటాడు. అక్కడికి వెళ్ళాక కోటలోకి వెళ్లే దారి కనబడదు. రత్నాంగి అనే ఆమె కోటపై నుండి ఇతన్ని చూసి చొప్పబెండ్లతో చతురస్రాకారంలో తెప్ప తయారు చేసి, ఆమె వెంట్రుకలను తాడుగా కట్టి కిందకి పంపుతుంది. మల్లయ్య శివలింగం ఆకారంలో మారిపోయి ఆ తెప్పలో కూర్చుంటాడు, ఆమె ఆ తెప్పని కోటపైకి లాగుతుంది. అక్కడికి వెళ్ళాక ఎవరు నువ్వు? ఈ కోటకు ఎందుకు వచ్చావు? అని ఆమె అడుగుతుంది. అప్పుడు అతను నా పేరు మల్లన్న, అమృతం కాసుకోవడానికి నిప్పు కావాలి, అందుకే ఇక్కడ దాకా వచ్చాను అని చెప్తాడు. ఆమె నిప్పులు తీసుకొచ్చి అతనికి ఇస్తుంది. ఆ నిప్పులు తీసుకుని వస్తుంటే మీరు చేసుకున్న అమృతం నాకు కూడా తీసుకొస్తారా అని అడుగుతుంది, అతను అలాగే తీసుకొస్తానని చెప్పి వెళ్ళిపోతాడు.

తను నరుక్కుంటూ వెళ్లిన చెట్టు కొమ్మల దారిలోనే తిరిగి వచ్చి మందను చేరుకుంటాడు. అక్కడ బయ్యన్న గొర్రెపాలు పిండి ఏడు మోదుగు ఆకుల్లో పోసి ఆ పాలు కాచుకొని బయ్యన్న, మల్లయ్య, పోచమ్మ తాగిన తర్వాత రెండు డొప్పల పాలు తీసుకెళ్లి రత్నాంగికి ఇస్తాడు.



డా. ఆవుల రేణుక
9398268976

# జాతీయం-అంతర్జాతీయం

# మోడీ సర్కార్ అట్టర్ ఫ్లాప్

- బియ్యం మరింత ప్రియం
- దేశంలో 10-13 శాతం పెరిగిన ధరలు
- సామాన్యుడి జేబుకు మరోసారి చిల్లు
- ఇప్పటికే పెరిగిన వంటగ్యాస్,
- నిత్యావసరాల ధరలతో విలవిల
- రికార్డుస్థాయి వరి ఉత్పత్తి అంటూ కేంద్రం ప్రచారం

**న్యూఢిల్లీ, ఆగస్టు 13 (ఎ.ఎం.ఎస్):** దేశంలో రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి అవుతుందని కేంద్రం చెప్తున్నప్పటికీ.. వాస్తవంలో అందుకు విరుద్ధ పరిస్థితులు కనిపిస్తున్నాయి. మార్కెట్‌లో వరి కొరత కనిపిస్తోంది. బలహీన రుతుపవనాలు, పంటల మధ్య సరఫరా అంతరం, కంటి తుడుపుగా మారిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ), తగ్గుతున్న వరి నిల్వలు, ఇథనాల్ తయారీకి బియ్యంపై పెరుగుతున్న డిమాండ్ వంటి కారణాలతో దేశవ్యాప్తంగా బియ్యం ధరలు వేగంగా పెరుగుతున్నాయి. దీంతో సామాన్యుల భోజన పళ్లెం పైనా ద్రవ్యోల్బణ భారం మరింత పెరుగుతోంది.

దేశవ్యాప్తంగా బియ్యం ధరలు గత కొన్ని వారాల్లో పది శాతానికి పెరిగాయి. ముఖ్యంగా సోనామసూరి, పొన్ని, మసూరి వంటి ప్రీమియం నాన్‌బాస్మతి రకాల ధరలు గణనీయంగా పెరుగుదలను నమోదు చేశాయి. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి జరిగిందని చెప్తున్నప్పటికీ.. మార్కెట్‌లో వరి కొరత, బలహీన రుతుపవనాలు, సరఫరా సమస్యలు ధరలను నియంత్రించలేకపోతున్నాయి. ఈ విషయంలో మోడీ సర్కారుకు ముందు చూపు లోపించిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ



వైఫల్యానికి సామాన్యుడు మూల్యం చెల్లించుకోక తప్పని పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. దేశంలో 2025 26లో రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి ఉంటుందని కేంద్రం ప్రకటించింది. అయితే వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తోంది. రైస్ మిల్లర్ల వద్ద వరి నిల్వలు తగ్గిపోయాయనీ, మార్కెట్‌లో సరఫరా ఒత్తిడి నెలకొందని పరిశ్రమ వర్గాలే చెప్తున్నాయి. కేంద్రం చెప్తున్నట్టుగా దేశంలో వరి ఉత్పత్తి రికార్డు స్థాయిలోనే ఉంటే.. ధరలు ఎందుకు పరుగులు పెడుతున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

202627 ఏడాది పంటకు కేంద్రం వరి కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.2369 నుంచి రూ.2,441కు పెంచింది. రైతులకు ఇది కేవలం కంటి తుడుపు చర్యే. అయితే దేశంలో ధరల నియంత్రణకు మోడీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దీంతో చివరకు వినియోగదారులైన సాధారణ ప్రజలే అధిక ధరలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే పెరిగిన వంటగ్యాస్, ఇతర నిత్యవసరాల ధరలతో సతమతమవుతున్న



వారికి.. ఈ పరిణామం మరింత భారంగా మారనుంది.

ఈ ఏడాది రుతుపవణాలు ఇప్పటి వరకు సాధారణం కంటే 11 శాతం తక్కువగా నమోదయ్యాయి. వర్షాభావం తో వచ్చే పంటపై కూడా ఆందోళన నెలకొంది. వాతావరణ హెచ్చరికలు కూడాముందుగానేఉన్నప్పటికీ..మోడీసర్కారువ్యవహరించిన తీరే సరిగ్గా లేదు. సరఫరా నిర్వహణ, నిల్వల విషయంలో ఒక ప్రణాళిక, ధరల నియంత్రణలో తగిన ముందస్తు చర్యలు తీసుకోలేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

దేశంలో మొక్కజన్న సాగు విస్తీర్ణం తగ్గడంతో ఇథనాల్ తయారీకి బియ్యం వినియోగం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఇథనాల్ కోసం ఆహార ధాన్యాలను వినియోగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో.. ఇది బియ్యం ధరలపై మరింత ఒత్తిడిని తీసుకురావచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. క్రిసిల్ ఇంటెలిజెన్స్ తాజా నివేదిక ప్రకారం.. జులైలో శాకాహార భోజనం ఖర్చు ఏడాది క్రితంతో పోలిస్తే నాలుగు శాతం, మాంసాహార భోజనం ఖర్చు 9 శాతం పెరిగింది. ఉల్లి ధరలు 20 శాతం, వంటనూనె ధరలు 11 శాతం, ఎల్పీజీ సిలిండర్ ధరలు 10 శాతం పెరిగాయి. ఇక పశ్చిమాసియా ఉద్రిక్తతలు, సరఫరా అంతరాయాల పేరుతో కూడా కేంద్రం దేశ ప్రజలపై మరింత భారాన్ని మోపింది. వంట గ్యాస్ ధరలను పెంచింది. దీంతో ప్రజలు ఇప్పటికీ ఆ భారాన్ని మోస్తూ ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

దేశంలో కోడి కూర కూడా ప్రియమైంది. బ్రాయిలర్ కోళ్ల ధరలు ఏడాదిలో 14 శాతం పెరగడంతో మాంసాహార భోజనం మరింత ఖరీదైంది. దాణా వ్యయం పెరగడం కూడా ఇందుకు కారణమని క్రిసిల్ స్పష్టం చేసింది. ఒకవైపు రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి అని మోడీ సర్కారు ప్రకటనలు చేస్తుండగా... మరోవైపు బియ్యం, వంటనూనె, ఉల్లి, గ్యాస్ వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దీంతో దేశంలో సామాన్య కుటుంబాల జీవన వ్యయం మరింత భారంగా మారుతోంది. ఉత్పత్తి, నిల్వలు, సరఫరా, ధరల నియంత్రణ మధ్య సమన్వయం లోపిస్తోందనే విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ప్రకటిస్తున్న రికార్డు గణాంకాల కంటే.. మార్కెట్‌లో వినియోగదారులు చెల్లిస్తున్న పెరిగిన ధరలే వాస్తవ పరిస్థితిని ప్రతిబింబిస్తున్నాయని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సోనా మసూరి, పొన్ని, మసూరి వంటి ప్రీమియం రకాల ధరలు గత కొన్ని వారాల్లో 1013 శాతం వరకు పెరిగాయి. స్వర్ణ బియ్యం, ఎక్స్‌మిల్ ధర కిలోకు రూ.30 నుంచి రూ.34కు చేరింది. సరఫరా తగ్గిపోవడం, కొత్త ఖరీఫ్ పంట ఇంకా మార్కెట్‌కు రాకపోవడం ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా వ్యాపారులు, మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి.



## ట్రంప్ దిగిపోయేదాకా యుద్ధం ఆగదు

- ఇరాన్ హెచ్చరిక
- తమపై దాడి చేసే వారు భయపడాలంటూ వార్నింగ్

**టెహ్రాన్, ఆగస్టు 13 :** అమెరికాతో జరుగుతున్న యుద్ధాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవి నుంచి వైదొలిగే వరకు ఉద్దేశపూర్వకంగా పొడిగించే అవకాశం ఉందని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్ సీనియర్ సలహాదారు ఒకరు సంచలన వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో ఇరాన్‌పై దాడి చేయాలంటే ఎవరైనా భయపడేలా చేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "ఈ యుద్ధాన్ని తదుపరి అధ్యక్ష పదవీకాలం వరకు పొడిగించి, శత్రువుకు నష్టం కలిగించడం ఒక మార్గం. దీనివల్ల ఇరాన్‌పై దాడి చేయాలనుకునే వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలుసుకుంటారు" అని ఐఆర్‌జీసీ కమాండర్ఇన్‌చీఫ్ సీనియర్ సలహాదారు మహమ్మద్ రెజా నఖ్వీ ఓ ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ప్రస్తుతం యుద్ధంలో తాము గెలుస్తున్నామని, అయితే తమ అంతిమ లక్ష్యం ఇంకా నెరవేరలేదని నఖ్వీ అన్నారు. ఈ ఘర్షణ వల్ల అమెరికాతో పోరాటంలో తమకు మరింత అనుభవం వస్తుందని, తాము భావించిన దానికంటే అమెరికా సైన్యం బలహీనంగా ఉందని గ్రహించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రయోగిస్తున్న క్షిపణుల కంటే ప్రతిరోజూ ఎక్కువ క్షిపణులను తయారు చేస్తున్నామని, యుద్ధం ఏళ్లపాటు కొనసాగినా ప్రయోగించగలమని ధీమా వ్యక్తం చేశారు. ఒకవేళ తమ క్షిపణుల నిల్వలు అయిపోతే, ఇరాన్ అమెరికాకు మరింత ప్రమాదకరంగా మారుతుందని ఆయన హెచ్చరించారు. "క్షిపణులు లేనప్పుడు మేము మరింత ప్రమాదకరం. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా అమెరికాకు వేలాది ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయి. వాటన్నింటినీ సులభంగా నాశనం చేయవచ్చు" అని నఖ్వీ అన్నారు. అయితే ఆ ఆర్థిక లక్ష్యాలు ఏమిటో, వాటిపై ఎలా దాడి చేస్తారో ఆయన స్పష్టంగా వివరించలేదు.

## ప్యాకేజ్డ్ పదార్థాలపై సుప్రీం ఆగ్రహం





- కేంద్రానికి అల్టిమేటం జారీ
- రెండు వారాల గడువు విధించిన కోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 13 (ఎ.ఎం.ఎస్) :** ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల లేబుళ్లపై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు అల్టిమేటం జారీ చేసింది. "మీరు చేయలేకపోతే, మేమే అమలు చేసేలా చూస్తాం" అంటూ గట్టి హెచ్చరిక జారీ చేసింది. ఈ విషయంలో తుది నిర్ణయం తెలియజేయడానికి కేంద్రానికి రెండు వారాల గడువును మంజూరు చేసింది. ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల ప్యాకెట్లపై ముందు భాగంలో హెచ్చరిక లేబుళ్లను తప్పనిసరి చేయడంలో జరుగుతున్న జాప్యంపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)పై ఉన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఇది ప్రజల, ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన కీలకమైన అంశమని, కార్పొరేట్ సంస్థల ఒత్తిడికి తలొగ్గి నిర్ణయాలు తీసుకోవద్దని ధర్మాసనం స్పష్టం చేసింది. "తయారీదారులు తమ వ్యాపారం దెబ్బతింటుందన్న ఉద్దేశంతో ఈ లేబుళ్లను వ్యతిరేకించవచ్చు, కానీ తాము కొనుగోలు చేసే వస్తువులో ఏయే పదార్థాలు ఉన్నాయో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది" అని కోర్టు వ్యాఖ్యానించింది.

## చర్చల్లేవు.. సమాలోచనల్లేవ్...

- చప్పగా సాగిన పార్లమెంటు
- ఉభయ సభలు నిరవధిక వాయిదా

**న్యూఢిల్లీ, ఆగస్టు 13 (ఎ.ఎం.ఎస్) :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి రోజైన గురువారం ప్రారంభమైన కొద్ది సేపటికే నిరవధిక వాయిదా పడింది. మొదటిసారి లోక్ సభలో వందేమాతరం జాతీయ గేయాన్ని ఆలపించారు. అనంతరం సభను వాయిదావేస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. నేటి సభకు ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షాలు ఇద్దరూ హాజరయ్యారు. వర్షాకాల సమావేశాల్లో కార్యకలాపాలు జరగలేదు.

ప్రశ్నోత్తరాల స మయం జరగలేదు. ఎటువంటి చర్చ జరపకుండానే కేంద్రం పలు బిల్లులను ఆమోదించింది. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా చేపట్టిన విద్యార్థుల ఆందోళనపై పోలీసుల చర్యకు కేంద్ర హోం మంత్రి



అమిత్ షా సమాధానమివ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

నీట్‌పేపర్ లీక్ వ్యవహారంపై సమగ్ర చర్చకు సిద్ధమని బుధవారం అమిత్‌షా పార్లమెంటులో మీడియాతో పేర్కొన్నారు. ఈ అంశంపై చర్చకు సమయాన్ని పెంచేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. అయితే నిరసనకారులపై కాల్పులు, పోలీసుల దాడికి ఎవరు ఆదేశాలిచ్చారనే దానిపై యువతకు సమాధానం కావాలని, అమిత్‌షా ఇచ్చే ప్రసంగం కాదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చర్చ ప్రతిపాదనను తిరస్కరించారు. 'గనులు మరియు ఖనిజాల (అభివృద్ధి మరియు నియంత్రణ) సవరణ చట్టం'కు సవరణలు చేసే బిల్లును లోక్‌సభ బుధవారం ఎటువంటి చర్చా లేకుండానే ఆమోదించింది. రాజ్యసభ మరో రెండు బిల్లులను 'జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (సవరణ) బిల్లు, 2026' 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ఆమోదించింది.

## 600 మంది గర్భిణీల వీసాల రద్దు

**వాషింగ్టన్, ఆగస్టు 13 :** బర్త్ టూరిజంపై అమెరికా ఉక్కుపాదం మోపుతోంది. పిల్లలను కనడానికే అమెరికాకు వచ్చే వారిని

నియంత్రిస్తోంది. ఒక్క జులై నెలలోనే 9వ నెల గర్భంతో ఉండి అమెరికాకు వచ్చిన 600 మంది వీసాలను రద్దు చేసింది. బర్త్ టూరిజం నిరోధక టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో వీసాలను పరిశీలించి రద్దు చేసినట్లు అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో తెలిపారు. మరోవైపు కఠిన వీసా నిబంధనల కారణంగా అమెరికాకు ఈ ఏడాది వచ్చిన విద్యార్థుల సంఖ్య తగ్గింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఫాల్ సీజన్లో 1.12 లక్షల మంది విద్యార్థులు తగ్గారు.

## హనుమాన్ టెంపుల్ కు ఎస్పీ ఎంపీల విరాళం

- హనుమాన్ టెంపుల్ కు ఎస్పీ ఎంపీల విరాళం
- రూ.2,15,490 అందజేత

**లక్నో, ఆగస్టు 13 (ఎ.ఎం.ఎస్) :** వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో అయోధ్య రామ్ మందిర్ విరాళా చోరీని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. పార్లమెంట్ ఆవరణలో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఎంపీ అక్షయ్ కుమార్ హుండీ పెట్టి వినూత్న నిరసన తెలిపారు. ఆ హుండీలో ఎంపీలందరూ విరాళాలు అందజేశారు. అయోధ్య విరాళాలపై సమగ్ర విచారణ జరగాలని, ఉభయసభల్లో విరాళాల చోరీలపై చర్చ జరగాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. అ విధంగా నిరసన తెలుపుతూ దేశవ్యాప్తంగా పర్యటించారు. తాజాగా




ఆ విధంగా సేకరించిన మొత్తం రూ.2,15,490 నగదుతో పాటు రెండు వెండి నాణాలను ఢిల్లీలోని ప్రాచీన హనుమాన్ టెంపుల్ కు విరాళంగా అందజేశారు. గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంట్ సభ్యులు ఈ మొత్తాన్ని విరాళంగా అందించారని ఎస్పీ ఎంపీలు తెలిపారు. అయోధ్య విరాళాల దొంగతనం అసలు స్వరూపం ఏమిటో తాము తెలుసుకోవాలనుకుంటున్నాం. ప్రస్తుత దర్యాప్తుపై అనుమానాలున్నాయని, ఒక సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో సిట్ దర్యాప్తు జరపాలని డిమాండ్ చేస్తున్నాం. ఆలయం నిర్మిస్తున్నప్పుడు ప్రజలు భక్తులు విరాళాలు అందజేస్తూ ఉంటారు. కానీ విరాళాలు చోరీ చేసిన వ్యక్తులకు కఠిన శిక్షపడాలని ఎంపీ అక్షయ్ యాదవ్ అన్నారు.

## నిజమే.. విమానం మారాను...

- అంగీకరించిన ట్రంప్

**వాషింగ్టన్, ఆగస్టు 13 :** గత నెలలో టర్కీలో నాటో సదస్సుకు హాజరైన తర్వాత తిరుగు ప్రయాణంలో రహస్యంగా విమానాలను మార్చానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. ముప్పు ఎదురయ్యే అవకాశం ఉన్నందునే అలా చేయాల్సి వచ్చిందని చెప్పారు. 'సీక్రెట్ సర్వీస్, సైన్యం సూచించిన విధంగా నడుచుకున్నా. వేరే విమానంలో ప్రయాణించాలని వారు నన్ను అడిగారు' అని తెలిపారు. గత నెల 8న టర్కీ నుంచి బ్రిటన్ వెళ్లేందుకు కెమేరాల ఎదుట ఎయిర్ ఫోర్స్ వన్ విమానాన్ని ఎక్కిన ట్రంప్ ఆ తర్వాత కేటరింగ్ ట్రక్కులో దాక్కుని ఓ సైనిక విమానంలో ప్రవేశించిన విషయం తెలిసిందే. 'నేను ఎక్కిన జెట్ విమానం మరింత ప్రమాదంలో పడి ఉండేది. ఎందుకంటే వారు లక్ష్యంగా చేసుకునే అవకాశం ఎక్కువగా ఉన్న విమానం అదేనని నేను అనుకుంటున్నాను' అని ట్రంప్ తెలిపారు. బయట ఏదో ముప్పు పొంచి ఉన్నదని అనుకుంటున్నానని ఆయన చెప్పారు. 'నేను దాని గురించి పెద్దగా ఆరా తీయలేదు. ఎందుకంటే నాకు చాలా బెదిరింపులు వస్తుంటాయి' అని అన్నారు. మీకు తెలియని బెదిరింపులు తనకు చాలానే ఉన్నాయని విలేకరులను ఉద్దేశించి ట్రంప్ వ్యాఖ్యానించారు.

## ఆస్ట్రేలియాలో గిగ్ వర్కర్లకు సామాజిక ప్రయోజనాలు

- రెండున్నర లక్షల మంది కార్మికులకు లబ్ది
- ఉత్తర్వులు జారీ

**సిడ్నీ, ఆగస్టు 13 :** ఆహార పదార్థాలు, కిరాణా సామగ్రిని డెలివరీ చేసే గిగ్ వర్కర్లకు జాతీయ కనీస వేతనం కంటే ఎక్కువగా గంటల వారీగా రేట్లు చెల్లించాలని, అలాగే విధినిర్వహణలో ఉన్నప్పుడు ప్రమాదాలు జరిగితే బీమా సౌకర్యాన్ని వర్తింపజేయాలని సూచిస్తూ ఆస్ట్రేలియా పెయిడ్ వర్క్ కమిషన్ (ఎఫ్‌డబ్ల్యూసీ) మంగళవారం రాత్రి ఓ ఉత్తర్వు జారీ చేసింది. దీని ప్రకారం గిగ్ వర్కర్లకు జాతీయ కనీస వేతనం 26.44 డాలర్ల కంటే ఎక్కువగా...అంటే గంటకు 31.30 డాలర్లు చెల్లిస్తారు. అయితే డెలివరీ కోసం ఉపయోగించే వాహనాలకు థర్డ్ పార్టీ బీమా బాధ్యత వారి పైనే ఉంటుంది. వ్యక్తిగత ప్రమాద బీమా కోసం కంపెనీలు సహేతుకమైన కనీస స్థాయి కవరేజీని అందించాల్సి ఉంటుంది. ఎఫ్‌డబ్ల్యూసీ జారీ చేసిన ఉత్తర్వు ఈ నెల 17వ తేదీ నుంచి అమలులోకి వస్తుంది. దీనివల్ల సుమారు రెండున్నర లక్షల మంది కార్మికులు ప్రయోజనం పొందుతారని అంచనా. పనిని అంగీకరించినప్పటి



నుంచి డెలివరీని పూర్తి చేసే వరకూ పట్టే సమయానికి గిగ్ వర్కర్లకు కనీస గంటల వేతనాన్ని చెల్లించాల్సి ఉంటుంది. గిగ్ వర్కర్ల కోసం నిర్దేశించిన ఉపాధి ప్రమాణాలను పాటించాలంటూ జూన్‌లో అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ ఉత్తర్వు జారీ అయింది. ఐఎల్ఓ నిర్దేశించిన ప్రమాణాలు గిగ్ వర్కర్లకు వేతనాలు, భద్రత, సామాజిక ప్రయోజనాల విషయంలో హక్కులు లభిస్తాయి. కాగా ఎఫ్‌డబ్ల్యూసీ నిర్ణయాన్ని ఆస్ట్రేలియా రవాణా కార్మికుల సంఘం (టీడబ్ల్యూయూ) స్వాగతించింది. ఆస్ట్రేలియా గిగ్ ఎకానమికీ ఇది ఓ మైలురాయి అని అభివర్ణించింది. 'దేశంలోని గిగ్ వర్కర్లు చాలా కాలం పాటు కార్యాలయ వ్యవస్థలకు దూరంగా ఉండిపోయారు. ఇక వారు ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రమాణాలకు అర్హులు అవుతారు' అని టీడబ్ల్యూయూ జాతీయ కార్యదర్శి మైఖేల్ కెయిన్ చెప్పారు. రెస్టారెంట్ డెలివరీలకు ఆవల తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఉబర్ ఈట్స్, డోర్‌డాష్ సంస్థలు కూడా తాజా నిబంధనలపై

హర్షం వ్యక్తం చేశాయి. కార్మికులకు బలమైన రక్షణ లభించడంతో పాటు గిగ్ వర్కర్లకు అనేక సౌకర్యాలు చేకూరుతాయని తెలిపాయి.

## ఆ పేలుళ్లకు ఏక్యూఐఎస్ కారణం

- అధికారికంగా వెల్లడించిన ఐరాస
- నివేదికలో పలు అంశాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 1 3 (ఎ.ఎం.ఎస్) :** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో 2025 నవంబర్‌లో జరిగిన పేలుడికి అల్‌ఖైదా అనుబంధ సంస్థ 'అల్‌ఖైదా ఇన్ ద ఇండియన్ సబ్‌కాంటినెంట్' (ఏక్యూఐఎస్) కారణమని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్సీ) అధికారికంగా పేర్కొంది. ఆగస్టు 10న విడుదలైన యూఎన్ఎస్సీ విశ్లేషణాత్మక సహాయ, ఆంక్షల పర్యవేక్షణ బృందం తన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది.

2025 నవంబర్ 10న రాత్రి 7 గంటల సమయంలో ఎర్రకోట సమీపంలో కదులుతున్న హ్యుందాయ్ ఐ20 కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. కారును ఉమర్‌ఎనబీ నడిపినట్లు దర్యాప్తులో గుర్తించారు. అతడే ఆత్మాహుతి దాడికి పాల్పడి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

ఈ దాడిని తొలుత పాకిస్థాన్ కేంద్రంగా ఉన్న జైష్‌ఎమొహమ్మద్ (జేఈఎం) అని అయి ఉంటుందని అనుమానించారు. ఓ సభ్య దేశం కూడా వరుస దాడులతో పాటు రెడ్‌ఫోర్ట్ పేలుడికి జేఈఎం కారణమని పేర్కొన్నట్లు యూఎన్ఎస్సీ నివేదిక తెలిపింది. తాజాగా ఏక్యూఐఎస్‌కు అధికారికంగా ఆపాదించడం ఈ కేసులో కీలక పరిణామంగా మారింది. 2014లో ఏర్పాటైన ఏక్యూఐఎస్.. భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో అల్‌ఖైదా కార్యకలాపాలను విస్తరించేందుకు ఏర్పడిన ప్రాంతీయ అనుబంధ సంస్థ. పెద్ద ముఠాల కంటే చిన్న చిన్న చెదురుమదురు సెల్‌లుగా పనిచేస్తూ లాజిస్టిక్స్, ఆర్థిక నెట్‌వర్క్‌లను అభివృద్ధి చేసుకుంటోందని యూఎన్ఎస్సీ నివేదిక పేర్కొంది.

అల్‌ఖైదా, ఐఎస్ఐఎస్ అనుబంధ సంస్థల సామర్థ్యాలపై కూడా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. రసాయన, జీవ ఆయుధాలపై ఆసక్తి ఉన్నప్పటికీ వాటిని తయారు చేయడంలో సాంకేతిక సవాళ్లు ఇప్పటికీ ఉన్నాయని తెలిపింది.

## పంజాబ్ డిప్యూటీ సీఎంపై దాడి

- ఆస్పత్రికి తరలింపు

**ముంబయి, ఆగస్టు 13 (ఎ.ఎం.ఎస్) :** మహారాష్ట్రలోని నాందేడ్‌లో శిరోమణి అకాలీదళ్ అధినేత, పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై గురువారం దాడి జరిగింది. ఈ దాడిలో ఆయన చేతికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ముధ్ఖేడ్ లోని మాతా సాహిబ్ గురుద్వారాలో ఒక నిహంగ్ సిక్కు అనే వ్యక్తి 'కిర్పాన్'తో బాదల్‌పై దాడి చేశాడు.



ఈ దాడిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై జరిగిన దాడిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రి స్వయంగా సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తన ఆరోగ్యం నిలకడగానే ఉందని బాదల్ ఫడ్నవీస్‌కు తెలిపినట్లు సమాచారం.

## వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలి

**తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి)**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, పెసరతో పాటు కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.గురువారం సుజాతనగర్ మండలం సింగభూపాలెం, వేపలగడ్డ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృతంగా పర్యటించి వ్యవసాయం, ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు, విద్య, వసతి సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు..**

సింగభూపాలెం చెరువును సందర్శించిన కలెక్టర్ నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించారు. చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం 19 అడుగులు కాగా ప్రస్తుతం 14.5 అడుగుల నీరు ఉన్నట్లు అధికారులు వివరించారు. ఈ చెరువు ద్వారా సుమారు 2,200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతున్నట్లు తెలిపారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పాత అంజనాపురం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న కూరగాయలు, పెసర, పత్తి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కాకరకాయ, సొరకాయ తదితర కూరగాయల సాగును పరిశీలించారు. సింగభూపాలెం గ్రామంలో సుమారు 600 ఎకరాల్లో కూరగాయలు, 300 ఎకరాల్లో పెసర సాగు జరుగుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ విస్తీర్ణాన్ని మరింత పెంచేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి వనరుల్లో తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, తాగునీటి అవసరాలను కాపాడుతూ సాగునీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు.

**ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలి**

సింగభూపాలెం గ్రామంలో మొదటి దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గ్రామానికి మొదటి దశలో 32 ఇళ్లు మంజూరు కాగా, వంద శాతం ఇళ్లు గ్రౌండింగ్ పూర్తయిందని, 11 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. నిర్మాణం పూర్తయిన లబ్ధిదారు మిరియాల అరుణ ఇంటిని కలెక్టర్ పరిశీలించి నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కోసం జరుగుతున్న సర్వేను పరిశీలించారు. గ్రామంలో 220 దరఖాస్తులు అందగా ఇప్పటి వరకు 92 దరఖాస్తుల సర్వే పూర్తయిందని, ఇందులో 61 పూరిగుడిసెలకు సంబంధించిన సర్వే పూర్తయిందని అధికారులు వివరించారు. మొత్తం దరఖాస్తుల్లో 10 దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు తెలిపారు.మిగిలిన దరఖాస్తుల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వేలో పూర్తి పారదర్శకత పాటిస్తూ క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల మేరకు రెండో విడత ఇందిరమ్మ ఇంటి పథకం లబ్ది అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు**

సింగభూపాలెం గ్రామంలో మిషన్ భగీరథ పథకం కింద రూ.49 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సంప్ పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం గ్రామంలో సుమారు 60 శాతం మేర తాగునీటి సరఫరా జరుగుతోందని, ప్రతి ఇంటికీ వంద శాతం సురక్షిత తాగునీరు అందించేందుకు సంప్ నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామానికి రోజుకు సుమారు 2 లక్షల లీటర్ల తాగునీరు అవసరమవుతుందని వివరించారు.సంప్ నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తి



చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇంటికీ తాగునీటి కనెక్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని, నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు కూడా ముందస్తు ప్రణాళికతో తాగునీటి కనెక్షన్లు కల్పించాలని సూచించారు.

**నెల రోజుల్లో విద్యార్థుల్లో స్పష్టమైన పురోగతి**

సింగభూపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరో తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న సదుపాయాలు, బోధనపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్ పఠన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు.విద్యార్థుల పఠన సామర్థ్యంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని ఆదేశించారు. తాను నెల రోజుల్లో మరోసారి పాఠశాలను సందర్శిస్తానని, అప్పటికి విద్యార్థుల్లో తెలుగు, ఇంగ్లీష్, గణితంలో స్పష్టమైన పురోగతి కనిపించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

**విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి**

వేపలగడ్డ గ్రామంలోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను కూడా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రీడా పోటీలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు.పాఠశాల వంటగదిని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రతిరోజూ అవసరమయ్యే బియ్యం, ఇతర సరుకుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని వంట సిబ్బందిని ఆదేశించారు.వసతి గృహ పరిసరాలు, పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్ బాబు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, వ్యవసాయ శాఖ ఏవోలు, ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సర్వే బృందాల సిబ్బంది, గ్రామస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్న ప్రజా ప్రభుత్వం

**మొదటి ప్రాధాన్యతలో మేరు కులస్తులు..**

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య**

**యాదాద్రి భువనగిరి జిల్లా.13/08/2026.**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం బలహీన వర్గాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా 100 శాతం సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య గారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ గారికి బీర్ల అయిలయ్య గారు ప్రత్యేక ధన్యవాదాలు.ఈ పథకానికి ఆగస్టు 15వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు బీసీ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ పథకంలో ముఖ్యంగా మేర కులస్తులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 మంది చొప్పున మొత్తం 1,19,000 మంది మహిళలకు ఈ కుట్టు మిషన్లను అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. 100 శాతం సబ్సిడీతో ఒక్కో ఆటోమేటిక్ కుట్టు మిషన్‌కు రూ.12,000 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పెట్రోల్ పంపులు, ఇందిరా క్యాంటీన్లు, ఆర్టీసీ బస్సులు తదితర కార్యక్రమాల ద్వారా ఇప్పటికే ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని, అదే విధంగా బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు కుట్టు మిషన్ల పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని బీర్ల అయిలయ్య గారు అన్నారు.భవిష్యత్‌లో ఈ పథకాన్ని మరింత విస్తరించి మహిళలకు అదనపు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**మార్నింగ్ వాక్ ద్వారా ప్రజల వద్దకు సంక్షేమ పథకాలు**

యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మార్నింగ్ వాక్ కార్యక్రమాల ద్వారా నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వారి కుటుంబాలను సందర్శిస్తున్నారని బీర్ల అయిలయ్య తెలిపారు. ప్రజల సమస్యలు, అవసరాలను తెలుసుకుని వారికి అర్హత ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను గుర్తించి, దరఖాస్తులు నమోదు చేసి సంబంధిత అధికారులకు అందజేస్తున్నామని పేర్కొన్నారు.

**స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 రకాల ఉచిత రక్త పరీక్షలు**

తెలంగాణ రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ డయాగ్నోస్టిక్స్ ద్వారా 30 రకాల రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని బీర్ల అయిలయ్య గారు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే మొదటగా ఆలేరు నియోజకవర్గంలో ప్రారంభించడం జరిగిందని ఆయన వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉచిత రక్త పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు.



**SIR కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ప్రథమ స్థానం**

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న SIR (Special Intensive Revision) కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని బీర్ల అయిలయ్య గారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన BLOలు, వారికి సహకరించిన BLAలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఈనెల 15న డబల్ బెడ్ ఎంపిక చేసిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు

**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 13**

**రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా పంపిణీ**

నల్గొండ జిల్లాకలెక్టరేట్ సమీపంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అధికారులు ఈనెల 15న ఎంపిక చేసిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు.అధికారులకు పలు సూచనలు చేసిన నగరపాలక మేయర్..నగరపాలిక మేయర్‌తో పాటు పాల్గొన్న ఆర్డీవో అశోక్ రెడ్డి, హౌసింగ్ పీడీ లోకేశ్ లాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గుమ్ముల మోహన్ రెడ్డి,కౌన్సిలర్ సమద్, మాజీ కౌన్సిలర్ మందడి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రైతులు వెదురు సాగును చేపట్టి అదనపు ఆదాయాన్ని పొందాలి: కలెక్టర్

**జయశంకర్ భూపాలపల్లి:ఆగస్టు 13, వుదయం జిల్లా ప్రతినిధి**



రైతులు సంప్రదాయ వ్యవసాయంతో పాటు వెదురు సాగును చేపట్టి అదనపు ఆదాయాన్ని పొందాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. గురువారం మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెంచుతున్న వెదురు మొక్కల నర్సరీని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం, నిర్వహణ, పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెదురు సాగు తక్కువ నిర్వహణ ఖర్చుతో దీర్ఘకాలికంగా లాభాలను అందించే ఆదాయ వనరుగా నిలుస్తుందని తెలిపారు. రైతులు వెదురు సాగును ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఆరు మండలాల్లో వెదురు మొక్కల పెంపకం కొనసాగుతోందని, సుమారు 70 వేల వెదురు మొక్కలు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 1,200 మంది రైతులను వెదురు సాగు కోసం గుర్తించినట్లు, 15 కుంటల భూమికి ఒక్కో రైతుకు 60 వెదురు మొక్కలను ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. వెదురు సాగు చేపట్టిన రైతులకు విబిజి రాంజీ పథకం ద్వారా నిర్వహణ ఖర్చులను కూడా ప్రభుత్వం చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం వెదురు సాగును ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు.అనంతరం నర్సరీని సమర్థవంతంగా నిర్వహిస్తున్న గ్రామ సంఘం అధ్యక్షురాలిని జిల్లా కలెక్టర్ అభినందించారు. నర్సరీ నిర్వహణలో మహిళా సంఘాల భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి బాలకృష్ణ, కాటారం ఆర్డీఓ రవీందర్, ఇండస్ట్రీ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ తాండ్ర సురేష్, మహాదేవపూర్ ఏ పి ఎం, కరెంగుల రాజన్న, స్థానిక సర్పంచ్, మేకల శంకరమ్మ, గ్రామీణ అభివృద్ధి సంస్థ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 16న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన, పకడ్బందీ ఏర్పాట్లు – మంత్రి సీతక్క

**పైలాన్, నూతన కలెక్టరేట్ భవన సముదాయం పరిశీలన**

**అధికారుల సమన్వయంతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం**

**ములుగు, ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి) :**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనిముల రేవంత్ రెడ్డి ఈ నెల 16న ములుగు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా–శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం నాడు జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్‌లతో కలిసి గట్టమ్మ సమీపంలో పైలాన్ నిర్మాణ పనులను, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క పర్యటన వివరాలను వెల్లడించారు.సమ్మక్క–సారలమ్మల దర్శనం, ఆగస్టు 16న మధ్యాహ్నం సీఎం రేవంత్ రెడ్డి మేడారం చేరుకుని, శ్రీ సమ్మక్క–సారలమ్మ వన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.కొత్త పింఛన్ల ప్రారంభం: మేడారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలకు సంతృప్త స్థాయిలో పింఛన్లు అందించే ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.



రూ.16,000కోట్ల 'హ్యామ్' రోడ్ల పైలాన్ ఆవిష్కరణ: ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ సమీపంలో, పంచాయతీరాజ్ శాఖ ద్వారా మూడు విడతల్లో చేపట్టనున్న హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) రోడ్ల పనులకు సంబంధించిన పైలాన్‌ను సీఎం ఆవిష్కరిస్తారు. అనంతరం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం ప్రారంభిస్తారు. తదనంతరం కలెక్టరేట్ ఆవరణలో జరిగే బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, అధికారులు సమన్వయంతో నిర్ణీత సమయంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్ చందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# సీజీహెచ్‌ఎస్ ప్రాసెస్ వేగవంతం చేయాలి! – ఎంపీ కడియం కావ్య

**కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శికి వరంగల్ ఎంపీ కావ్య వినతి**



**వరంగల్, ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్‌లో సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (CGHS) వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ఆర్థిక అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. గురువారం న్యూఢిల్లీలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిని కలసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వరంగల్, పరిసర ప్రాంతాల్లో సుమారు 12 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారని తెలిపారు. స్థానికంగా సీజీహెచ్‌ఎస్ సెంటర్ లేకపోవడంతో అత్యవసర వైద్య సేవల కోసం దాదాపు 350 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తోందని, ముఖ్యంగా వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం ఈ ప్రతిపాదన కేంద్ర ఆరోగ్య శాఖలో ఆర్థిక అనుమతుల కోసం పెండింగ్‌లో ఉందన్నారు.ఇప్పటికే భవనానికి సంబంధించిన 'ఫెయిర్ రెంట్ అసెస్‌మెంట్' పూర్తి కాగా, అద్దె ఫైల్‌కు ఆల్ ఇండియా రేడియో సీఈఓ ఆమోదం తెలిపారని వివరించారు. పెండింగ్ ప్రక్రియను వెంటనే పూర్తిచేసి వెల్‌నెస్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తే స్థానికంగానే వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు.

# 'దిశా' మాస సమీక్షా సమావేశం

**మహబూబాబాద్, ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి) :**



మహబూబాబాద్జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రవి రాథోడ్అ ధ్యక్షతన గురువారం 'దిశా' మాససమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐసిటిసి (ICTC) కౌన్సిలర్లు, ఎన్జీవోల పనితీరుపై ఆయన క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ హెచ్ఐవి (HIV) అనుమానితులను, బాధితులను త్వరగా గుర్తించి, పాజిటివ్ వచ్చిన ప్రతి ఒక్కరికీ ఎంజీఎం ఆసుపత్రి ద్వారా ఉచిత ఏఆర్టీ (ART) చికిత్స అందేలా చూడాలి. వైరల్ లోడ్ పరీక్షలు, ఏఆర్టీ మందులు వాడుతున్న వారందరికీ ఏటొకసారి తప్పనిసరిగా వైరల్ లోడ్ పరీ క్షలు నిర్వహించాలి. ప్రభుత్వం నిర్దేశించిన 95-95-95 లక్ష్యా లను సాధించి, మహబూబాబాద్‌ను రాష్ట్రంలోనే హెచ్ఐవి రహిత సురక్షిత జిల్లాగా నిలపాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అర్జున్, 'దిశా' సిబ్బంది, ఐసిటిసి కౌన్సి లర్లు, ఎన్జీవో ప్రతినిధులు, కరుణామయిత్రి నెట్‌వర్క్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగనివ్వం - కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య

**సూర్యాపేట కలెక్టర్, ఎస్పీ పనితీరు భేష్ - కమిషన్ ఛైర్మన్ ప్రశంస**

**సూర్యాపేట, ఆగస్టు 13: వుదయం ప్రతినిధి**

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి, వారిసమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడిఉందని, బాధితులకు అన్నివేళలా అండగా ఉంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు.గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిషన్ సభ్యులు, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులతో కలిసి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూముల సమస్యలు, దాడుల కేసులు, ఉద్యోగాలలో ఎస్సీ, ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.సమీక్షలో భాగంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ఎస్సీల కోసం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సబ్ ప్లాన్ నిధులను పక్కాగా వినియోగించాలని ఆదేశించారు. నిధులు దారి మళ్లించవద్దని, ఒకవేళ దారి మళ్లిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎక్కడైనా



సబ్ ప్లాన్ నిధులు మిగిలిపోతే వాటితో తిరిగి ఎస్సీ, ఎస్టీ కాలనీలలో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఉద్యోగాలు, ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీలకు తప్పనిసరిగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ – ఆర్ ఓ ఆర్ అమలు చేయాలని, ఈ విషయంలో ఏ మాత్రం అన్యాయం జరిగినా కమిషన్ ఊరుకోదని స్పష్టం చేశారు. ఎంపీ నిధులు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ఎస్ డి ఎఫ్ నిధులను రిజర్వేషన్ ప్రకారం కేటాయించాలని కోరారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో ఎక్కువమంది ఎస్సీ, ఎస్టీ పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నందున వారికి తప్పనిసరిగా ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు.బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా ప్రతి నెల చివరి వారంలో 'సివిల్ రైట్స్ డే' నిర్వహించాలని ఎస్పీకి సూచించారు. ఈ సమావేశాలకు స్థానిక ఎస్సై, తహసీల్దార్లతో పాటు శాఖాపరమైన అధికారులు తప్పక హాజరుకావాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# క్యాంటీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని!



**హనుమకొండ, ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి) :**

హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వాహకులు సుదర్శన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి నాణ్యమైన ఆహారం, అల్పాహారం అందుబాటులో ఉండేలా క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని నిర్వాహకులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుకారి జ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థంనూతన క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉండే ధరలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా క్యాంటీన్ నిర్వహణ కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెహ్మాన్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు పక్కాగా అమలు చేయాలి

**– రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య**

**జనగామ, ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి) :**

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, రాజ్యాంగబద్ధంగా వచ్చే రిజర్వేషన్లను పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. గురువారం జనగామ జిల్లా సమీకృత కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌లతో కలిసి ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించి బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ, పదోన్నతులు, సేవా అంశాల్లో రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయాలి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు వారి భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.సివిల్ రైట్స్ డే ప్రతీ నెల 'సివిల్ రైట్స్ డే'ను నిర్వహించాలి. ఈ సమావేశాలకు స్థానిక తహసీల్దార్లు, ఎస్సైలు తప్పనిసరిగా హాజరుకావాలి. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖలలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఖర్చు చేయాలి. మానవీయ కోణం, బాధితులు అధికారుల వద్దకువస్తే గౌరవంగా కూర్చోబెట్టి, వారి సమస్యలను ఓపికగా విని పరిష్కరించాలి. వారి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా సున్నితంగా వ్యవహరించాలి. ఇదే క్రమంలో జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పురోగతిపై ఛైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారు.



## కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, సౌకర్యాలు కల్పించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

**మంచిర్యాల జిల్లా :**

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, పౌష్టికాహారం, శుద్ధమైన త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని సందర్శించి పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, తరగతి గదులు, భోజనశాల, వంటశాల, త్రాగునీటి వసతి, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల స్థాయికి అనుగుణంగా, వారికి సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని, విద్యార్థులలో చదువుపై ఆసక్తిని పెంపొందించే విధంగా బోధన పద్ధతులను అవలంబించాలని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం పై ప్రత్యేక దృష్టి సారించాలని, మధ్యాహ్న భోజనం



మెనూ ప్రకారం సకాలంలో అందించాలని, విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో శుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పాఠశాల పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పారిశుద్ధ్య చర్యలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటులో భాగంగా బెల్లంపల్లి నియోజకవర్గానికి కేటాయించిన పాఠశాల నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ పాఠశాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. వివిధ ద్రవపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అధికారులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి మండల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు.అనంతరం కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సైకిళ్లు, కుట్టు మిషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మదాసి రమాదేవి బాల్య మిత్రురాలు ఎం.టి. రాజేశ్వరి సహకారంతో సుమారు 1 లక్ష 80 వేల రూపాయల విలువ గల సైకిళ్లు, కుట్టు మిషన్ విద్యార్థులకు అందించడం జరిగిందని తెలిపారు. బాలికల విద్యాభ్యాసానికి ఇటువంటి సహకారం అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందిస్తూ వారి ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను సందర్శించి ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.నెన్నెల మండలం నందులపల్లి గ్రామపంచాయతీని సందర్శించి గ్రామంలోని పారిశుద్ధ్య నిర్వహణ, ఇటీవల కురిసిన వర్షాలతో ఏర్పడిన పరిస్థితులను పరిశీలించారు. గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన,గ్రామసభ అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా డి.సి.ఈ.బి. కార్యదర్శి పి.మహేశ్వరరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దహిగూడ ఇక 'రాజర్షిషా గూడ'
## – కలెక్టర్ పేరు పెట్టి.. ప్రేమ చాటుకున్న గిరిజనులు

**ఆదిలాబాద్, ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి):**




తమ జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన జిల్లా కలెక్టర్ రాజర్షిషాపై కొలాం గిరిజనులు వినూత్న రీతిలో అభిమానం చాటుకున్నారు. పిప్పలధరి పంచాయతీ పరిధిలోని దహిగూడ కొలాం గూడేనికి 'రాజర్షిషాగూడ'గా నామకరణం చేసుకున్నారు. పేద గిరిజనులకు ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపడమే ఇందుకు కారణమని గ్రామస్తులు తెలిపారు.గురువారం రాజర్షిషాగూడలో పర్యటించిన కలెక్టర్ రాజర్షిషా.. నిర్మాణం పూర్తయిన మూడు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలను ప్రారంభించారు. గతంలో 17 మంది పేద గిరిజనులకు ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, తమ సొంతింటి కల నెరవేరడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టర్ చొరవతో గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా చర్యలు వేగవంతమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ గిరిజనులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిప్పలధరి పంచాయతీ పరిధిలో మరో 10 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గిరిజన కుటుంబాల ఆర్థికాభివృద్ధికి మేకలు, పాడి పశువుల యూనిట్లు అందించడంతో పాటు మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల శిక్షణ, డిగ్రీ పూర్తి చేసిన స్థానిక యువతకు ఆదిలాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలోని విద్యుత్, సెల్‌ఫోన్ నెట్‌వర్క్, రవాణా సమస్యల పరిష్కారంపై కలెక్టర్ ప్రత్యేకంగా స్పందించారు. తరచూ విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఈఈని ఆదేశించారు. సెల్ టవర్ నిర్మాణానికి స్థలం కేటాయించి నెట్‌వర్క్ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఆధార్ కార్డులు లేని వారికి వెంటనే నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఈడీఎం, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మారుమూల మామిడికోరి గ్రామానికి రోడ్డు, సీడీ వర్క్ సౌకర్యం కల్పించడంతో పాటు జలసిరి కింద రైతులకు ఫార్మ్ పాండ్స్, అర్హులకు చేయూత పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ రవీందర్ రాథోడ్, పీడీ హౌసింగ్ శంకర్, స్థానిక తహసీల్దార్ గోవింద్, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### నరకం చూసిన చోటే నయా దారులు:

# రూ. 5.43 కోట్లతో మద్దెల వాగు బ్రిడ్జి ప్రారంభం...

**గ్రామీణ ప్రజల సౌకర్యార్థం కొత్త RTC బస్సు సేవలను జెండా ఊపి ప్రారంభించడమైనది...**

**గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందించడమే ప్రభుత్వ లక్ష్యం...**

**మంత్రులతో ఆగస్టు 17న సుల్తానాబాద్‌లో భారీ శంకుస్థాపనలు...**

**గౌరవ ప్రభుత్వవిప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ...**

**పెద్దపల్లి ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి)**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని జఫర్ ఖాన్ పేట గ్రామంలో గురువారం రోజున రూ. 5.43 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మద్దెల వాగు హై లెవెల్ బ్రిడ్జి మరియు గోదావరిఖని – జఫర్ ఖాన్ పేట – పెద్దపల్లి ఆర్టీసీ బస్సు సర్వీసును జెండా ఊపి ప్రారంభించిన అనంతరం గ్రామంలో 15 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన పలు సీసీ రోడ్లను స్థానిక అధికారులు మరియు నాయకులతో కలిసి ప్రారంభించిన గౌరవ ప్రభుత్వవిప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ...ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు గారు మాట్లాడుతూ... గతంలో గడప గడపకు తిరిగినప్పుడు రోడ్లు లేక, స్కూల్ భవనాలు శిథిలావస్థలో ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. ఈరోజు లక్షల రూపాయల నిధులతో పాఠశాల పునర్నిర్మాణం, కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు ఇండ్ల సంఖ్యతో సంబంధం లేకుండా గ్రామంలోని వీధులన్నింటికీ సిసి రోడ్లు పూర్తి చేశామన్నారు. రూ. 5.43 కోట్లతో మద్దెల వాగు బ్రిడ్జి పూర్తి చేయడమే కాకుండా, అప్రోచ్ రోడ్లకు అదనంగా మరో కోటి రూపాయలు ఖర్చు చేసి రవాణా కష్టాలను తీర్చామని తెలిపారు.నియోజకవర్గానికి రహదారుల మహర్దశ:ముత్తారం, మంథని వెళ్లే ప్రయాణికుల చిరకాల వాంఛను తీరుస్తూ మంగపేట కూనారం టర్నింగ్ నుండి ముత్తారం వరకు రూ. 32 కోట్లతో డబుల్ రోడ్డు మంజూరు చేయించామని ఎమ్మెల్యే వెల్లడించారు. అలాగే పెద్దపల్లి – గర్రెపల్లి మేజర్ రోడ్డుకు రూ. 100 కోట్లు, సుల్తానాబాద్ – పెద్దపూర్ రోడ్డుకు రూ. 47 కోట్లు, కూనారం – పెద్దపల్లి రోడ్డుకు రూ. 14 కోట్లు, జఫర్ ఖాన్ పేట్ రింగ్ రోడ్డుకు రూ. 7 కోట్లు, శ్రీరాంపూర్ హెడ్ క్వార్టర్ సెంట్రల్ లైటింగ్‌కు రూ. 5.5 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు.ఆగస్టు 17న శంకుస్థాపనల ఉత్సవం:ఈ అభివృద్ధి పనులన్నింటికీ ఆగస్టు 17న సుల్తానాబాద్ పర్యటనలో భాగంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ మండలం మరియు నియోజకవర్గంలోని ప్రజలు, నాయకులు, సోదరీమణులు ఉదయం 10 గంటలకు పెద్ద ఎత్తున సుల్తానాబాద్ తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.వర్షాలతో చెరువులు నిండడం శుభపరిణామం:ప్రతిపక్షాలు వర్షాలు పడకూడదని, పంటలు ఎండిపోవాలని దొంగ ఏడుపులు ఏడ్చినా... దేవుడి దయతో వర్షాలు సమృద్ధిగా కురిసి శ్రీరాంపూర్ మండలంలోని చెరువులన్నీ మత్తళ్లు దుకుతున్నాయని




ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుత వాతావరణం పత్తి, వరి పంటలకు ఎంతో అనుకూలంగా ఉందని, ఈసారి ఎకరాకు 15 క్వింటాళ్లకు తగ్గకుండా పత్తి దిగుబడి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి మరియు మంత్రుల సహకారంతో రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగు అందించడం కోసం త్వరలో పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం కోసం శ్రీకారం చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు...కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతుల పంట పొలాలకు చుక్క సాగు ఇవ్వలేదని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కరీంనగర్ రైతులకు ఉపయోగం లేదని ఈ సందర్భంగా అన్నారు...ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు గజానావేనా సదయ్య,స్థానిక సర్పంచ్ యాదగిరి జ్యోషన్న శ్రీనివాస్ మరియు ఎండీ మునీర్, లంక సదయ్య, తుల మనోహర్ రావు, దేవేందర్ రావు, మరియు పలు గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు మరియు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి...

### ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి)**



జగిత్యాల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లోని ఆగష్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ జిల్లా సుపరేంటెంట్ అఫ్ పోలీస్ ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. జగిత్యాల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆగష్టు 15 స్వాతంత్ర దినోత్సవానికి సంబంధించిన వేదిక నిర్మాణం పతాకావిష్కరణ స్థలం సాంస్కృతిక కార్యక్రమాల ప్రాంగణం స్టాల్స్ పార్కింగ్ భద్రతా చర్యలు వంటి అంశాలను ప్రత్యక్షంగా సమీక్షించారు జిల్లా వ్యాప్తంగా జరిగే కార్యక్రమాలకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. రెవెన్యూ పోలీస్ డిఆర్డిఓ మున్సిపల్ సంబంధిత అధికారులతో సమన్వయం పెంచుతూ భద్రతా బందోబస్తు ఏర్పాట్లను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఆహ్వానితులకు విద్యార్థులకు ప్రజలకు అవసరమైన నీటి సదుపాయాలు వైద్య సిబ్బంది శానిటేషన్ వ్యవస్థలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పతాకావిష్కరణ అనంతరం జరిగే అట్టహాసపూరిత పరేడ్ శకటాలు సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు. విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని ఆమె సూచించారు. ప్రభుత్వ గౌరవాన్ని నిలబెట్టేలా అన్ని ఏర్పాట్లు నాణ్యతతో చేయాలన్నారు జిల్లా ప్రజలంతా స్వాతంత్ర దినోత్సవాన్ని గౌరవంగా దేశభక్తి వాతావరణంలో జరుపుకోవాలని ఆహ్వానించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్లు బిఎస్ లత బి రాజ గౌడ్ డిఆర్డిఏ రఘువరన్ డిపిఆర్వో శ్రీధర్ సంబంధిత జిల్లా అధికారులు కలెక్టరేట్ ఏవో కిషన్ ఎమ్మార్వో రామ్మోహన్ రెవిన్యూ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది డిఆర్డిఏ సిబ్బంది పోలీస్ శాఖ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బెదిరింపులతో డబ్బుల వసూళ్లు
## – ఆత్మహత్యకు ప్రేరేపణ కేసులో ఇద్దరి అరెస్ట్

**ఆర్టీఐ ద్వారా ఉద్యోగ వివరాలు సేకరించి బెదిరింపులు – డబ్బుల డిమాండ్**

**ప్రెస్ రిపోర్టర్లుగా ముసుగులో పలువురిని బెదిరించి డబ్బుల వసూళ్లు**

**వివరాలు వెల్లడించిన కామారెడ్డి డిఎస్పీ మధుసూదన్**

**కామారెడ్డి, ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి):**

కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ క్రైం నం.693/2024లో చేపూరి శిరీష ఆత్మహత్య కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగం, జీతం, సర్వీస్ వివరాలను ఆర్టీఐ ద్వారా సేకరించి, ఉద్యోగం కోల్పోయేలా చేస్తామని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసి మానసికంగా వేధించినట్లు దర్యాప్తులో ఆధారాలు లభించాయి. దీంతో కేసును ఆత్మహత్యకు ప్రేరేపణ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో A2 ఇందూరి సిద్దాగౌడ్, A3 లాండే భాస్కర్‌లను 13.08.2026న కామారెడ్డి ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, నేరానికి సంబంధించిన కీలక విషయాలను వెల్లడించినట్లు తెలిపారు. అనంతరం వారిని కామారెడ్డి న్యాయస్థానంలో హాజరుపరిచారు. దర్యాప్తులో




నిందితులు తమను ప్రెస్ రిపోర్టర్లుగా పరిచయం చేసుకొని ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యక్తులను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడైంది. వారిపై ప్రతికూల వార్తలు ప్రచురిస్తామని, అధికారులకు ఫిర్యాదులు చేస్తామని, ఉద్యోగాలు పోయేలా చేస్తామని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆధారాలు లభించాయి. ఇలాంటి బెదిరింపులు, డబ్బుల వసూళ్లకు సంబంధించి కామారెడ్డి, ఎల్లారెడ్డి, దోమకొండ, గాంధారి, దేవునిపల్లి పోలీస్ స్టేషన్లలో గతంలోనూ పలు కేసులు నమోదైనట్లు దర్యాప్తులో తేలింది. ప్రస్తుత కేసులో కూడా ఇదే విధమైన పద్ధతిలో మృతురాలిపై ఒత్తిడి, బెదిరింపులు, మానసిక వేధింపులకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

## ధర్మపురి క్షేత్రం రూపురేఖలు మారుస్తాం

**కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాల నిర్వహణ**

**అభివృద్ధి పనులకు రూ.37 కోట్లు కేటాయింపు**

**సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడి**

**15వ వార్డులో అంబేద్కర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన**



**ధర్మపురి ఆగస్టు13 (వుదయం ప్రతినిధి):**

ఎన్నికల సందర్భంగా స్థానిక ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ధర్మపురి క్షేత్ర సమగ్ర అభివృద్ధికే తమ ప్రభుత్వం కట్టుబడి ఉంద ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టత కలిగిన ధర్మపురి క్షేత్రం లో ప్రస్తుతం చేపడుతున్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రాబోయే రోజుల్లో ఈ ప్రాంత రూపు రేఖలు పూర్తిగా మారిపో నున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గురువారం ధర్మపురి పట్టణంలోని 15వ వార్డులో నూతనంగా నిర్మించ నున్న అంబేద్కర్ భవన నిర్మాణ పనులకు మంత్రి అడ్లూరిలక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజ రై భూమి పూజ చేసి, పనులను ప్రారంభించారు. భవిష్యత్ తరా లకు ఉపయోగపడేలా అంబేద్క ర్ భవనం ఈ సందర్భంగా ఏర్పా టు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పట్టణం లోని వివిధ కుల సంఘాల భవ నాల నిర్మాణానికి అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. భవిష్యత్ తరాలకు, విద్యార్థులకు ఎంతో ప్రయో జనకరంగా ఉండేలా ఈ అంబేద్కర్ భవనాన్ని అత్యాధు నిక వసతులతో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పా టు చేస్తామని, దీనివల్లమున్సిపా లిటీకి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. అలాగే మిగిలిన రెండు అంతస్తుల్లో విద్యార్థులు పోటీ పరీక్షలకుసిద్ధమయ్యేలా, వారి చదువుకు కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులు,స్టడీ మెటీరి యల్ అందుబాటులో ఉంచనున్నట్లు వివరించా రు.గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రజా ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిందని మంత్రి తెలిపారు. అందులో భాగంగా పుష్కరాల నిర్వ హణ కోసం ప్రభుత్వం రూ.117 కోట్లు కేటాయించగా, ఒక్క ధర్మపురి క్షేత్ర అభివృద్ధి పనుల కోసమే రూ.37 కోట్లు వెచ్చిస్తున్నట్లు స్పష్టం చేశారు.టియుఎఫ్ఐడిసి ద్వా రా రూ.15 కోట్ల నిధులు,కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం నిధులను సాధించి ధర్మపురి మున్సి పాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాలను మరిం త బలోపేతం చేస్తామన్నారు.ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలతో ధర్మపురి పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకోనుందని పునరుద్ఘా టించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘన భట్ల.దినేష్, కుల సంఘం నాయకుడు సంజీవ్ స్వామి, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నియంత్రణకు విస్తృత అవగాహన అవసరం: కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి):**



ఎయిడ్స్ నియంత్రణకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగ నిర్ధారణ పరీక్షలను మరింత విస్తరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వైద్యాధికారులను ఆదేశించారు, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో గురువారం ఎయిడ్స్ నియంత్రణపై వైద్య, ఆరోగ్య శాఖ, సంక్షేమ, విద్య, యువజన శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్ పాజిటివ్ కేసుల సంఖ్య, వారికి అందుతున్న వైద్య సేవలు, మందులు, కౌన్సెలింగ్ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు,అధికారులు అందించిన వివరాల ప్రకారం జిల్లాలో ప్రస్తుతం 1,283 మంది హెచ్ఐవీ పాజిటివ్ బాధితులు ఉన్నారని, వారికి ప్రతి నెలా అవసరమైన మందులు, వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రి, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు,పాజిటివ్ కేసులు గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేకంగా స్క్రీనింగ్ నిర్వహించి, బాధితులకు నిరంతర వైద్యం, మందులు, కౌన్సెలింగ్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, దాని ప్రకారం పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు, యువత, విద్యార్థుల్లో ఎయిడ్స్‌పై అపోహలు తొలగించేలా అవగాహన సమావేశాలు, పోటీలు నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈవో వెంకట మాధవ రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, వైద్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పరిమితం కాకుండా ఉపాధ్యాయులకు అకడమిక్ సహకారం అందించాలి : కలెక్టర్

**పెద్దపల్లి (హైదరాబాద్) ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి)**

అకడమిక్ ప్యానల్ సందర్శనలు కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా ఉపాధ్యాయులకు అవసరమైన అకడమిక్ సహకారం అందిస్తూ, పాఠశాలల్లో నిరంతర విద్యా అభివృద్ధికి దోహదపడేలా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. తరగతి గది బోధనా పద్ధతులను బలోపేతం చేయడం, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడం అకడమిక్ మానిటరింగ్ ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు.గురువారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్రంలోని అన్ని మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కోసం నిర్వహించిన ఒకరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో అమలు చేస్తున్న అకడమిక్ ప్యానల్ విధానంపై రాష్ట్ర స్థాయి అధికారులకు ప్రజెంటేషన్ ఇచ్చారు. పెద్దపల్లి జిల్లాలో అకడమిక్ ప్యానల్ ద్వారా పాఠశాలలను క్రమబద్ధంగా సందర్శిస్తూ, పాఠశాల స్థాయిలో బోధన–అభ్యసన ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. ప్రతి పాఠశాల సందర్శనలో తరగతి గది పరిశీలన, విద్యార్థుల స్పాట్ అసెస్‌మెంట్ తప్పనిసరిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థుల అభ్యసన స్థాయిని ప్రత్యక్షంగా అంచనా వేసి, అభ్యసనలో వెనుకబడిన అంశాలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన జోక్యాలను ప్రణాళిక చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థుల అభ్యసన డేటాను ఆధారంగా చేసుకుని బోధనా ప్రణాళికలను మరింత ప్రభావవంతంగా రూపొందించాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఫీడ్‌బ్యాక్ ఇచ్చే విధానం నిర్మాణాత్మకంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉపాధ్యాయుల బోధనలోని 2–3 మంచి అంశాలను గుర్తించి అభినందించడంతో పాటు, మెరుగుదలకు అవసరమైన ఒక స్పష్టమైన, ఆచరణ సాధ్యమైన తదుపరి చర్యను సూచించాలని అన్నారు.అకడమిక్ ప్యానల్ సందర్శనల ద్వారా ఉపాధ్యాయులలో భయాన్ని కలిగించడం కాకుండా, వారి బోధనా సామర్థ్యాలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన అకడమిక్ సహకారం అందించాలన్నారు.




## యువత ఉత్సాహం చూస్తుంటే.. భారత్ విశ్వగురుగా మారడం ఖాయం: ఎమ్మెల్యే ఏలేటిమహేశ్వర్ రెడ్డి

**నిర్మల్ జిల్లా 13 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**



'భారత్ మాతాకీ జై' తో మార్మోగిన నిర్మల్.. ఘనంగా తిరంగా ర్యాలీ.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, దేశం, ధర్మం కోసం యువత తమ సమయాన్ని కేటాయించాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన తిరంగా ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. పాఠశాల, కళాశాలల విద్యార్థులు, యువకులు, దేశభక్తులు, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని దేశభక్తిని చాటారు. 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో నిర్మల్ పట్టణం మార్మోగింది. స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్, అంబేద్కర్ చౌక్, పాత బస్టాండ్ మీదుగా వివేక్ చౌక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ర్యాలీలో యువత చూపిన ఉత్సాహం చూస్తుంటే భారత దేశం ప్రపంచంలోనే విశ్వగురుగా అవతరించే దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. దేశభక్తి భావన ప్రతి ఒక్కరిలో మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. 'వందేమాతరం' గీతాన్ని దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ ఆలపించేలా ప్రధాని నరేంద్ర మోదీ చట్టబద్ధత కల్పించారని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కేంద్రంలోని మోదీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించి యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, భూమయ్య, స్రవంతి రెడ్డి, తక్కల రమణ రెడ్డి, కరిపే విలాస్, మెడిసెమ్మ రాజు, రాజేశ్వర్ రెడ్డి, BJYM జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు , పట్టణ బీజేపీ కౌన్సిలర్లు, విద్యార్థులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## పెండింగ్ లో ఉన్న సివిల్ పనులను వేగవంతం చేయాలి



- **సివిల్ పనుల పురోగతిపై సమీక్షా సమావేశం**
- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**మహబూబ్ నగర్ ఆగస్టు13 (వుదయం ప్రతినిధి)**

పెండింగ్ లో ఉన్న సివిల్ పనులను వేగవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కె.జి.బి.వి) చేపడుతున్న సివిల్ పనుల పురోగతిపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో కె.జి.బి.వి ల్లో కొనసాగుతున్న పనులతో పాటు పెండింగ్లో ఉన్న పనుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్లో ఉన్న సివిల్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పనులు ఆలస్యం కాకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమీక్షా సమావేశంలో ఈ డబ్ల్యూ ఐ డి సి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, కె.జి.బి.వి ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- **లోటుపాట్లకు తావులేకుండా ఘనంగా నిర్వహించాలి**
- **శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ మధు మోహన్**

**గద్వాల ఆగస్టు 13 (వుదయం బ్యూరో)**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధు మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలోని తన ఛాంబర్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గద్వాల్ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న వేడుకలకు సంబంధించి శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులందరికి ముందుగానే ఆహ్వానాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీస్ పరేడ్ మైదానంలో వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ను ఆదేశించారు. వేడుకల ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్యం, సౌకర్యాల సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్కు సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాన్ని వేడుకల ప్రాంగణంలో అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే వివిధ శాఖల ఆధ్వర్యంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. స్టాళ్లను ఆకర్షణీయంగా, వినూత్నంగా ఏర్పాటు చేసిన ఉత్తమ శాఖలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను గుర్తించి వారికి ప్రశంసాపత్రాలు అందజేయాలని సూచించారు. ప్రోటోకాల్స్ ను ఖచ్చితంగా పాటిస్తూ, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మధు మోహన్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు, ఆర్డీఓ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏఓ మంజుల, గద్వాల్ తహశీల్దార్ హరికృష్ణతో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు

- **మున్సిపల్ చైర్ పర్సన్ కొండ శ్వేతా సత్య యాదవ్**

**నారాయణపేట టౌన్, ఆగస్టు13 (వుదయం ప్రతినిధి):**



నారాయణపేట మున్సిపల్ పరిధిలోని అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ కొండ శ్వేత సత్యయాదవ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పెన్షన్ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరు మున్సిపాలిటీ పరిధిలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. వైస్ చైర్ పర్సన్ ఆయా వార్డుల కౌన్సిలర్లు సైతం అర్హులైన ప్రతి ఒక్కరి దరఖాస్తులను స్వీకరించాలని ఆమె తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఆమె కోరారు. చేయూత పెన్షన్ పథకం కింద అర్హులైన ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, నేత కార్మికులు ఇతర అర్హత కలిగిన లబ్ధిదారుల నుండి చేయూత పెన్షన్ మంజూరు కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇందుకు గాను పూర్తి చేసిన దరఖాస్తు ఫారం దరఖాస్తుదారుని భర్త/భార్య యొక్క ఆధార్ కార్డు,రేషన్ కార్డు,బ్యాంకు ఖాతా పాస్బుక్ జిరాక్స్,సంబంధిత పెన్షన్ కేటగిరికి అవసరమైన ధృవ పత్రాలు,పాస్పోర్ట్ సైజ్ ఫోటో లతో తమ దరఖాస్తులను నారాయణపేట మున్సిపాలిటీ కార్యాలయంలో లేదా సంబంధిత వార్డు అధికారికి సమర్పించాలని ఆమె కోరారు.

## పోలీసు సిబ్బంది శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు అవసరం





- **రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన ఇండోర్ షటిల్ కోర్టును ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ**

**నాగర్ కర్నూల్, ఆగస్టు 13 (వుదయం బ్యూరో):**

విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసు అధికారులు, సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు విధుల్లో మరింత ఉత్సాహంగా, సమర్థవంతంగా పనిచేసేందుకు క్రీడలను పోలీస్ అధికారులు తమ బిజీ షెడ్యూల్లో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు.

జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు అధికారులు, సిబ్బంది కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ఇండోర్ షటిల్ కోర్టును జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ గురువారం ప్రారంభించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం, ఫిట్నెస్తో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించేందుకు సుమారు రూ.8 లక్షల నిధులతో ఈ ఇండోర్ షటిల్ కోర్టును ఏర్పాటు చేశారు.

ఇండోర్ షటిల్ కోర్టు ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమై ఉంటారని, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో సేవలందించడం వంటి బాధ్యతలను నిర్వర్తించే క్రమంలో తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో క్రీడలు వారికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తెలిపారు. క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం, ఏకాగ్రత, చురుకుదనం పెరగడంతో పాటు ఒత్తిడి తగ్గుతుందని, పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటే విధి నిర్వహణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించగలరని అన్నారు. పోలీసు సిబ్బందికి మెరుగైన క్రీడా వసతులు కల్పించేందుకు రూ.8 లక్షల నిధులతో ఇండోర్ షటిల్ కోర్టును జిల్లా ఎస్పీ ప్రత్యేక కృషితో ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు.జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్ మాట్లాడుతూ..పోలీసు ఉద్యోగుల ఆరోగ్యం, ఫిట్నెస్ను దృష్టిలో ఉంచుకుని ఇండోర్ షటిల్ కోర్టు ఏర్పాటుకు సహకరించిన జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం ప్రజా సేవలో ఉంటారని, అనేక సందర్భాల్లో రాత్రింబవళ్లు విధులు నిర్వహించాల్సి వస్తుందని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక ఫిట్నెస్ను పెంపొందించుకోవడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని అన్నారు.కోర్టు ప్రారంభోత్సవం అనంతరం కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్, అదనపు ఎస్పీ తదితర అధికారులు నూతన ఇండోర్ షటిల్ కోర్టులో స్వయంగా బ్యాడ్మింటన్ ఆడి ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ ఆర్డీఓ అర్చన, నాగర్ కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు, నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ తబితా రాణి, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, సీఐ అశోక్ రెడ్డి ఎస్ఐ వెంకట్ రెడ్డి పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సంగమేశ్వర్‌కు ఘన సన్మానం

**సంగారెడ్డివుదయం**

ఎంఆర్ఎఫ్ కంపెనీలో సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఏదుల సంగమేశ్వర్ కు జిల్లా వీర శైవా సమాజం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వీర శై వా సమాజం అధ్యక్షుడు ఇప్పపల్లి నరసింహులు లింగన్నను శాలువాతో ఘనంగా సత్కరించి, ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం సంగమేశ్వర్ కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వీర శై వా సమాజం సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొని లింగన్నను అభినందించారు.

## 19వ మహాపాదయాత్ర
# కరపత్ర ఆవిష్కరణ

**పటాన్చెరు (వుదయం):**

శ్రావణమాసం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమంలో శ్రీ కాశీ సింహనాదేశ్వర శ్రీశ్రీశ్రీ 1008 డాక్టర్ చంద్రశేఖర శివాచార్య మహాస్వామివారిని వీరశైవ లింగాయత్ సమాజం పటాన్చెరు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సమాజ ప్రతినిధులు, భక్తులు జగద్గురువారికి శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి ఆశీర్వాదాలు పొందారు.అనంతరం వీరశైవ లింగాయత్ సేవాసమితి మరియు వీరశైవ లింగాయత్ మహాపాదయాత్ర కమిటీ - పటాన్చెరు నియోజకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 19వ మహాపాదయాత్ర కరపత్రాన్ని జగద్గురు మహాస్వామివారు ఆవిష్కరించారు. ఈ మహాపాదయాత్ర పటాన్చెరులోని శ్రీ ఉమామహేశ్వర దేవాలయం నుండి బొంతపల్లిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయం వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా జగద్గురువారు మాట్లాడుతూ, ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక చైతన్యం మరియు సమాజ ఐక్యత కోసం నిర్వహించే మహాపాదయాత్రలు భక్తులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. యువత ధార్మిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా సనాతన విలువలు భావితరాలకు చేరుతాయని అన్నారు.కార్యక్రమంలో భాగంగా వీరశైవ లింగాయత్ సేవాసమితి వారు జగద్గురు శ్రీ కాశీ సింహనాదేశ్వర శ్రీశ్రీ శ్రీ 1008 డాక్టర్ చంద్రశేఖర శివాచార్య మహాస్వామివారి ఆధ్యాత్మిక సేవలు, ధర్మ ప్రచారాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ప్రత్యేక భక్తి గీతాన్ని మహాస్వామివారి చేతుల మీదుగా విడుదల చేయించారు. ఈ గీతం భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే విధంగా రూపొందించబడినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జయప్రకాష్, రాజు, పోచారం అశోక్, సుధాకర్, రాచయ్య స్వామి, నీలకంఠప్ప, చంద్రశేఖర్, ప్రశాంత్ కుమార్ తదితరులతో పాటు అధిక సంఖ్యలో వీరశైవ లింగాయత్ సమాజ సభ్యులు, హిందూ బంధువులు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## గణప సముద్రం భూ నిర్వాసితుల పరిహార చర్చలు సఫలం

**వనపర్తి ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి)**

గణప సముద్రం రిజర్వాయర్ వల్ల ఎంతో మంది రైతులు లబ్ది పొందుతారు కాబట్టి భూములు కోల్పోతున్న రైతులకు సైతం ప్రభుత్వం తరపున సరైన న్యాయం అందే విధంగా బాధ్యత తీసుకుంటామని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు.

గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర ఆర్ అండ్ ఆర్ కమిషనర్ కిల్లు శివకుమార్ నాయుడు, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి బుద్ధారం, ఘనపూర్ గణపసముద్రం భూ నిర్వాసితులతో నష్ట పరిహారం విషయంలో ముఖాముఖి చర్చలు జరిపారు.

ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ గణప సముద్రంలో లక్ష్యం మేరకు నీటి నిల్వ సామర్థ్యం తగ్గించకుండా బండ్ ఎత్తు పెంచుకుంటే రైతుల నుండి సేకరించాల్సిన నికర భూమి తగ్గుతుందని, తద్వారా ఇటు రైతులు అటు ప్రభుత్వానికి లాభం కలుగుతుందని ఆ దిశగా సర్వే పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ శాఖ అధికారులను సూచించారు. భూమి కోల్పోతున్న రైతులకు నిబంధనల ప్రకారం ఎకరాకు 11.25 లక్షలు పరిహారం చెల్లించాల్సి ఉందని కానీ సన్న, చిన్నకారు రైతులు నష్టపోతున్నందున కాస్త పెంచి ఇచ్చే విధంగా చూడాలని కలెక్టర్ ను కోరారు.

భూ నిర్వాసిత రైతులు ఎకరాకు రూ. 15 లక్షలు చెల్లించాల్సిందిగా కోరగా నష్టపోతున్న రైతులను సృష్టిలో ఉంచుకొని 14 లక్షలు ఇస్తే బావుంటుందని శాసన సభ్యులు కలెక్టర్ ను కోరారు. ఇల్లు లేని పేద నిర్వాసితులు ఇందిరమ్మ ఇళ్లు సైతం మంజూరు చేసే బాధ్యత నాదని, రైతులు సహకరించాలని రైతులను కోరారు.

ఇందుకు సమ్మతించిన రైతులు 1415 లక్షలు కాకుండా 14 కు మించి కాస్త ఎక్కువ చేసి ఇవ్వాల్సిందిగా కోరుచు బాధ్యతను కలెక్టర్ పై వదిలిపెట్టారు.

మొత్తానికి గణప సముద్రం, బుద్ధారం భూ నిర్వాసితుల భూసేకరణ విషయంలో చర్చలు కొలిక్కి వచ్చి పరిష్కారం కావడం పట్ల శాసన సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పి. ఎన్ చేసిన నాటికి ప్రభుత్వ భూ విలువ ఎంత ఉంటుందో దానికి మూడు రెట్లు లెక్కించి పరిహారం చెల్లించాల్సి ఉంటుందని కానీ రైతులు, శాసన సభ్యుల కోరిక మేరకు నేడు చర్చలు జరిపి ఒక అంగీకారానికి రావడం జరిగిందన్నారు.

ఆర్ అండ్ ఆర్ కమిషనర్ కిల్లు శివకుమార్ నాయుడు మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు నష్టం జరగడం సహజమే అని, కానీ చాలా మంది రైతులకు లబ్ధి చేకూరటంతో పాటు తమకు మిగిలిన భూమికి ఎక్కువ డిమాండు ఏర్పడుతుందన్నారు. జనరల్ అవార్డుకు వెళితే రైతులు నష్టపోతారని అందుకే చర్చలు జరిపి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. బండ్రాయిపాకుల నిర్వాసితులకు పునరావాస కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

ఈ చర్చా సమావేశంలో ఆర్డీఓ సుబ్రమణ్యం , ఇరిగేషన్ ఎస్. ఈ చంద్రశేఖర్, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ తిరుపతయ్య, ఎ.డి. సర్వే శ్రీనివాసులు, రహసిల్దార్లు, పెద్దమందడి, ఘనపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నవనీత, అచ్యుత రావు, నిర్వాసితులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.






## బుగ్గపల్లి మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**వనపర్తి ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి)**

ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందేలా నీటి శుద్ధి ప్రక్రియ పటిష్టంగా చేపట్టాలి బుగ్గపల్లిలోని 75 ఎంఎల్డీ మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిక్షేత్రస్థాయిలోనూ నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిపెద్ద మందడి మండలం బుగ్గపల్లి వద్ద ఉన్న 75 ఎంఎల్డీ సామర్థ్యం గల మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మొక్కను నాటారు. అనంతరం మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకట రమణతో కలిసి నీటి శుద్ధి ప్లాంట్లోని వివిధ విభాగాలను పరిశీలించారు.

ప్లాంట్లో నీటి ప్రవాహం, ఫిల్టరేషన్ ప్రక్రియకు సంబంధించిన ఫ్లో డయాగ్రామ్ను కలెక్టర్ పరిశీలించారు. గౌరిదేవిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు ప్లాంట్కు ఏ విధంగా చేరుతుంది, ప్లాంట్కు చేరిన అనంతరం వివిధ దశల్లో నీటిని ఏ విధంగా శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ప్లాంట్లోని నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను కలెక్టర్ సందర్శించారు. నీటి వడపోత (ఫిల్ట్రేషన్) ప్రక్రియ, నీటి నాణ్యతను పరీక్షించే విధానం, శుద్ధి చేసిన నీటి నాణ్యతను నిర్ధారించే పరీక్షలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ నుంచి ప్రజలకు సరఫరా చేసే సమయంలో ఉన్న నీటి నాణ్యత క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరే వరకు అదే స్థాయిలో కొనసాగుతుందా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు క్షేత్రస్థాయిలో కూడా నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, నీటి శుద్ధి ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ అంజద్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక సర్పంచ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం



**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని న్యూ జనరేషన్ జూనియర్ కళాశాలలో మై భారత్ (కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ) ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛత పక్వాడాలో భాగంగా విద్యార్థులతో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు.యువజన సంఘాల నాయకుడు చేపూరి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించాలని సూచించారు."స్వచ్ఛత మన బాధ్యత-పరిశుభ్రమైన భారత్ మన లక్ష్యం" అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యువత ముందుండి పనిచేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళి, సిబ్బంది మహేందర్, యువజన సంఘాల నాయకులు అజయ్, చందు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో లక్ష్మప్పను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు



**తాండూర్ ఆగస్టు 13 వుదయం ప్రతినిధి**

మండల ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి లక్ష్మప్ప అందించిన సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, ఎంపీడీవో విశ్వ ప్రసాద్ తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని లక్ష్మప్పకు శుభాకాంక్షలు తెలిపారు.

## వికారాబాద్ అభివృద్ధికి భారీ నిధుల వరద!

- **వైద్యం.. రోడ్లు.. సాగునీరు.. పర్యాటకం— నియోజకవర్గ రూపురేఖలు మార్చడమే లక్ష్యం**
- **కుక్కిందలో రూ.25 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభం.. ఔసుపల్లిలో రూ.20 లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవనానికి శ్రీకారం**
- **రెండేళ్లలో నియోజకవర్గంలోని అన్ని రోడ్లను బాగు చేస్తాం: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**వికారాబాద్, ఆగస్టు 13 (వుదయం బ్యూరో):**



నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గానికి వివిధ శాఖల ద్వారా భారీగా నిధులు మంజూరవుతున్నాయని, రాబోయే రోజుల్లో మౌలిక వసతులు, వైద్యం, రోడ్లు, సాగునీరు, పర్యాటక రంగాల్లో గణనీయమైన మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు.ధారూర్ మండలం కుక్కింద గ్రామంలో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని, ఔసుపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**పేదలకు వైద్యం భారం కాకూడదు**

పేద, మధ్యతరగతి కుటుంబాలు వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితుల్లో పడకుండా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి భారీగా నిధులు కేటాయిస్తోందని స్పీకర్ తెలిపారు. ఆరోగ్య సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మహిళా సాధికారత కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

**వికారాబాద్‌కు రూ.1,133 కోట్లకు పైగా నిధులు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో వికారాబాద్ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరవుతున్నాయని ప్రసాద్ కుమార్ వెల్లడించారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా రూ.600 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఇప్పటికే రూ.480 కోట్లు, తాజాగా మరో రూ.53 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అంటే ఈ రెండు శాఖల ద్వారానే మొత్తం రూ.1,133 కోట్లకు పైగా నిధులు అందుబాటులోకి వచ్చినట్లు ఆయన వివరించారు.సాగునీరు అందుబాటులోకి వస్తే వికారాబాద్ ప్రాంత రైతుల కష్టాలు తీరడంతో పాటు వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి వస్తుందని స్పీకర్ పేర్కొన్నారు.

**కోటపల్లి ప్రాజెక్టుకు రూ.90 కోట్లు**

స్వర్గీయ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన కోటపల్లి ప్రాజెక్టును అనంతరం పాలకులు పట్టించుకోలేదని ప్రసాద్ కుమార్ అన్నారు.

ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి స్థాయి మరమ్మతుల కోసం రూ.90 కోట్లు మంజూరు చేయించామని, పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో చెరువుల ఆధునికీకరణతో పాటు కొత్త చెక్‌డ్యాంల నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**అనంతగిరికి రూ.2,500 కోట్లతో కొత్త రూపం**

వికారాబాద్ జిల్లాలో పర్యాటక రంగానికి అపారమైన అవకాశాలున్నాయని స్పీకర్ తెలిపారు. అనంతగిరి ప్రాంతాన్ని సుమారు రూ.2,500 కోట్లతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.ఈ ప్రాజెక్టు పూర్తయితే పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతో పాటు సుమారు 5 వేల నుంచి 10 వేల వరకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. స్థానిక యువతకు, స్థానిక ప్రజలకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.వైద్యం నుంచి పర్యాటకం వరకు.. అభివృద్ధి బాటలో వికారాబాద్ఒకవైపు గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు నిర్మిస్తూనే.. మరోవైపు రహదారుల అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, చెక్‌డ్యాంలు, పర్యాటక రంగంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని స్పీకర్ వివరించారు.వికారాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే నా లక్ష్యం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తాం. రాబోయే రెండేళ్లలో రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు సాగునీరు, వైద్యం, పర్యాటకం, మౌలిక వసతుల రంగాల్లో గణనీయమైన మార్పు తీసుకువస్తాం" అని గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు.కుక్కింద ఆరోగ్య ఉపకేంద్రం.. ఔసుపల్లి గ్రామపంచాయతీ భవనం ప్రారంభంతో మొదలైన అభివృద్ధి కార్యక్రమాలు.. వికారాబాద్ నియోజకవర్గంలో మరిన్ని మౌలిక వసతుల పనులకు నాంది పలుకుతున్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పేర్కొన్నారు.



# లేఅవుట్లలో నిబంధనలకు తిలోదకాలిస్తే చర్యలు ఖాయం

- **మున్సిపల్ అధికారులకు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ హెచ్చరిక**

**నాగర్ కర్నూల్ ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి):**

నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రైవేటు ప్లాట్ల లేఅవుట్లను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పట్టణ విస్తరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో లేఅవుట్లు క్రమబద్ధంగా ఉండేందుకు, భవిష్యత్తులో ప్రజలకు రహదారులు, మౌలిక సదుపాయాల విషయంలో ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదురుగా, జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదురుగా, కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న లేఅవుట్లను పరిశీలించి, అవి ప్రభుత్వ నిబంధనలు, మున్సిపల్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు.లేఅవుట్లలో ప్లాట్ల విభజన, రహదారుల ఏర్పాటు, రోడ్లకు కేటాయించిన స్థలం, లేఅవుట్ హద్దులు, మౌలిక సదుపాయాల కోసం కేటాయించిన ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. రహదారుల విస్తీర్ణం నిర్ణీత ప్రమాణాల మేరకు ఉందా, హద్దులు సక్రమంగా నిర్ధారించారా అనే అంశాలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ప్రైవేటు లేఅవుట్ల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకే జరగాలని స్పష్టం చేశారు. మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు ఏర్పాటు కాకుండా పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. రహదారుల విస్తీర్ణం అత్యంత కీలకమని, భవిష్యత్తులో జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని రోడ్ల వెడల్పు నిబంధనల మేరకు ఉండేలా చూడాలని సూచించారు. లేఅవుట్ల హద్దులు స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన లేఅవుట్లపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన

- **ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు**
- **15వ ఆర్థిక సంఘం నిధుల సమర్థ వినియోగం**
- **జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు**

**గద్వాల ఆగస్టు 13 (వుదయం బ్యూరో)**

గ్రామాల వాస్తవ అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి, అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యతా క్రమంలో అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై జిల్లా స్థాయి కార్యాచరణ సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు గ్రామ స్థాయిలో సమగ్ర అభివృద్ధి సాధనకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు కీలక సాధనమని పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిస్థాయిలో సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు.
పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా గ్రామాల వాస్తవ అవసరాలను ప్రతిబింబించేలా ఉండాలని స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన, జీవనోపాధి మెరుగుదల, ఆరోగ్యకరమైన గ్రామాలు, బాలల అనుకూల వాతావరణం, నాణ్యమైన విద్య, తాగునీరు, పారిశుద్ధ్యం, పచ్చదనం, స్వయం సమృద్ధ మౌలిక వసతులు, సామాజిక న్యాయం, సుపరిపాలన, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి వంటి పనులను ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల్లో చే



ర్చాలని ఆదేశించారు.తమ శాఖలకు సంబంధించిన గణాంకాలు, భౌతిక-ఆర్థిక ప్రగతి, గ్రామాల అవసరాలకు సంబంధించిన వివరాలను సకాలంలో అందించి ప్రణాళికల రూపకల్పనకు సహకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
అలాగే గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించి, గ్రామాభివృద్ధికి అత్యవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో అమలు చేయాలని అన్నారు. రూపొందించే ప్రణాళికలు గ్రామాల సమగ్రాభివృద్ధికి దోహదపడటంతో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆదర్శంగా నిలిచేలా ఉండాలని సూచించారు. ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి, నిర్దేశిత గడువులోగా ప్రతిపాదనలు సమర్పించాలని, శాఖల మధ్య సమన్వయంతో నాణ్యమైన జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగేంద్రం, డీఆర్డీఓ ముషాయిదా బేగం, డీపీఓ శ్రీకాంత్, డీడబ్ల్యూఓ సునంద, డీఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, మత్స్యశాఖ అధికారి షకీలా భాను, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్ జ్యోతి బాలస్వామి ని పరామర్శించిన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి

**వుదయంన్యూస్, కొండపాక ప్రతినిధి ఆగస్టు 13:**

మండల పరిధిలోని దమ్మకపల్లి గ్రామ సర్పంచ్ జ్యోతి బాలస్వామి అత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి,గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తో కలిసి గురువారం రోజు దమ్మక్కపల్లిలోని సర్పంచ్ ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ జ్యోతి బాలస్వామి కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడం చాలా బాధాకరం అన్నాడు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, మాజీ రైతుబంధు కన్వీనర్ ర్యాగళ్ల దుర్గయ్య, నాయకులు పాల రమేష్ గౌడ్, అంబటి భానుచందర్ గౌడ్, చిట్టి నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ భరత్ పటేల్,గ్రామ శాఖ అధ్యక్షుడు కూరటి రమేష్, మేకల మల్లేశం, తోకల సంపత్, దొమ్మాట చంద్రశేఖర్, గుర్రాల రాజు, చిక్కుడు భాను, పల్లె బాబు, రాకేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు క్రమశిక్షణే పునాది

- **గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఇంటర్ విద్యాధికారి యం. హృదయ రాజు ఆకస్మిక తనిఖీ**

**గద్వాల ఆగస్టు 13 (వుదయం కరస్పాండెంట్)**




విద్యార్థులు క్రమశిక్షణ, సమయ పాలనతో మెలుగుతూ చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని జోగులాంబ గద్వాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి యం. హృదయ రాజు సూచించారు. గద్వాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (కోఎడ్యుకేషన్)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభ్యాసం, కళాశాలలో పాటిస్తున్న నిబంధనలు, సమయపాలన తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రతిరోజూ ఉదయం 9:30 గంటలకల్లా ప్రార్థనకు హాజరుకావాలని, గద్వాల పట్టణంలో నివసించే విద్యార్థులు సైతం సమయపాలనను కచ్చితంగా పాటించాలని సూచించారు.
ఫ్ చేసి ఉంచాలని ఆదేశించారు.

**పరిశుభ్రతతో పాటు చదువులోనూ శ్రద్ధ**

కళాశాల పరిసరాలు, తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. అధ్యాపకులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని, ప్రతి అధ్యాయం పూర్తయిన వెంటనే ప్రశ్నలు-జవాబులను పూర్తిస్థాయిలో అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు.

**ప్రతిభకు అండగా ఉంటాం**

ఉన్నత ఆశయాలు కలిగి ఉండి ఆర్థికంగా లేదా ఇతర సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని యం. హృదయ రాజు హామీ ఇచ్చారు. అవసరమైన విద్యార్థులు అధ్యాపకులను లేదా తనను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.

**అధ్యాపకుల పనితీరుపై సమీక్ష**

అనంతరం కళాశాల అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన జిల్లా ఇంటర్ విద్యాధికారి బోధనా డైరీలు, మార్కుల రిజిస్టర్లను పరిశీలించారు. నిర్ణీత గడువులోగా పాఠ్యాంశాలను పూర్తి చేయాలని సూచించారు. పరీక్షలు పూర్తయిన వెంటనే మూల్యాంకనం నిర్వహించి, మార్కులను రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కూడా ఖచ్చితమైన సమయపాలన పాటించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు వీరన్న, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచుల డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలి

- **పంచాయతీరాజ్ చట్టం–2018 రద్దు చేయాలని డిమాండ్**

**నాగర్ కర్నూల్ రూరల్ ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి):**

గ్రామ పంచాయతీలకు మరిన్ని అధికారాలు, నిధులు, విధులు బదలాయించి స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్, నాగర్‌కర్నూల్ జిల్లా సర్పంచుల సంఘం డిమాండ్ చేసింది. గురువారం నిర్వహించిన పత్రికా సమావేశంలో సర్పంచుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయకులు కోరారు.పంచాయతీరాజ్ సంస్థల మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018ను రద్దు చేయాలని లేదా సవరించాలని డిమాండ్ చేశారు. 73వ రాజ్యాంగ సవరణ చట్టంలోని 29 అధికారాలు, విధులు, నిధులను యథాతథంగా గ్రామ పంచాయతీలకు బదలాయించాలని కోరారు.గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతున్నందున ఉప సర్పంచులకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేయాలని, గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక సెస్సులు, స్టాంప్ డ్యూటీ, సీనరేజ్, మైనింగ్, పన్నుల ఆదాయాన్ని నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని కోరారు.నూతన గ్రామ పంచాయతీల పరిధిని రెవెన్యూ గ్రామాల ప్రాతిపదికన నిర్ణయించాలని, తండా గ్రామ పంచాయతీలకు భవనాలు, రహదారులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మైనర్ గ్రామ పంచాయతీలకు రూ.5 లక్షలు, మేజర్ గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.




గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.500 కోట్ల జనరల్ ఫండ్ బకాయిలు, 15వ ఆర్థిక సంఘం కింద రూ.1,090 కోట్లు, రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంట్ల రూ.2,979 కోట్లను విడుదల చేయాలని కోరారు.
ఎంఎల్‌సీ ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సర్పంచుల గౌరవ వేతనాన్ని రూ.6,500 నుంచి రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో సర్పంచుల అధికారాలను నిర్వీర్యం చేసే జీవోను రద్దు చేయాలని, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులను నేరుగా పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని కోరారు.
ఈ సమావేశంలో రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, కన్వీనర్ వీరోజు సుప్రియ మురళీ, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ, రాష్ట్ర కార్యదర్శి మందిపల్లి వెంకట్ పాల్గొన్నారు.

# పోలీసులను ఆట పట్టిస్తున్న అల్లరి కోతి

- **ఉమామహేశ్వర క్షేత్రంలో వింత సంఘటన**

**అచ్చంపేట ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి):**

నాగర్ కర్నూల్ జిల్లా నల్లమల కొండల్లో శ్రీశైల ఉత్తర ద్వారంగా వెలసిన అచ్చంపేట మండల పరిధిలోని శ్రీ ఉమామహేశ్వర క్షేత్రంలో గురువారం డ్యూటీలో ఉన్న పోలీసులను కోతులు ఆటపట్టించాయి. ఉమామహేశ్వర పుణ్యక్షేత్రంలో విధుల్లో ఉన్న ఉప్పునుంతల పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ రెడ్య నాయక్ ను ఓ వానరం సరదాగా ఆటపట్టించింది. అతడి భుజంపై కూర్చుని తలపై పేళ్లు చూస్తూ, చెవిలో ఏదో చెబుతున్నట్లు వింత చేష్టలు చేసింది. ఇదే సమయంలో మరో కోతి విధుల్లో ఉన్న ఎస్సై జేబులోని పెన్ను



తీసి కింద పడేసింది. క్షణాల్లో జరిగిన ఈ సంఘటనతో పోలీసులు నవ్వుకుంటూ కోతిని దూరంగా పంపారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఈ దృశ్యాలను ఆసక్తిగా వీక్షించారు. సెల్ ఫోన్లలో వీడియోలు తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారు. నల్లమల అటవీ ప్రాంతంలో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో భక్తులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆలయ అధికారులు సూచించారు.

# కొడంగల్ ఎత్తిపోతల అవకతవకలపై లోకాయుక్తకు

- **బి. ఆర్. ఎస్ మాజీ ఎమ్మెల్యేల ఫిర్యాదు**

**నారాయణపేట ఆగసు13 (వుదయం ప్రతినిధి)**

వికారాబాద్ జిల్లాల పరిధిలో చేపడుతున్న మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అవక తవకలు, అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేం దర్ రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి లు గురువారం లోకా యుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నారాయణపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్య క్షులు ఎస్.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఏం.ఎన్.కే. ఎల్.ఐ.ఎస్ లో ముఖ్యంగా నారాయణపేట మండలం పేరపల్ల గ్రామ శివారులో చేపట్టిన భూముల సేకర ణలో పెద్ద ఎత్తున అక్రమా లు చోటు చేసుకున్నట్లు తెల్సుందని, ముఖ్యంగా దొంగ పాస్ బుక్ లతో నష్ట పరిహారం ఎత్తుకునేం దుకు కాంగ్రెస్ నాయకులు పన్నాగంతో దండు కునేందుకు ప్రణాళికలు రూపొందించి నట్లు పక్కా సమాచారం ఉందన్నారు. అంతే కాకుం డా పేరపల్ల శివారులోని జయమ్మ చెరువులో నీరు నిల్వ చేయడం వల్ల కొంత మంది రైతులకు సంబంధిం చి భూములు కోల్పోకున్న, భూములు కోల్పోతున్నట్లు పేర్కొనడం, సర్వే నంబర్లూ ఒక చోట ఉంటే భూములు ఒక చోట ఉన్నట్లు



అధికా రులు చెప్పడం రైతులను అయోమయానికి గురి చేస్తుందన్నారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా, ప్రాజెక్టు పనుల్లో పారదర్శకత ఉండేలా చర్య లు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విచార ణలో అవినీతి, అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు తేలితే సంబంధిత అధికా రులపై, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు ఆయన తెలిపారు.ప్రజలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ప్రతి రూపాయి ప్రజాధనం సక్ర మంగా వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. లోకాయుక్త విచారణ ద్వారా వాస్తవాలు వెలుగులోకి రావాలని వారు కోరారు.

# మండల సర్వసభ సమావేశంలో సర్పంచులకు ఘన సన్మానం



- **గ్రామాల్లో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సేవ చేయాలి: సర్పంచులకు ఎమ్మెల్యే సూచన**
- **ప్రజలు మనపై ఉంచిన నమ్మకమే మన బలం.**
- **గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలి.**
- **సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దు.**
- **దిశానిర్దేశం**
- **ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి**

**తాండూర్ ఆగస్టు 13 వుదయం ప్రతినిధి**

మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ సమావేశంలో శాసనసభ్యులు (ఎమ్మెల్యే) మనోహర్ రెడ్డి గారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొత్తగా ఎన్నుకోబడిన మరియు బాధ్యతలు నిర్వర్తిస్తున్న సర్పంచులను, ఇతర ప్రజాప్రతినిధులను ఉద్దేశించి ఆయన కీలక సూచనలు చేశారు.సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... "మనపై ఎంతో నమ్మకంతో, ఆశలతో ప్రజలు మనల్ని గెలిపించారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రజాప్రతినిధులుగా మనందరి ప్రాథమిక బాధ్యత. రాజకీయాలకు అతీతంగా గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందేలా చూడాలి" అని పేర్కొన్నారు.

**ముఖ్యమైన సూచనలు:**

మౌలిక వసతుల కల్పన: గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధిదీపాల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలి.
ప్రభుత్వ పథకాల అమలు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి.
ప్రజలకు అందుబాటులో ఉండటం: స్థానిక ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకోవాలి.
ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు మరియు నాయకులు పాల్గొన్నారు.
మొదటి సర్వ సభ సమావేశంలో అన్ని గ్రామాల సర్పంచులు పాల్గొనడం వారికి ఘనంగా సన్మానించడం ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు సర్పంచులు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



- **తాండూర్ ఎమ్మెల్యే బుప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం: తాండూర్ ఎమ్మెల్యే బుయాని మనోహర్ రెడ్డి**

**తాండూరు ఆగస్టు 13 వుదయం ప్రతినిధి:-**

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సర్పంచ్‌లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తాండూర్ శాసనసభ్యులు బుయాని మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తాండూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ సత్తార్ ఆధ్వర్యంలో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. **ఆగస్టు 15 నుండి ఆసరా దరఖాస్తులు:**
ఆగస్టు 15 నుండి వితంతువులు, ఒంటరి మహిళల నుండి ఆసరా పింఛన్ల దరఖాస్తులను స్వీకరించాలని సర్పంచ్‌లకు, అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు మహిళలకు పెద్దపీట: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళాభ్యుదయానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వంటి విప్లవాత్మక పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.

**ప్రత్యేక వార్తా కథనం:**

గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు ఎలాంటి మంచినీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**సమావేశంలో/సమీక్షలో ముఖ్యమైన ఆదేశాలు:**

మిషన్ భగీరథ నీటి సరఫరా: ప్రతి ఇంటికి క్రమం తప్పకుండా, పరిశుభ్రమైన మిషన్ భగీరథ త్రాగునీటిని అందించాలని ఆదేశించారు. నీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా లీకేజీలను తక్షణమే అరికట్టాలన్నారు.
పారిశుద్ధ్య పనుల వేగవంతం: గ్రామాలు, వార్డులలో పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని, వీధులు మరియు బహిరంగ ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని స్పష్టం చేశారు.33 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# కన్స్యూమర్ యాప్ను ప్రారంభించిన కాప్స్టన్ హోమ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్

**(వుదయం ప్రతినిధి)**

బ్రాండ్ అంబాసిడర్గా శ్రీ అక్కినేని నాగార్జున; దేశంలోని ప్రధాన నగరాలకు విస్తరణ లక్ష్యం
రెండు దశాబ్దాలకుపైగా B2B సేవల రంగంలో విశ్వసనీయమైన మానవ వనరుల పరిష్కారాలను అందిస్తున్న కాప్స్టన్ సర్వీసెస్ లిమిటెడ్,
తన అనుబంధ సంస్థ కాప్స్టన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా హైదరాబాద్లో కాప్స్టన్ హోమ్ సర్వీసెస్ యాప్ను ప్రారంభిస్తూ వేగంగా
అభివృద్ధి చెందుతున్న ఆన్లైన్ హోమ్ సర్వీసెస్ టెక్నాలజీ మార్కెట్లోకి అధికారికంగా అడుగుపెట్టింది.
ఈ యాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ నటుడు శ్రీ అక్కినేని నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనను కాప్స్టన్ హోమ్
సర్వీసెస్ బ్రాండ్ అంబాసిడర్గా నియమించారు.
ఈ కార్యక్రమంలో కాప్స్టన్ సర్వీసెస్ లిమిటెడ్ చైర్మన్ డా. సి.ఆర్. నాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ శ్రీకాంత్ కోడాలి, కాప్స్టన్ గ్రూప్ సీనియర్
నాయకత్వ బృందం, పరిశ్రమ భాగస్వాములు, మీడియా ప్రతినిధులు, ప్రముఖ అతిథులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా శ్రీ అక్కినేని నాగార్జున మాట్లాడుతూ:
"ఇల్లు నమ్మకంపై నిర్మించబడుతుంది. అలాగే ఒక కస్టమర్ ఇంట్లోకి వచ్చే ప్రతి సేవ కూడా నమ్మకంపై ఆధారపడి ఉండాలి. అయితే నైపుణ్యం కలిగిన సిబ్బంది లభ్యత, సేవల నాణ్యత, విశ్వసనీయత, కస్టమర్ భద్రత, సేవల్లో స్థిరత్వం వంటి అంశాల్లో ఈ రంగం ఇంకా అనేక సవాళ్లను
ఎదుర్కొంటోంది.మారుతున్న కస్టమర్ అవసరాలను గుర్తించిన కాప్స్టన్ హోమ్ సర్వీసెస్, 17+ సంవత్సరాల కార్యకలాపాల అనుభవం, శిక్షణ పొందిన
సిబ్బంది, పటిష్టమైన ప్రక్రియలు, టెక్నాలజీ ఆధారిత సర్వీస్ మేనేజ్మెంట్, మానవ వనరుల పరిష్కారాల రంగంలో తనకున్న విస్తృత
నైపుణ్యాన్ని వినియోగిస్తూ కన్స్యూమర్ మార్కెట్లోకి ప్రవేశిస్తోంది.
ఈ సందర్భంగా కాప్స్టన్ సర్వీసెస్ లిమిటెడ్ చైర్మన్, రిటైర్డ్ IPS అధికారి డా. సి.ఆర్. నాయుడు మాట్లాడుతూ:
"సుమారు రెండు దశాబ్దాలుగా కాప్స్టన్ దేశవ్యాప్తంగా ప్రముఖ సంస్థలకు మానవ వనరుల పరిష్కారాలు, సపోర్ట్ సేవలను విజయవంతంగా అందిస్తోంది. కన్స్యూమర్ హోమ్ సర్వీసెస్ విభాగంలోకి ప్రవేశించడం మా నైపుణ్యానికి సహజమైన విస్తరణ. కాప్స్టన్ హోమ్ సర్వీసెస్ ద్వారా బ్యూటీ & వెల్నెస్, క్లీనింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కార్పెంటరీ, పెయింటింగ్, AC సర్వీసులు, గృహోపకరణాల మరమ్మతులు, పెస్ట్



కంట్రోల్తో పాటు ఇంటి నిర్వహణకు అవసరమైన అనేక రకాల ప్రొఫెషనల్ సేవలను సులభంగా
వినియోగించుకునే అవకాశం కస్టమర్లకు లభిస్తుంది.కొత్తగా ప్రారంభించిన కాప్స్టన్ హోమ్ సర్వీసెస్ యాప్ ద్వారా కస్టమర్లు వెరిఫైడ్ ప్రొఫెషనల్స్ను సులభంగా బుక్ చేసుకోవచ్చు, తమకు అనుకూలమైన సమయాన్ని ఎంచుకోవచ్చు, పారదర్శకమైన ధరలను ముందుగానే తెలుసుకోవచ్చు. అలాగే కాప్స్టన్ యొక్క స్థిరమైన
ఆపరేషనల్ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన సేవలను పొందవచ్చు. శ్రీ అక్కినేని నాగార్జున బ్రాండ్ ముఖచిత్రంగా ఉండటంతో, కాప్స్టన్ హోమ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కస్టమర్లలో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసి, నమ్మకం, ప్రొఫెషనలిజం, అత్యుత్తమ సేవల ఆధారంగా దీర్ఘకాలిక సంబంధాలను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.
భారతదేశంలో హోమ్ సర్వీసెస్ మార్కెట్ నిరంతరం విస్తరిస్తున్న నేపథ్యంలో, టెక్నాలజీ, కార్యకలాపాల నిర్వహణలో నైపుణ్యం, శిక్షణ
పొందిన మానవ వనరులను సమన్వయం చేసి కస్టమర్లకు అత్యుత్తమ, సులభమైన హోమ్ సర్వీస్ అనుభవాన్ని అందించడం ద్వారా
కస్టమర్ సంతృప్తిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పేందుకు కాప్స్టన్ హోమ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కట్టుబడి ఉంది.

**కాప్స్టన్ హోమ్ సర్వీసెస్ గురించి**

కాప్స్టన్ హోమ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, 17 సంవత్సరాలకుపైగా మానవ వనరుల పరిష్కారాల రంగంలో విశ్వసనీయమైన సంస్థగా కొనసాగుతున్న కాప్స్టన్ యొక్క కన్స్యూమర్ సర్వీసెస్ విభాగం. దేశవ్యాప్తంగా ప్రముఖ వ్యాపార సంస్థలకు సేవలు అందిస్తూ సంపాదించిన దశాబ్దాల అనుభవం, నాణ్యత, ప్రొఫెషనలిజం, భద్రత, కస్టమర్ సంతృప్తిపై ఉన్న నిబద్ధతను ఇప్పుడు టెక్నాలజీ ఆధారిత హోమ్ సర్వీసెస్ ప్లాట్ఫామ్ ద్వారా ప్రతి ఇంటికీ అందిస్తోంది

# హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- **సి.ఐ.టి.యు జిల్లా కార్యదర్శి కామిని గోపాలస్వామి డిమాండ్**

**మిరుదొడ్డి, ఆగస్టు 13, వుదయం:**

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ సి.ఐ.టి.యు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి గురువారం మిరుదొడ్డి తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు నెలకు రూ.26,000 కనీస వేతనం అమలు చేయాలని, ఈ.ఎస్.ఐ, పి.ఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇప్పటికే పలు మార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ



కార్యక్రమంలో సి.ఐ.టి.యు మండల కన్వీనర్ మద్దెల అంజయ్య, హమాలీ కార్మికులు లింగం, పోదేటి భిక్షపతి, తుడుం చంద్రం, లింగంపేట పోచయ్య, మద్దెల యాదయ్య, మలుపల్లి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదం జరగకముందే విద్యుత్ బాక్స్‌కు మూత ఏర్పాటు చేయాలి

- **నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం తప్పదంటున్న స్థానికులు**

**గద్వాల ఆగస్టు 13 (వుదయం కరస్పాండెంట్)**

గద్వాల పట్టణంలోని ధరూర్ మెట్టు-రాయచూర్ రోడ్డులో 10వ వార్డు పరిధిలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి వీధి దీపాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ బాక్స్ మూత లేకుండా ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. బాక్స్ తెరిచి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో చిన్నారులు, విద్యార్థులు, బాటసారులు, వాహనదారులు, స్థానిక ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా వర్షాకాలంలో బాక్స్‌లోకి నీరు చేరితే విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవడం మంచిదని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ బాక్స్‌కు పటిష్టమైన మూత ఏర్పాటు చేయాలని, బాక్స్ పూర్తిగా పాడై ఉంటే కొత్త విద్యుత్ బాక్స్‌ను బిగించాలని కోరుతున్నారు.



10వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించి ప్రజలకు భద్రత కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# చక్కని ఆరోగ్యం

## ముఖానికి ఐస్.. ఈ పొరపాట్లు చేస్తున్నారా?



ముఖాన్ని మెరిపించడానికి ఎన్నెన్నో ప్రయోగాలు చేస్తుంటాం. ఈ క్రమంలో మార్కెట్లో దొరికే సౌందర్యోత్పత్తుల్ని ఉపయోగించడమే కాదు.. సహజ చిట్కాల్నీ పాటిస్తుంటాం. ఐస్ ముక్కతో రుద్దడం కూడా వీటిలో ఒకటి. అయితే ఈ క్రమంలో కొన్ని పొరపాట్లు దొర్లకుండా చూసుకోవడం ముఖ్యమంటున్నారు సౌందర్య నిపుణులు. అప్పుడే సత్ఫలితాలు సొంతమవుతాయని చెబుతున్నారు. ఇంతకీ ఆ పొరపాట్లేమిటంటే..

ఐస్ ముక్కను నేరుగా ముఖంపై రుద్దడం వల్ల మెరుగైన ఫలితాలుంటాయనుకుంటారు కొందరు. కానీ ఇలా చేయడం వల్ల ఆ ప్రదేశంలో ఎరుపెక్కడం, చిన్న చిన్న ఎర్రటి బొబ్బలు రావడం, ఐస్ బర్న్స్.. వంటి సమస్యలొచ్చే అవకాశాలు ఎక్కువంటున్నారు నిపుణులు. అందుకే ఐస్ ముక్కను శుభ్రమైన కాటన్ క్లాత్‌లో చుట్టి దాంతో ముఖంపై రుద్దుకోవడం మేలంటున్నారు.

ఇలా కాటన్ క్లాత్‌లో చుట్టిన ఐస్ ముక్కను ఒకేచోట ఎక్కువసేపు ఉంచడం కూడా కరక్ట్ కాదంటున్నారు నిపుణులు. ముఖంపై గుండ్రంగా రుద్దుతూ రెండు నిమిషాల పాటు మర్దన చేసుకుంటే రక్త ప్రసరణ మెరుగై మోము మెరుపును సంతరించుకుంటుందని చెబుతున్నారు.

ఐస్‌ని ముఖానికి రుద్దుకోవడం వల్ల ముఖ కాంతిని పెంచుకోవచ్చన్న ఉద్దేశంతో రోజూ ఐస్ క్యూబ్స్‌తో మసాజ్ చేసే వారూ లేకపోలేదు. అయితే ఇదీ సరికాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే దీనివల్ల చర్మానికి రక్షణ కల్పించే పొర దెబ్బతింటుందట. కాబట్టి వారానికి రెండు లేదా మూడుసార్లు.. రెండు నిమిషాల చొప్పున శుభ్రమైన కాటన్ క్లాత్‌లో చుట్టి రుద్దుకుంటే సరిపోతుందని చెబుతున్నారు. నిద్ర లేవగానే, బయటి నుంచి ఇంటికి రాగానే ఐస్ మసాజ్ చేసుకుంటారు కొందరు. అయితే ఇలా ముఖంపై దుమ్ము, ధూళి, జిడ్డుదనం ఉన్నప్పుడు ఐస్‌తో రుద్దుకుంటే ఇతర సౌందర్య సమస్యల ముప్పు పొంచి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే ముందుగా ముఖాన్ని చల్లటి నీటితో శుభ్రం చేసుకొని.. ఆ తర్వాత ఐస్‌తో మర్దన చేసుకుంటే ఫలితం ఉంటుందంటున్నారు.

సాధారణంగా ఐస్ తయారుచేసే ట్రేలను మనం రోజూ శుభ్రం చేయం. దాంతో మనం ఐస్ ముక్కలు తీసిన ప్రతిసారీ మన చేతుల మురికి ట్రేకు అంటుకొని అది అపరిశుభ్రంగా మారుతుంది. దాని ప్రభావం ముఖ చర్మంపై పడుతుంది. కాబట్టి ఐస్ ట్రేలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడమూ మర్చిపోకూడదు. ముఖంపై మొటిమలు, వాపు, అలర్జీ.. వంటి పలు చర్మ సంబంధిత సమస్యలున్న వారు ఐస్ మసాజ్‌కి దూరంగా ఉండడమే మేలంటున్నారు నిపుణులు. అవసరమైతే ఈ విషయంలో డెర్మటాలజిస్టుల సలహాలు తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. అలాగే ఈ ప్రక్రియ పూర్తయ్యాక ముఖాన్ని ఓసారి చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకొని.. పొడిగా తుడుచుకొని.. మాయిశ్చరైజర్ లేదా సీరమ్ రాసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే మెరుగైన ఫలితాలు సొంతం చేసుకోవచ్చంటున్నారు.

## వైన్ తాగే వారిలో రక్తనాళాల్లో తగ్గిన కొవ్వు నిల్వలు..



మధుమేహంతో బాధపడుతున్నవారిలో గుండె సంబంధిత సమస్యల ముప్పు ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా రక్తనాళాల్లో కొవ్వు, ఇతర పదార్థాలు పేరుకుపోయి ప్లాక్ ఏర్పడటం వల్ల రక్తప్రసరణకు ఆటంకం కలుగుతుంది. అయితే వైన్‌ను పరిమిత మోతాదులో తీసుకోవడం వల్ల కొంతమంది మధుమేహుల్లో రక్తనాళాల్లో పేరుకుపోయిన ప్లాక్ కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుందని ఒక అధ్యయనం సూచించింది. యురోపియన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో, రక్తనాళాల్లో ఇప్పటికే ప్లాక్ ఉన్న మధుమేహ బాధితులను పరిశీలించారు.

అధ్యయనం ప్రారంభంలో రక్తనాళాల్లో ఎక్కువగా ప్లాక్ ఉన్నవారిలో, రెండు సంవత్సరాల తర్వాత ఈ పేరుకుపోయిన పదార్థాల్లో స్వల్పమైనప్పటికీ గణనీయమైన తగ్గుదల కనిపించింది. అయితే రెండు సంవత్సరాల తర్వాత అల్ట్రాసౌండ్ పరీక్షల్లో పాల్గొన్నవారి రక్తనాళాల్లో ప్లాక్ గణనీయంగా పెరిగినట్లు కనిపించలేదు. వారు వైన్ తీసుకున్నా, తీసుకోకపోయినా ఈ విషయంలో పెద్దగా తేడా కనిపించలేదు. అయితే అధ్యయనం ప్రారంభంలో రక్తనాళాల్లో ఎక్కువ మొత్తంలో ప్లాక్ ఉన్నవారిలో మాత్రం అధ్యయనం ముగిసే సమయానికి ఈ నిక్షేపాలు కొంత తగ్గినట్లు గుర్తించారు. మధుమేహంతోపాటు రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం వంటి కార్డియో–మెటబాలిక్ సమస్యలు గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి సమస్యలు వచ్చే అవకాశాన్ని పెంచుతాయని పరిశోధకులు పేర్కొన్నారు. రక్తనాళాల్లో ప్లాక్ పేరుకుపోవడం కూడా ఇలాంటి ప్రమాద కారకాలలో ఒకటిగా ఉంటుంది. గతంలో నిర్వహించిన కొన్ని పరిశోధనలు కూడా ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు వైన్‌ను పరిమితంగా తీసుకోవడం వల్ల గుండె సంబంధిత వ్యాధుల ముప్పు తక్కువగా ఉండే అవకాశం ఉంటుందని సూచించాయి. అయితే దీనిని వైన్ తాగడం ఆరోగ్యానికి తప్పనిసరిగా మంచిదనే అర్థంలో తీసుకోకూడదు. మద్యం వల్ల కొన్ని సందర్భాల్లో ప్రయోజనం ఉంటుందని కనిపించినప్పటికీ, దానికి అనేక ఇతర ఆరోగ్యపరమైన ప్రమాదాలు కూడా ఉన్నాయి. గుండె సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గే అవకాశంతోపాటు, గుండె లయలో మార్పులు ఏర్పడి స్ట్రోక్‌కు దారితీసే ప్రమాదం కూడా ఉంటుంది. అందువల్ల వైన్‌ను ఆరోగ్యాన్ని మెరుగుపరిచే మార్గంగా భావించి అలవాటుగా మార్చుకోవడం సరికాదు. సమతుల్యమైన ఆహారం తీసుకోవడంతోపాటు ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. మద్యం తీసుకోవడం వ్యక్తిగత ఎంపిక అయినప్పటికీ, దాన్ని క్రమం తప్పకుండా తీసుకునే అలవాటుగా మార్చుకోకుండా జాగ్రత్త వహించడం అవసరమని తెలియజేస్తున్నారు.

## ప్రెగ్నెన్సీలోనూ.. పని చేస్తే!

ఈరోజుల్లో గర్భం ధరించినా.. నెలలు నిండేదాకా కెరీర్‌లో కొనసాగే మహిళలే ఎక్కువగా కనిపిస్తున్నారు. అలాగని ఈ సమయంలో అందరి ఆరోగ్యం వృత్తి జీవితానికి సహకరిస్తుందని చెప్పలేం. కానీ ప్రెగ్నెన్సీలో ఎలాంటి సమస్యలు లేకపోతే డాక్టర్ సలహా మేరకు కెరీర్‌ని కొనసాగించడమే మేలంటున్నారు నిపుణులు. తద్వారా ఇటు తల్లికి, అటు పుట్టబోయే బిడ్డకు పలు ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు. తొమ్మిది నెలల పాటు ఇటు ఇంటి పనులు, అటు ఆఫీస్ పనులు చురుగ్గా చేసుకోవడం వల్ల సుఖ ప్రసవమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయట!



ఇలా ఎప్పుడూ పనిలో బిజీగా ఉండడం వల్ల లేనిపోని ఆలోచనలు మనసులోకి రాకుండా, ఒత్తిడి దరిచేరకుండా మానసిక ప్రశాంతత దొరుకుతుంది.

కొంతమంది పనిలోనే ఆనందాన్ని వెతుక్కుంటారు. ఇలాంటి వారు ప్రెగ్నెన్సీ సమయంలో పని చేస్తూ చురుగ్గా ఉంటే.. పుట్టబోయే బిడ్డ కూడా యాక్టివ్‌గా ఉండే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

అయితే కొన్ని ఉద్యోగాల్లో శారీరక శ్రమ ఎక్కువగా ఉంటుంది. ఇలాంటప్పుడు ప్రెగ్నెన్సీలో కెరీర్ కొనసాగించాలనుకుంటే డాక్టర్‌తో చర్చించడం మంచిది. అలాగే ఈ సమయంలో కాబోయే తల్లులు పలు జాగ్రత్తలు తీసుకోవడం కూడా ముఖ్యమంటున్నారు నిపుణులు. గర్భిణిగా ఉన్నప్పుడు కూడా కొంతమంది వ్యాయామాలు చేస్తుంటారు. అయితే ఈ క్రమంలో సొంత నిర్ణయాలు కాకుండా నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. అలాగే ఆఫీస్ పనిలో ఉన్నా.. కుర్చీలోనే కూర్చుని నెమ్మదిగా శరీరాన్ని కదిలిస్తూ చేసే వ్యాయామాలకు గర్భిణులు ప్రాధాన్యమివ్వచ్చు. నెలలు నిండుతున్న కొద్దీ పెరుగుతున్న పొట్ట వల్ల అసౌకర్యం కలగచ్చు. ఈ క్రమంలో పొట్ట సపోర్ట్ కోసం బెల్లీ బ్యాండ్ వంటివి వాడచ్చేమో గైనకాలజిస్ట్ సలహా తీసుకోవాలి. గర్భిణిగా ఉన్నప్పుడు ఇంట్లోనే కాదు.. బయటికి వెళ్లినా సౌకర్యవంతంగా ఉండే దుస్తుల్ని ధరించడానికే మొగ్గు చూపాలి. ఈక్రమంలో వదులుగా ఉండే కాటన్ దుస్తులు వేసుకుంటే కంఫర్టబుల్‌గా ఉంటుంది.. అలాగే హీల్స్‌కు బదులుగా ఫ్లాట్స్‌కు ప్రాధాన్యమివ్వడం, ప్రత్యేకంగా రూపొందించిన ప్రెగ్నెన్సీ ఫుట్‌వేర్‌ను ఎంచుకోవడం మంచిది. ఖాళీ సమయాల్లో మీకు నచ్చిన పనులు చేయడం, సంగీతం వినడం.. వంటివి చేస్తే మనసుకు, శరీరానికి ప్రశాంతత చేకూరుతుంది. అలాగే రోజూ ఏడెనిమిది గంటలు కంటి నిండా నిద్ర పోవడం కూడా ముఖ్యమే! ఇక పని బిజీలో పడిపోయి ఆహారాన్ని నిర్లక్ష్యం చేయకుండా.. వేళకు భోజనం చేయడం, తక్కువ మొత్తంలో ఎక్కువసార్లు తినడం మంచిది అంటున్నారు నిపుణులు.

## వైట్ టీ అంటే ఏమిటి.. దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయి..

ఒకప్పుడు భారతీయ ఇళ్లలో టీ అంటే ఎక్కువగా మసాలా చాయ్ మాత్రమే గుర్తొచ్చేది. అయితే ఆరోగ్యంపై అవగాహన పెరగడంతోపాటు ఆరోగ్యకరమైన ఆహారం, పానీయాల వైపు ప్రజల ఆసక్తి పెరుగుతోంది. దీంతో గ్రీన్ టీ, హెర్బల్ టీ వంటి వివిధ రకాల టీలు క్రమంగా ఇళ్లలోకి చేరుతున్నాయి. వీటిలో ఇటీవల వైట్ టీ కూడా ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. అసలు వైట్ టీ అంటే ఏమిటి? ఇది నిజంగానే తెల్లగా ఉంటుందా? దీని ప్రత్యేకత ఏమిటో పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు.



వైట్ టీని టీ మొక్క జాతి కామెలియా సినెన్సిస్‌కు చెందిన కొత్త ఆకులు, మొగ్గలతో తయారు చేస్తారు. కొన్ని రకాల వైట్ టీలలో పూర్తిగా చిన్న వయసున్న మొగ్గలను మాత్రమే ఉపయోగిస్తారు. ఆకులను కోసిన తర్వాత వాటిని ఎండలో ఆరబెడతారు. ఈ ప్రక్రియలో క్యాటెచిన్స్ అనే యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా నిల్వ ఉంటాయి. తయారైన వైట్ టీ సాధారణంగా లేత పసుపు రంగులో ఉంటుంది. ఇందులో పండ్లలాంటి రుచి ఉండటంతో పాటు కొన్ని రకాలలో పూల సువాసన కూడా వస్తుంది.ఇతర టీలతో పోలిస్తే వైట్ టీ తయారీ ప్రక్రియ చాలా సున్నితంగా ఉంటుంది. టీ మొక్కపై ఉండే చిన్న, లేత ఆకులు, మొగ్గలను చేతితో సేకరించి, కోసిన వెంటనే వాటిని వాడిపోయేలా చేసి గాలిలో ఆరబెడతారు. ఆక్సీకరణ ప్రక్రియను కూడా చాలా నియంత్రితంగా నిర్వహిస్తారు. అందుకే వైట్ టీ రుచి ఇతర టీలతో పోలిస్తే మరింత సున్నితంగా, మృదువుగా ఉంటుంది. వైట్ టీ చరిత్ర కూడా చాలా పురాతనమైనదే. చైనాలోని టాంగ్ రాజవంశ కాలం నుంచే వైట్ టీకి సంబంధించిన ప్రస్తావనలు కనిపిస్తాయి. అప్పట్లో దీనిని కేకుల రూపంలో తయారు చేసి మట్టి పాత్రల్లో మరిగించి తాగేవారు. ఆ తర్వాత సాంగ్ రాజవంశ కాలంలో వైట్ టీకి మరింత ప్రాచుర్యం లభించింది. అప్పట్లో దీనిని చక్రవర్తి, రాజకుటుంబానికి చెందిన ప్రముఖుల కోసం ప్రత్యేకంగా ఉంచేవారని చారిత్రక కథనాలు చెబుతున్నాయి. టీ మొక్కలోని అత్యంత చిన్న మొగ్గలతో తయారయ్యే టీ రుచి మృదువుగా ఉండటంతోపాటు పసుపు–ఆకుపచ్చ రంగులో కనిపించేది. నల్ల టీతో పోలిస్తే ఇది మరింత నాణ్యమైనదిగా భావించేవారు. పురాతన చైనాలో వైట్ టీని మొదట్లో పొడి రూపంలో ఉపయోగించి సిరామిక్ గిన్నెల్లో కలిపి తాగేవారు. కాలక్రమేణా ఈ పద్ధతి మారి, వదులుగా ఉండే ఆకుల రూపంలోని వైట్ టీ వినియోగంలోకి వచ్చింది.

## ఆరోగ్యంగా గిన్నెలు తోముదాం

వంటింట్లో ఎలక్ట్రానిక్స్ వస్తువులతో పాటు రసాయన క్లీనర్ల వినియోగమూ రోజురోజుకీ పెరిగిపోతోంది. అయితే, ఈ అలవాటు దీర్ఘకాలంలో మహిళల ఆరోగ్యానికి చేటు చేస్తుందంటున్నాయి పలు అధ్యయనాలు. వీటిల్లో ఉండే సల్ఫేట్లు, ఫాస్ఫేట్లు, బ్లీచ్ వంటి ప్రమాదకరమైన రసాయనాలే ముప్పుకి మూలం అట. ఈ విషయం తెలిశాక... సహజ ప్రత్యామ్నాయాల వైపునకు మళ్లకపోతే ఎలా? అందుకు ఈ నేచురల్ క్లీనర్ చక్కని ఎంపిక. దీన్ని సులువుగా ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. ఇందుకోసం ముందుగా 15–20 కుంకుడు కాయలను ఓ గిన్నెలో వేసి రాత్రంతా నానబెట్టండి. దాన్ని మర్నాడు సన్నని మంటపై 20–30 నిమిషాల పాటు బాగా మరిగించాలి. చల్లారాక దాన్ని వడకట్టి... కాస్త బేకింగ్ సోడా కలిపి ఓ డబ్బాలో పోసుకోవాలి. దీన్ని గిన్నెలు తోముకోవడానికీ, వంటగట్టుని శుభ్రం చేసుకోవడానికీ ఉపయోగించొచ్చు. కుంకుడు కాయల్లో సహజమైన సపోనిన్ నురగను ఇస్తూ జిడ్డుని వదిలిస్తుంది. బేకింగ్ సోడా ఆహార వ్యర్థాలతో పాటు దుర్వాసననూ అడ్డుకుంటుంది. సూక్ష్మక్రిములను దూరం చేస్తుంది. పైగా దీనివల్ల చర్మానికి హాని కలగదు. పొడిబారడం వంటి సమస్యలు ఎదురుకావు. పైగా వాటితో పోలిస్తే ఖరీదూ తక్కువే. మరి ప్రయత్నించేద్దామా!



## చిలగడదుంపలతో ఎలాంటి పోషకాలు లభిస్తాయి..?

చిలగడదుంపను సాధారణంగా రుచికరమైన దుంపగా మాత్రమే చూస్తారు. కానీ ఇందులో విటమిన్ ఎ, బీటా కెరోటిన్, ఫైబర్, పొటాషియం, విటమిన్ సి వంటి పలు పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా నారింజ రంగులో ఉండే చిలగడదుంపల్లో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది శరీరానికి అవసరమైనప్పుడు విటమిన్ ఎ గా మారుతుంది. అందుకే చిలగడదుంపను ఆహారంలో భాగంగా చేర్చుకోవడం వల్ల కంటి ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, చర్మ ఆరోగ్యానికి ప్రయోజనం కలుగుతుంది. చిలగడదుంపలో ఉండే బీటా కెరోటిన్‌నే దాని అధిక విటమిన్ ఎ స్థాయికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. మధ్యస్థ పరిమాణంలో ఉండే ఒక చిలగడదుంపలో సుమారు 961 మైక్రోగ్రాముల ఆర్ఏఈ విటమిన్ ఎ లభిస్తుంది. ఇది చాలా మంది పెద్దలకు రోజువారీగా అవసరమైన మొత్తాన్ని మించిపోయే స్థాయి. అయితే చిలగడదుంపలోని విటమిన్ ఎ నేరుగా లభించదు. ఇందులోని బీటా కెరోటిన్ శరీర అవసరాన్ని బట్టి విటమిన్ ఎగా మారుతుంది. చిలగడదుంపల్లో ఉండే విటమిన్ ఎ పరిమాణం వాటి రకాన్ని బట్టి మారుతుంది. నారింజ రంగు చిలగడదుంపల్లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఊదా రంగు చిలగడదుంపల్లో ఆంథోసయానిన్లు ఎక్కువగా ఉంటాయి కానీ విటమిన్ ఎ పరిమాణం నారింజ రకంతో పోలిస్తే తక్కువగా ఉంటుంది. తెలుపు రంగు చిలగడదుంపల్లో కెరోటినాయిడ్ పిగ్మెంట్లు చాలా తక్కువగా ఉండటం వల్ల విటమిన్ ఎ కూడా తక్కువగా ఉంటుంది. చిలగడదుంపల్లోని విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటుంది. సాధారణ చూపుతోపాటు రాత్రి సమయంలో చూపు సరిగా ఉండేందుకు విటమిన్ ఎ అవసరం. కంటి ముందు భాగాన్ని రక్షించే కార్నియాను ఆరోగ్యంగా ఉంచడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది. రెటీనాలో కాంతిని గుర్తించడంలో సహాయపడే రోడోప్సిన్ అనే పదార్థం ఏర్పడటానికి విటమిన్ ఎ అవసరం. విటమిన్ ఎ లోపిస్తే రాత్రి చూపు తగ్గే అవకాశం ఉంటుంది. రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి కూడా విటమిన్ ఎ అవసరం. ఇది సహజ, అనుకూల రోగనిరోధక వ్యవస్థల పనితీరులో కీలకపాత్ర పోషిస్తుంది. విటమిన్ ఎ లోపం ఉంటే శ్వాసకోశ, జీర్ణవ్యవస్థకు సంబంధించిన ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరుగుతుంది. అందువల్ల పోషకాహారంలో భాగంగా చిలగడదుంపను కూడా అప్పుడప్పుడు చేర్చుకోవచ్చు. చర్మ ఆరోగ్యానికి కూడా చిలగడదుంపలోని విటమిన్ ఎ ఉపయోగపడుతుంది. చర్మ కణాల పెరుగుదల, మరమ్మత్తు ప్రక్రియల్లో విటమిన్ ఎ పాత్ర ఉంటుంది. విటమిన్ ఎ నుంచి ఏర్పడే రెటినాయిడ్లు చర్మ కణాల పెరుగుదలను నియంత్రించడంలో, చర్మ రక్షణ పొరను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. విటమిన్ ఎ శరీరంలో రెటినోయిక్ యాసిడ్‌గా మారుతుంది. ఇది కణజాల అభివృద్ధి, అండాశయాల పనితీరుకు సంబంధించిన కొన్ని ప్రక్రియల్లో కీలకపాత్ర పోషిస్తుంది. చిలగడదుంపలోని బీటా కెరోటిన్‌తోపాటు ఇతర యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను ఎదుర్కోవడంలో సహాయపడతాయి. కాలుష్యం, పర్యావరణ ప్రభావాలు వంటి కారణాలతో శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్ పెరిగే పరిస్థితుల్లో పోషకాలు అధికంగా ఉన్న కూరగాయలను ఆహారంలో చేర్చుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. చిలగడదుంపలో బీటా కెరోటిన్ రూపంలో విటమిన్ ఎ ఉండటం వల్ల దీన్ని ఎక్కువగా తిన్నా విటమిన్ ఎ విషపూరితం కావడం చాలా అరుదుగా ఉంటుంది. శరీరం తన అవసరానికి అనుగుణంగా బీటా కెరోటిన్‌ను విటమిన్ ఎ గా మార్చుకుంటుంది. అయితే చిలగడదుంపను అధికంగా తీసుకుంటే ఇందులోని ఫైబర్ కారణంగా కొందరికి కడుపులో అసౌకర్యం లేదా జీర్ణ సమస్యలు వస్తాయి. చిలగడదుంపలోని పోషకాలను కాపాడుకోవాలంటే వండే విధానం కూడా ముఖ్యం. ఉడికించడం, ఆవిరిపై ఉడికించడం, కాల్చడం వంటి పద్ధతులను ఉపయోగించవచ్చు. బీటా కెరోటిన్ శరీరంలో బాగా శోషణకు గురయ్యేందుకు చిలగడదుంపను కొద్దిగా ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారంతో కలిపి తీసుకోవడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. పిల్లలు, వృద్ధులు, శాకాహారులు, కూరగాయలను తక్కువగా తీసుకునేవారు తమ ఆహారంలో చిలగడదుంపను చేర్చుకోవచ్చు.



## బొప్పాయి ఆకుల రసాన్ని సేవిస్తే నిజంగానే ప్లేట్‌లెట్లు పెరుగుతాయా..

వర్షాకాలంలో డెంగీ కేసులు పెరుగుతుండటంతో ఈ వ్యాధి నుంచి త్వరగా కోలుకోవడానికి ఏం చేయాలనే అంశంపై చాలామందిలో ఆసక్తి ఉంటుంది. ముఖ్యంగా బొప్పాయి ఆకుల రసం ప్లేట్‌లెట్ కౌంట్‌ను పెంచుతుందనే నమ్మకం చాలాకాలంగా ఉంది. దీనిపై కొన్ని పరిశోధనలు కూడా జరిగాయి. అయితే బొప్పాయి ఆకులు డెంగీకు చికిత్సగా పనిచేస్తాయా, వాటిని ఎలా ఉపయోగించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలను తెలుసుకోవడం ముఖ్యం. డెంగీ సోకినప్పుడు రక్తంలోని ప్లేట్‌లెట్ కౌంట్ వేగంగా తగ్గడం ఒక ముఖ్యమైన సమస్యగా మారుతుంది. దీన్ని థ్రాంబోసైటోపీనియా అంటారు. ప్లేట్‌లెట్ కౌంట్‌ను వైద్యుల సూచన మేరకు నిరంతరం పర్యవేక్షించడం అవసరం. ఈ కారణంగానే కొంతమంది డెంగీ రోగులకు ఆసుపత్రిలో చికిత్స అవసరమవుతుంది. బొప్పాయి ఆకులను, ముఖ్యంగా కారికా పపాయా ఆకుల ఎక్స్‌ట్రాక్ట్‌ను, డెంగీ సమయంలో ప్లేట్‌లెట్ కౌంట్‌ను పెంచేందుకు సంప్రదాయంగా ఉపయోగిస్తున్నారు. బొప్పాయి ఆకుల్లోని కొన్ని పదార్థాలు రక్తంలోని ప్లేట్‌లెట్ల ఉత్పత్తికి సంబంధించిన ప్రక్రియలకు సహాయపడతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అలోక్స్ 12, పీటీఏఎఫ్‌ఆర్ వంటి జన్యువులు ప్లేట్‌లెట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియల్లో కీలక పాత్ర పోషిస్తాయని అధ్యయనాలు పేర్కొన్నాయి. బొప్పాయి ఆకుల్లో కార్పైన్, ఫ్లేవనాయిడ్లు, క్వెర్సెటిన్, కెంప్ఫెరోల్, క్లోరోజెనిక్ యాసిడ్, పపైన్, కైమోపపైన్ వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉన్న పదార్థాలుగా ఉన్నాయి. అలాగే బొప్పాయి ఆకుల ఎక్స్‌ట్రాక్ట్‌లో రోగనిరోధక వ్యవస్థను నియంత్రించడంలో సహాయపడే కొన్ని లక్షణాలు ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. డెంగీ రోగుల్లో బొప్పాయి ఆకుల ఎక్స్‌ట్రాక్ట్ ప్రభావంపై బీఎంసీ కాంప్లిమెంటరీ అండ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్, ప్లస్ వన్ వంటి జర్నల్స్‌లో పరిశోధనలు ప్రచురితమయ్యాయి. కొన్ని అధ్యయనాల్లో బొప్పాయి ఆకుల ఎక్స్‌ట్రాక్ట్ తీసుకున్నవారిలో రక్తంలోని ప్లేట్‌లెట్ కౌంట్ 50,000/uL కంటే ఎక్కువగా పెరిగే అవకాశం కనిపించింది. అయితే ఈ పరిశోధనలు పరిమిత సంఖ్యలో డెంగీ రోగులపై జరిగాయి. అందువల్ల బొప్పాయి ఆకులు డెంగీ రోగులందరిలోనూ ప్లేట్‌లెట్ కౌంట్‌ను కచ్చితంగా పెంచుతాయని నిర్ధారించడానికి మరింత విస్తృతమైన పరిశోధనలు అవసరం. బొప్పాయి ఆకుల రసం శరీరంలో సులభంగా శోషణకు గురవుతుందని, ప్లేట్‌లెట్ కౌంట్ పెరగడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఎంత పరిమాణంలో, ఎప్పుడు తీసుకోవాలనే విషయంలో జాగ్రత్త అవసరం. అంతేకాకుండా బొప్పాయి ఆకుల రసం చాలా చేదుగా ఉండటం వల్ల కొంతమందికి దాన్ని తట్టుకోవడం కష్టంగా ఉంటుంది. అయితే బొప్పాయి ఆకుల రసం డెంగీను పూర్తిగా నయం చేస్తుందని భావించడం తప్పు. ఇది గరిష్ఠంగా సహాయక చర్యగా మాత్రమే పరిగణించాలి. ముఖ్యంగా ప్లేట్‌లెట్ కౌంట్‌ను పెంచే అవకాశం మాత్రమే దాని పరిశోధనల్లో కనిపించింది. డెంగీ చికిత్సకు బొప్పాయి ఆకుల రసం వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. బొప్పాయి ఆకుల రసం తీసుకోవడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా కనిపిస్తాయి. కడుపులో అసౌకర్యం, వికారం, అలర్జిక్ రియాక్షన్లు వంటి సమస్యలు వస్తాయి. గర్భిణీలు దీనిని తీసుకునే విషయంలో ప్రత్యేకంగా జాగ్రత్త వహించాలి. అలాగే డెంగీ చికిత్సలో ఉపయోగించే కొన్ని మందులతో ఇది పరస్పర ప్రభావం చూపే అవకాశం ఉండడంతో, వైద్యుల సలహా లేకుండా తీసుకోవడం మంచిది కాదు. డెంగీ ఉన్నట్లు అనుమానం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. కొంతమందికి ఆసుపత్రిలో చికిత్స అవసరం అవుతుంది. మరికొందరు ఇంట్లోనే చికిత్స పొందినా, వైద్యుల సూచన మేరకు రక్త పరీక్షలు, ప్లేట్‌లెట్ కౌంట్‌ను పర్యవేక్షిస్తూ ఉండాలి. ముఖ్యంగా డెంగీ సమయంలో కనిపించే హెచ్చరిక లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైనప్పుడు వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. డెంగీ నుంచి కోలుకునే సమయంలో శరీరంలో నీరు తగ్గకుండా చూసుకోవడం చాలా ముఖ్యం. కొబ్బరి నీరు, ఓఆర్ఎస్, తాజా పండ్లు, పండ్ల రసాలు, సూప్‌లు, తగినంత ద్రవాలు తీసుకోవడం ద్వారా హైడ్రేషన్‌ను కొనసాగించవచ్చు. అలాగే శరీరానికి అవసరమైన ప్రొటీన్ అందేలా పోషకాహారం తీసుకోవడం కూడా ముఖ్యం. డెంగీ సమయంలో స్వయంగా మందులు తీసుకోవడం లేదా ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడడం ప్రమాదకరం. బొప్పాయి ఆకుల రసం తీసుకోవాలని అనుకుంటే ముందుగా వైద్యుడిని సంప్రదించడం మంచిది. ముఖ్యంగా ఇప్పటికే మందులు వాడుతున్నవారు, గర్భిణీలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సూచన లేకుండా దీనిని ఉపయోగించకూడదు. డెంగీ చికిత్సలో వైద్య పర్యవేక్షణ, తగినంత ద్రవాలు, అవసరమైన పరీక్షలు, సరైన పోషకాహారమే ప్రధానమైనవని నిపుణులు తెలియజేస్తున్నారు.



## లాభనష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభనష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ లాభాల్లో ముగియగా.. నిఫ్టీ వరుసగా మూడో రోజూ నష్టాల పరంపరను కొనసాగించింది. హర్మూజ్ తెరవడంపై నెలకొన్న అనిశ్చితి, చమురు ధరలు పెరగడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంక్, కన్జూమర్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో సూచీలు లాభనష్టాల్లో ఊగిసలాడాయి. సెన్సెక్స్ 113.61 పాయింట్లు లాభపడి 78,079.96 వద్ద ముగిసింది. నిఫ్టీ 40.10 పాయింట్లు కోల్పోయి 24,395.85 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.44 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో ఇండిగో, ఎన్‌టీపీసీ, బీఈఎల్, ఎల్అండ్‌టీ, హిందూస్థాన్ యునిలీవర్, ఎటర్నల్ షేర్లు లాభాల్లో ముగిశాయి.




# జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లాభం రూ.148 కోట్లు




విమానాశ్రయాల నిర్వహణ సంస్థ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (గతంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), జూన్ త్రైమాసికంలో రూ.4,085 కోట్ల ఆదాయంపై రూ.148 కోట్ల నికరలాభం నమోదు చేసింది. 2025-26 ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.3,321.23 కోట్ల ఆదాయంపై రూ.137.11 కోట్ల నష్టాన్ని మూటగట్టుకుంది. కంపెనీ తన వ్యూహాత్మక అవసరాల కోసం సెక్యూరిటీల జారీ ద్వారా గరిష్ఠంగా రూ.5,000 కోట్ల సేకరణకు బోర్డు అనుమతి పొందింది. పాత బాండ్ల పునర్‌వ్యవస్థీకరణ కోసం రూ.1,500 కోట్ల విలువైన కొత్త ఎన్‌సీడీ బాండ్ల జారీకి ఆమోదం లభించింది. దిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాల్లో ప్రారంభించిన డ్యూటీ-ఫ్రీ వ్యాపారాలు, కంపెనీ విమానయేతర ఆదాయ వృద్ధికి ఊతమిచ్చాయి. జీఎంఆర్ లాజిస్టిక్స్ పార్కులో ఉన్న 70% ఈక్విటీ వాటాను జీహెచ్ఐఏఎల్ కొనుగోలు చేయడంతో అది పూర్తి అనుబంధ సంస్థగా మారింది. దిల్లీ ఎయిర్‌పోర్ట్‌లోని సెలెబీ గ్రూపు కార్గో టెర్మినల్ లైసెన్సును జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ దక్కించుకుని, కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకుంది. భవిష్యత్తులో విమానాశ్రయాల సేవల పరిధిని విస్తరించి, ఆదాయ మార్గాలను బలోపేతం చేసుకుంటామని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ గ్రంధి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో హైదరాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 71 లక్షల మంది ప్రయాణించారు. గతేడాది ఇదే కాలంలో ఈ సంఖ్య 81 లక్షలుగా ఉంది. పశ్చిమాసియా అనిశ్చితులు, విమాన ఛార్జీల పెరుగుదల కారణంగా కొంత మేర రద్దీ తగ్గిందని సంస్థ పేర్కొంది.

## టాటా సన్స్ పగ్గాలు ఆయనకేనా.. ఎవరీ టీవీ నరేంద్రన్..?

టాటా సన్స్ ఛైర్మన్ పదవి నుంచి వైదొలగనున్నట్లు నటరాజన్ చంద్రశేఖరన్ ప్రకటనతో టాటా గ్రూప్ నాయకత్వంలో మరోసారి అనిశ్చితి నెలకొంది. ఇప్పుడు టాటా సన్స్ పగ్గాలను ఎవరు చేపడతారనేది కార్పొరేట్ వర్గాల్లో పెద్ద ప్రశ్నగా మారింది. కాగా.. ఈ పదవి రేసులో టీవీ నరేంద్రన్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఇంతకీ ఈయన ఎవరు..? ఛైర్మన్‌గా బాధ్యతలు చేపడితే..




61 ఏళ్ల టీవీ నరేంద్రన్ ప్రస్తుతం టాటా స్టీల్ విభాగానికి మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా వ్యవహరిస్తున్నారు. తదుపరి ఛైర్మన్‌గా ఈయన పేరును టాటా గ్రూప్ అధికారికంగా ప్రకటించనప్పటికీ.. నరేంద్రన్‌కే బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కార్పొరేట్ సర్కిల్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. టీవీ నరేంద్రన్ తిరుచిలోని ఎన్ఐటీలో ఇంజినీరింగ్ చదివారు. ఆ తర్వాత ఐఐఎం కలకత్తా నుంచి మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ఆయన.. 1988లో టాటా గ్రూప్‌లో చేరారు.
అప్పటి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఇదే గ్రూప్‌లో పని చేస్తున్నారు. తొలినాళ్లలో సేల్స్, మార్కెటింగ్, ఇంటర్నేషనల్ బిజినెస్ వంటి విభాగాల్లో పనిచేశారు. ఆగ్నేయ ఆసియాలో టాటా స్టీల్‌ను విస్తరించడంలో కీలక పాత్ర పోషించారు. 2013లో టాటా స్టీల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నరేంద్రన్.. ఆ తర్వాత సీఈఓగా పదోన్నతి పొందారు. కాగా.. తదుపరి ఛైర్మన్ రేసులో ఈయనతో పాటు నోయెల్ టాటా, సౌరభ్ అగర్వాల్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం చంద్రశేఖరన్ పదవీకాలం వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగనుంది. అప్పటిలోగా కొత్త ఛైర్మన్‌ను టాటా సన్స్ ఎంపిక చేయాల్సి ఉంటుంది.
ఇదిలా ఉండగా.. టాటా సన్స్ తదుపరి ఛైర్మన్‌కు మూడు కీలక సవాళ్లు ఎదురుకానున్నాయి. ప్రస్తుతం ఎయిరిండియా, టాటా డిజిటల్, టాటా ఎలక్ట్రానిక్స్ విభాగాలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎయిరిండియా నష్టాలు దాదాపు రెండు రెట్లు పెరిగి రూ.22,238 కోట్లకు చేరాయి. అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన.. పశ్చిమాసియా యుద్ధం వంటి పరిస్థితులు ఈ ఎయిర్‌లైన్ వృద్ధికి అడ్డంకిగా మారాయి. ఇక, గతేడాది టాటా డిజిటల్ ఆదాయం పెరిగినప్పటికీ.. రూ.4,974కోట్ల మేర నష్టాన్ని చవిచూసింది. ఈ విభాగానికి చెందిన బిగ్‌బాస్కెట్ 10-మినట్ డెలివరీ విధానంలోకి ఆలస్యంగా రావడం ప్రతికూల ఫలితాన్నిచ్చింది. దీంతో ఇతర ఈ-కామర్స్ సంస్థల నుంచి పోటీ తీవ్రమైంది.

# 'కుకీ స్టఫింగ్' ఎఫెక్ట్.. బిల్‌గేట్స్ కుమార్తెకు 20 ఏళ్ల జైలుశిక్ష పడనుందా..?



మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ (Bill Gates) చిన్నకుమార్తె ఫీబీ గేట్స్ వివాదంలో చిక్కుకున్నారు. ఆమె స్థాపించిన కంపెనీ ఫియా (Phia).. 'కుకీ స్టఫింగ్'కు పాల్పడిందని ఆరోపణలు వచ్చాయి. ఈ నేరం రుజువైతే ఆమె 20 ఏళ్ల జైలు శిక్ష ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో తనతో పాటు చదువుకున్న సోఫియా కియానితో కలిసి ఫీబీ గేట్స్.. 'ఫియా' స్టార్టప్‌ను స్థాపించారు. ఇది డిజిటల్ పర్సనల్ షాపింగ్ అసిస్టెంట్. ఏఐతో నడిచే ఈ టూల్.. మన అవసరాలు, ప్రాధాన్యతలకు తగిన ఉత్పత్తులను గుర్తించడంలో సహకరిస్తుంది. ఆన్‌లైన్ రిటైలర్ల వివరాలను పరిశీలించి, డిస్కౌంట్ కోడ్‌లను వెతికి ఒక బ్రౌజర్ ఎక్స్‌టెన్షన్‌గా పని చేస్తుంది. పేమెంట్ సమయంలో కూపన్ కోడ్‌లలో ఒకదాన్ని ఎంచుకుంటే.. ఫియా సాఫ్ట్‌వేర్ దానికి ఒక కుకీని జత చేస్తుంది. అది ఒక ట్రాకింగ్ ఫైల్‌లా పనిచేస్తుంది. దీంతో యూజర్ ఒక ఉత్పత్తిని కొనుగోలు చేయడంలో ఫియా సహకారం ఉందని రిటైలర్‌కు సంకేతం వెళ్తుంది. అప్పుడు కొంత మొత్తం కమిషన్ లభిస్తుంది. అయితే, కొనుగోలు ఎంపికలో తమ పాత్ర లేనప్పటికీ.. కొన్ని కంపెనీలు ఇలా ట్రాకింగ్ ఫైల్‌ను జతచేస్తున్నాయి. దీన్నే 'కుకీ స్టఫింగ్' అంటారు. ఇప్పుడు ఫియా సంస్థ ఈ కుకీ స్టఫింగ్ ఆరోపణలు ఎదుర్కొంటోంది. కస్టమర్లు కూపన్ కోడ్‌లు ఉపయోగించకపోయినా.. కుకీలను జత చేసి, అక్రమంగా కమిషన్ పొందుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అమెరికాలో ఇలాంటి నేరాలకు శిక్షలకు కఠినంగానే ఉన్నాయి. ఈ కుకీ స్టఫింగ్ 'ఫెడరల్ వైర్ ఫ్రాడ్' కిందకు వస్తుంది. ఈ నేరం రుజువైతే గరిష్ఠంగా 20 ఏళ్ల జైలు శిక్ష పడుతుంది. ఈ ఆరోపణలపై జులై నెలలోనే ఫియా సంస్థ స్పందించింది. తాము ఈ సమస్యను గుర్తించామని, ఇదొక సాంకేతిక లోపమని అప్పుడు పేర్కొంది. ఇందుకు కారణమైన ఫీచర్లను తొలగించామని, భాగస్వామి సంస్థలకు నిధులు వెనక్కి ఇచ్చే ప్రక్రియ ప్రారంభించామని వెల్లడించింది. అయితే వ్యవస్థాపకులకు ఈ కుకీ స్టఫింగ్ గురించి ఏడు నెలల క్రితమే తెలుసనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఫీబీ గేట్స్‌కు న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# ఎయిరిండియా పైలట్లందరికీ ఇకపై డోప్ టెస్ట్




ఎయిరిండియా విమానయాన సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ పైలట్లందరికీ డోప్ టెస్ట్‌ను తప్పనిసరి చేసింది. ఇటీవల ఫుకెట్ - దిల్లీ విమాన ఘటనలో పైలట్-ఇన్-కమాండ్ గంజాయి సేవించినట్లు డ్రగ్ టెస్టులో తేలిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. డీజీసీఏ సూచించిన ర్యాండమ్ తనిఖీలు కాకుండా.. అంతర్గత వ్యవస్థను బలోపేతం చేసేందుకు గురువారం నుంచే ఈ నిబంధనలు తీసుకొచ్చింది.
గురుగ్రామ్ అకాడమీలో శిక్షణ సమయంలో, విమాన ప్రయాణం ముగిసిన తర్వాత ఎయిర్ ఇండియా ఫ్లైట్ బ్రీఫింగ్ సెంటర్లు, కార్యాలయాల్లో పైలట్లకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రయాణికుల భద్రత, పారదర్శకత, ఎయిరిండియా పాటిస్తున్న అత్యున్నత ప్రమాణాలను కాపాడేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు విమానయాన సంస్థ తెలిపింది. ఈ మేరకు ఉద్యోగులకు రాసిన లేఖలో పేర్కొంది. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో కలిపి మొత్తంగా దాదాపు 5వేల మంది పైలట్లు ఉన్నారు. ఇదీ నేపథ్యం: థాయ్‌లాండ్ నుంచి దిల్లీకి వస్తున్న విమానం ఆగస్టు 4న తీవ్ర కుదుపులకు లోనైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. ఆ సమయంలో ప్రయణికులు, సిబ్బంది కలిపి 145 మంది విమానంలో ఉన్నారు. ఈ ఘటన అనంతరం పైలట్లు ఇద్దరికీ డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. తొలి పరీక్షలో పైలట్-ఇన్- కమాండ్‌కు పాజిటివ్ వచ్చింది. దీని తర్వాత సైకోయాక్టివ్ పరీక్షను నిర్వహించగా.. గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయ్యింది.

# రిటెయిల్ ధరలు మండుతున్నాయ్



ఉల్లి, అల్లం లాంటి వంటగది నిత్యావసరాల ధరలు పెరగడంతో, జులైలో రిటెయిల్ ద్రవ్యోల్బణం 4.45 శాతానికి చేరింది. ఆర్‌బీఐ నిర్దేశించుకున్న మధ్యస్థ లక్ష్యానికి (4%) మించి వరసగా రెండో నెలా ఇది నమోదుకావడం గమనార్హం. వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా రిటెయిల్ ద్రవ్యోల్బణాన్ని లెక్కిస్తారు. జూన్‌లో ఇది 4.38 శాతంగా ఉంది. 2024 ఆధార సంవత్సరంతో కొత్త సిరీస్‌లో ద్రవ్యోల్బణ గణాంకాలను విడుదల చేయడం ప్రారంభించాక, జులైలో నమోదైన 4.45 శాతమే ఇప్పటివరకు ఎక్కువ. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన వివరాల ప్రకారం..
ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం జులైలో 5.52 శాతానికి పెరిగింది. జూన్‌లో ఇది 5.32 శాతంగా ఉంది. ఉల్లిపాయల ద్రవ్యోల్బణం 4.73% నుంచి 22.54 శాతానికి చేరింది. అల్లం ధరల్లో పెరుగుదల 84.62% కాగా, పెర్గ్గా.. వెల్లుల్లి కూడా బాగానే ప్రియం అయ్యింది. బంగాళాదుంపలు, బెండ, టమాటాలు, బఠానీ ధరల్లో క్షీణత (ప్రతి ద్రవ్యోల్బణం) నమోదైంది. జులైలో పట్టణ ప్రాంతంలో రిటెయిల్ ద్రవ్యోల్బణం 3.96% కాగా... గ్రామీణ ప్రాంతంలో 4.84 శాతంగా నమోదైంది. తెలంగాణలో అత్యధికంగా 6.32%, అత్యల్పంగా మిజోరంలో 1.84% చొప్పున రిటెయిల్ ద్రవ్యోల్బణం ఉంది.





## అర టన్ను కొకైన్ సీజ్.. ప్యాకెట్లపై ఫుట్‌బాల్ స్టార్ ఫొటోలు..!



ఈక్వెడార్‌లో భారీ మొత్తంలో డ్రగ్స్‌ను అక్కడి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 470 కేజీల నుంచి 500 కేజీల వరకూ కొకైన్‌ను పట్టుకున్న పోలీసులు.. సరకును తరలిస్తున్న వాహనాన్ని జప్తు చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఆ కొకైన్ ప్యాకెట్లపై నార్వే ఫుట్‌బాల్ స్టార్ ఆటగాడు ఇర్లింగ్ హాలాండ్ ఫొటోలు ఉండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీనిపై పోలీసుల నుంచి ఎలాంటి వివరణ రాలేదు. డ్రగ్స్ విలువ దాదాపు రూ. 110 కోట్ల వరకూ ఉండొచ్చని అంచనా. ఈక్వెడార్‌లో డ్రగ్స్‌ను తరలించడం, అందుకోసం స్మగ్లర్లు ఎక్కువగా క్రీడాకారులు, సెలబ్రిటీల ఫొటోలను వినియోగించడం సర్వసాధారణమైన విషయమని విశ్లేషకులు చెబుతున్నారు. ప్లేయర్ లేదా సెలబ్రిటీ చిత్రాన్ని బట్టి.. సదరు క్లయింట్‌కు స్మగ్లింగ్ నెట్‌వర్క్ ఎలాంటి డ్రగ్‌ను పంపిస్తున్నారన్నది ఈజీగా తెలిసిపోతుంది. తాజాగా యాంటీ నార్కోటిక్స్ బృందాలు చేసిన దాడుల్లో ట్రక్ అడుగు భాగాన దాదాపు 370 బాక్సులను కనిపెట్టి స్వాధీనం చేసుకున్నాయి.

# గంభీర్ ముక్కుసూటి మనిషి.. అందుకే నచ్చడం లేదేమో: హర్భజన్ సింగ్




టీమ్ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పై వస్తోన్న విమర్శలను మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ ఖండించారు. ఏదైనా మ్యాచ్ లేదా సిరీస్ ఓడిపోతే వెంటనే కోచ్‌పైనే విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. గంభీర్ ముక్కుసూటిగా ఉండే మనిషి అని ప్రశంసించాడు. అందుకే అతడి నిర్ణయాలు కొందరికి నచ్చడం లేదేమోనని హర్భజన్ వ్యాఖ్యానించాడు. గంభీర్ కోచింగ్‌లో మన జట్టు ఐసీసీ టోర్నీలను గెలిచిన విషయాన్ని గుర్తు చేశాడు. ''గంభీర్ ఎందుకు ఇంతలా విమర్శలు ఎదుర్కొంటున్నాడు? జట్టు బాగా ఆడకపోతే వెంటనే కోచ్‌ను నిందించడం ఏంటో ఇప్పటికీ అర్థం కావడం లేదు. అతడు క్రికెట్ ఆడుతున్నప్పటి నుంచీ నాకు తెలుసు. ఆటపట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి. కెరీర్ తొలినాళ్లలో గంభీర్ చాలా తక్కువగా మాట్లాడేవాడు. సెహ్వాగ్, అమిత్ మిశ్రా, మునాఫ్ పటేల్ అతడికి మంచి స్నేహితులు. ఇప్పటికీ వారే ఫ్రెండ్స్ అనుకుంటా. అతడు ముక్కుసూటి మనిషి. వాస్తవాలను నిక్కచ్చిగా మాట్లాడతాడు. అందుకే అతడి నిర్ణయాలు కొందరికి మింగుడుపడవు. కవర్ చూసి పుస్తకాన్ని ఎలాంటిదో నిర్ణయించకూడదని పెద్దలు అంటారు. పైకి అలా ఉండే గంభీర్‌ను విమర్శించడమూ తప్పే. విజయం కోసమే ఆడాలి అని బలంగా నమ్మే కోచ్ అతడు. ఓటమిని కనీసం ఊహించడానికి కూడా ఇష్టపడడు. డ్రా కోసం వెళ్లేందుకూ సుముఖత వ్యక్తం చేయడు'' అని హర్భజన్ తెలిపాడు. ''ఎవరికైనా సరే సక్సెస్ ఒక్కసారిగా వచ్చేయదు. శుభ్‌మన్ గిల్ విషయంలోనూ అంతే. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో అతడి కెప్టెన్సీని చూశాం. అతడి సత్తా మనందరికి తెలిసింది. బ్యాటర్‌గా పరుగులు రాబట్టాడు. సారథిగా జట్టును బాగా నడిపించాడు. ప్రతి ప్లేయర్ కెరీర్‌లో ఒడుదొడుకులు సహజమే. గిల్ క్రికెట్ బ్రెయిన్ గొప్పది. వ్యక్తిగతంగానూ అతడు చాలా అద్భుతం'' అని హర్భజన్ ప్రశంసించాడు.
''లియోనెల్ మెస్సి, క్రిస్టియానో రొనాల్డో ఇప్పటికీ ఫుట్‌బాల్ ఆడుతున్నారు. మరి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డేల్లో కొనసాగితే తప్పేంటి? ఏ ప్లేయర్‌కైనా సరే ప్రదర్శనే గీటురాయి. వయసు ముఖ్యం కాదు. విరాట్ వయసు 37 ఏళ్లు దాటినా.. ఇరవై ఏళ్ల కుర్రాడిలా మైదానంలో హుషారుగా ఉంటాడు. మెస్సిని ఆపాలంటే ఇప్పటికీ ఐదుగురు ప్లేయర్లు కష్టపడాలి. భారత జట్టులో ఫిట్‌నెస్‌కు సంబంధించి మార్పులు తీసుకొచ్చింది కోహ్లీనే. చివరి రోజు 400 పరుగులు లక్ష్యం ఉన్నా సరే విజయం కోసం పోరాడాలని సహచరుల్లో స్ఫూర్తి నింపుతాడు. ఒకవేళ ఇప్పుడు ఓటమి ఎదురైనా ఏదొక రోజు సాధించి తీరుతామని చెప్పేవాడు. వైభవ్ సూర్యవంశీ దూకుడు మనందరికీ తెలుసు. కానీ, విరాట్ - రోహిత్‌కు అనుభవం ఉంది. వీరిద్దరు ఇప్పుడు ఎలా ఆడుతున్నారనేదే ముఖ్యం. ఇటీవల మ్యాచుల్లో ప్రదర్శన చూస్తే వీరిద్దరూ సఫలమైనట్లే'' అని హర్భజన్ వెల్లడించాడు.

# భార్య ఆరోపణలు.. స్పందించిన మహిళా క్రికెటర్



ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ ఆష్లే గార్డనర్ తన భార్య మోనికా రైట్ తో విడిపోవడంపై తలెత్తిన వివాదంపై ఎట్టకేలకు స్పందించారు. గార్డనర్ తన సహచర క్రీడాకారిణి జార్జియా వోల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని, అదే తాము విడిపోవడానికి దారితీసిందని రైట్ ఆరోపించిన సంగతి తెలిసిందే. గార్డనర్‌పై చర్యలు తీసుకోనందుకు, జట్టులో నాయకత్వ స్థానంలో కొనసాగిస్తున్నందుకు మోనికా క్రికెట్ ఆస్ట్రేలియా (CA)పై తీవ్ర విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో ఆష్లే గార్డనర్ ఇన్‌స్టా స్టోరీలో ఓ పోస్టు పెట్టింది. ''నా భార్య మోనికా నుంచి నేను విడిపోవడం నా వ్యక్తిగత విషయం. అయినప్పటికీ.. వైస్ కెప్టెన్‌గా నా హోదాను దృష్టిలో ఉంచుకుని నా రిలేషన్‌షిప్‌పై క్రికెట్ ఆస్ట్రేలియా (CA) స్పందించాల్సిన అవసరం ఉంటుందనే విషయాన్ని నేను అర్థం చేసుకోగలను. ఈ సమయంలోనూ బోర్డు నాకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నందుకు సంతోషంగా ఉంది. వచ్చే సీజన్‌లో సమర్థంగా ఆడేందుకు, నా సహచరులకు మద్దతు ఇవ్వడానికి ఎదురుచూస్తున్నాను. మోనికాకు కలిగిన బాధకు చింతిస్తున్నాను. ఆమె భవిష్యత్తులో సంతోషంగా ఉంటూ విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఈ విషయంపై ఇకపై ఎలాంటి బహిరంగ వ్యాఖ్యలు చేయబోను'' అని గార్డనర్ ఇన్‌స్టా స్టోరీలో పేర్కొంది.

## నా రూమ్మేట్‌గా శ్రీశాంత్‌ను తీసుకుంటా: భజ్జీ




భారత క్రికెట్ చరిత్రలో హర్భజన్ సింగ్ - శ్రీశాంత్ చెంపదెబ్బ వివాదం ఎవరూ మరిచిపోలేనిది. ఐపీఎల్‌లో వేర్వేరు జట్లకు ఆడిన సమయంలో సంయమనం కోల్పోయిన హర్భజన్.. శ్రీశాంత్‌ను చెంప దెబ్బ కొట్టాడు. ఆ తర్వాత వివాదం సద్దుమణిగినా అప్పుడప్పుడు మాత్రం ఏదో ఒక రూపంలో వార్తల్లో నిలుస్తూనే ఉంది. తాజాగా హర్భజన్ చేసిన వ్యాఖ్యలు మరోసారి వైరల్‌గా మారాయి. అవకాశం వస్తే శ్రీశాంత్‌తో రూమ్‌ను పంచుకుంటానని.. అప్పుడు తమ మధ్య సమస్యలన్నీ పరిష్కారమవుతాయంటూ వ్యాఖ్యానించాడు. ''మాకు అవకాశం వచ్చి.. మేమిద్దరం ఒకే రూమ్‌లో ఉంటే మాత్రం గతంలోని ఎదురైన సమస్యలన్నింటినీ పరిష్కరించుకోగలం. ఆ నమ్మకం మాకుంది. నేను ఇదే కోణంలో చూస్తా. నా రూమ్మేట్‌గా అతడినే ఎంపిక చేసుకుంటా. నాకు ఇందులో ఎలాంటి ఇబ్బంది లేదు'' అని హర్భజన్ తెలిపాడు. అంతకు ముందు ఓ ఇంటర్వ్యూలో శ్రీశాంత్ మాత్రం హర్భజన్‌తో బాక్సింగ్ రింగ్‌లోనే సెటిల్ చేసుకుంటానని సవాల్ విసిరాడు. ఐపీఎల్ 2008 సీజన్‌కు హైలైట్‌గా నిలిచే ఘటన హర్భజన్ సింగ్ - శ్రీశాంత్ చెంపదెబ్బ వ్యవహారం. ఇది జరిగి ఇప్పటికి దాదాపు 18 ఏళ్లు దాటినా ఇంకా దానిపై అప్పుడప్పుడు చర్చ సాగుతూనే ఉండటం గమనార్హం.

# సహనంతో ఉండు.. ఇది మా నాన్న మాట: సారాంశ్ జైన్


పన్నెండేళ్ల కిందట రంజీల్లోకి అరంగేట్రం చేసిన సారాంశ్ జైన్‌కు ఇప్పుడు టీమ్ఇండియా టెస్టు జట్టులోకి ఎంట్రీ దక్కింది. శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా శనివారం నుంచి మొదటి మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో మరో ఆటగాడు అకిబ్ నబీతో కలిసి సారాంశ్ చిట్‌చాట్ చేశాడు. అకిబ్ అఫ్గాన్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపికైనా తుది జట్టులో మాత్రం చోటు దక్కలేదు. ఇప్పుడు శ్రీలంకతో వీరిద్దరూ ఆడే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే వీరి



చిట్‌చాట్ వీడియోను బీసీసీఐ తాజాగా తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ''ఓసారి నేను గుడిలో ఉన్నప్పుడు ఫోన్ వచ్చింది. అక్కడి నుంచి వస్తూ డ్రైవింగ్ చేస్తుండగా మళ్లీ కాల్ వచ్చింది. మెసేజ్‌లు కూడా వచ్చాయి. అప్పుడే నేను టీమ్ఇండియాకు ఎంపికైనట్లు తెలిసింది. ఇక్కడికి వచ్చాక నాకేమీ కొత్తగా లేదు. ఎందుకంటే రంజీ ట్రోఫీలో ఎలా ఉంటుందో అలానే ఉంది. వార్మప్ మ్యాచ్‌కు మూడు రోజుల ముందే జట్టుతో చేరా. ఇక్కడ ఉన్న 80 శాతం ప్లేయర్లతో దేశవాళీలో ఆడిన అనుభవం ఉంది. అందువల్ల వారితో సులువుగానే కలిసిపోయా'' అని సారాంశ్ వెల్లడించాడు.
''టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెట్టాలంటే ఓర్పు అత్యంత ముఖ్యం. నా కెరీర్ మొదలైనప్పటి నుంచి నేను ఇలానే ఉన్నా. 2014-15 సీజన్‌లో రంజీ ట్రోఫీలోకి అడుగుపెట్టా. ఇక్కడికి చేరుకొనేందుకు చాలా కష్టపడ్డా. ఎన్నో త్యాగాలు చేశా. ఎప్పటికైనా భారత జట్టుకు ఆడతానని కలలు కన్నా. ఇప్పుడు అవకాశం వచ్చింది. దీని వెనుక నా కుటుంబం పాత్ర వెలకట్టలేనిది. మా నాన్న కూడా రంజీ ప్లేయరే. సహనంతో ఉండాలని ఆయనే చెప్పేవారు. అప్పుడే పరిస్థితులు మనకు అనుకూలంగా మారతాయని అనేవారు. ఇప్పుడు ఆ మాటలు నిజమయ్యాయి'' అని సారాంశ్ తెలిపాడు.




# 'ధర్మన్' రెండవ షెడ్యూల్ ప్రారంభం



**వుదయం సినిమా:** సూపర్ స్టార్ రజనీకాంత్ 'ధర్మన్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'ది డెడ్లీ డాక్టర్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో విడుదలైన ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో చాలా ఆసక్తిని రేకెత్తిస్తోంది.తాజాగా మేకర్స్ రెండవ షెడ్యూల్ ప్రారంచారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన వీడియోలో సూపర్ స్టార్ ప్రజెన్స్ అదిరి పోయింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.కమల్ హాసన్, సూపర్ స్టార్ రజనీకాంత్ మధ్య ఉన్నంత స్నేహబంధం చాలా అరుదు. భారతీయ చలనచిత్ర రంగంలో ఐదు దశాబ్దాలకు పైగా అగ్రస్థానంలో కొనసాగుతున్న ఈ ఇద్దరు దిగ్గజాలు, 'ధర్మన్' చిత్రం ద్వారా నిర్మాత–నటుడిగా మొదటిసారిగా కలిసి పనిచేస్తున్నారు.రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కమల్ హాసన్,ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న ఈ చిత్రం, RKFI నిర్మాణంలో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించే మొదటి సినిమా కావడం విశేషం. భారతీయ చలనచిత్ర రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుని, అత్యంత ఆసక్తికరమైన యువ దర్శకులలో ఒకరిగా పేరు తెచ్చుకున్న అశ్వత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.సూపర్ స్టార్ రజనీకాంత్‌తో పాటు, దక్షిణాది చిత్రసీమలో అత్యంత ప్రజాదరణ పొందిన నటి సిమ్రాన్, తమిళ, తెలుగు, హిందీ చిత్రాలలో తన అద్భుత నటనతో గుర్తింపు పొందిన రాశీ ఖన్నా ఈ చిత్రంలో నటిస్తున్నారు.అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. భారతీయ చలనచిత్ర రంగంలో అత్యంత అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలను రూపొందించడంలో పేరుగాంచిన జాతీయ అవార్డు గ్రహీతలు 'అన్బరివ్' ద్వయం యాక్షన్ కొరియోగ్రఫీని నిర్వహిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ గా నికేత్ బొమ్మిరెడ్డి , కార్తీక్ రాజ్‌కుమార్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రదీప్ ఇ. రాఘవ్ ఎడిటర్‌గా వ్యవహరిస్తుండగా, అన్నదురై ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. అలాగే డిస్నీ సంస్థ దీనికి సహ–నిర్మాతగా వ్యవహరిస్తోంది.

# ఎన్టీఆర్‌కు శస్త్రచికిత్స విజయవంతం




**వుదయం సినిమా:** అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ భుజానికి సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయ్యింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని బుధవారం కిమ్స్ వర్గాలు హెల్త్ బులెటిన్ విడుదల చేశాయి. జిమ్‌లో కసరత్తులు చేస్తుండగా...ఇటీవలి ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. దీనిపై వైద్యులను సంప్రదించగా...పరిశీలించి శస్త్ర చికిత్స అవసరమని సూచించారు. ఇందులో భాగంగా ఆయన మంగళవారమే కిమ్స్ ఆసుపత్రిలో చేరగా...వైద్యులు ఆర్థోస్కోపిక్ సర్జరీ చేశారు. సీనియర్ వైద్యుల బృందం డాక్టర్ ఆర్.ఎ.పూర్ణచంద్ర తేజస్వి, డాక్టర్ నితిన్ బెజ్జంకి, డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ శ్రీనివాస్‌రావు సూరపనేని పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్యంగా ఉన్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. శస్త్రచికిత్స నుంచి కోలుకున్న తర్వాత ఎన్టీఆర్‌కు కొన్ని రోజులపాటు ఫిజియోథెరపీ అవసరమని తెలిపారు. తర్వాత రెండు నుంచి మూడు నెలల్లో పూర్తిగా కోలుకుని సాధారణ జీవితానికి సిద్ధమవుతారని కిమ్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్, క్రిటికల్ కేర్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ సంబిత్ సాహు వెల్లడించారు.

# 'ఐ యామ్ గేమ్' సెప్టెంబర్ 3న గ్రాండ్ వరల్డ్‌వైడ్ రిలీజ్



**వుదయం సినిమా:** దుల్కర్ సల్మాన్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'ఐ యామ్ గేమ్' కొత్త విడుదల తేదీని ఖరారు చేశారు. తొలుత ఆగస్టు 20న ఓనం కానుకగా విడుదల చేయాలని ప్రకటించిన ఈ చిత్రం.. ఇప్పుడు రెండు వారాలు వాయిదా పడి సెప్టెంబర్ 3, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రేక్షకులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో విడుదల తేదీని మార్చినట్లు మేకర్స్ తెలిపారు.దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ ఫాంటసీ థ్రిల్లర్‌కు నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్నారు. సజీర్ బాబా, ఇస్మాయిల్ అబూబకర్, బిలాల్ మొయిదు స్క్రీన్‌ప్లే అందించగా.. సజీర్ బాబా, ఆదర్శ్ సుకుమారన్, షబాస్ రషీద్ సంభాషణలు రాశారు.'ఐ యామ్ గేమ్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన ట్రైలర్, ఫస్ట్ సింగిల్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. మలయాళం, తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో విడుదలైన ట్రైలర్‌లో అదిరిపోయే విజువల్స్, హై–ఆక్టేన్ యాక్షన్, థ్రిల్లింగ్ ఛేజ్ సీక్వెన్స్‌లు ఆకట్టుకున్నాయి. దుల్కర్ సల్మాన్‌ను స్టైలిష్ మాస్ అవతార్‌లో చూపించిన తీరు సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది.దక్షిణ భారత దేశంలోని 100కు పైగా లొకేషన్లలో చిత్రీకరించిన ఈ సినిమా.. మలయాళ సినీ పరిశ్రమలో భారీ స్థాయిలో తెరకెక్కిన చిత్రాల్లో ఒకటిగా నిలవనుంది. ఇది దుల్కర్ సల్మాన్ కెరీర్‌లో 40వ సినిమా కావడం మరో ప్రత్యేకత. ఆంటోనీ వర్గీస్, తమిళ నటుడు–దర్శకుడు మిస్కిన్, కాయదు లోహర్, కతిర్, పార్థ్ తివారీ, సంయుక్త విశ్వనాథన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి అన్బరివ్ మాస్టర్స్ యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. జీ మ్యూజిక్ ఈ సినిమా మ్యూజిక్ రైట్స్‌ను సొంతం చేసుకుంది.బ్లాక్‌బస్టర్ 'లోక: చాప్టర్ 1 – చంద్ర' తర్వాత వేఫేరర్ ఫిల్మ్స్ నుంచి వస్తున్న సినిమా కావడంతో 'ఐ యామ్ గేమ్'పై మరింత ఆసక్తి నెలకొంది. అలాగే 'ఆర్‌డీఎక్స్' తర్వాత నహాస్ హిదాయత్ దర్శకత్వంలో వస్తున్న సినిమా కావడం కూడా అంచనాలను పెంచుతోంది.మలయాళం, తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానున్న 'ఐ యామ్ గేమ్'.. దుల్కర్ కెరీర్‌లో మరో భారీ చిత్రంగా నిలిచేందుకు సిద్ధమవుతోంది.

# 'నేను రెడీ' సాంగ్ లాంచ్ ఈవెంట్

**వుదయం సినిమా:** యంగ్ హీరో హవీష్ 'నేను రెడీ' ప్రమోషనల్ కంటెంట్‌తో ఆసక్తిని పెంచుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌ను తెరకెక్కించే దర్శకుడు త్రినాథ్ రావు నక్కిన ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హార్నిక్స్ ఇండియా ఎల్‌ఎల్‌పీ బ్యానర్‌పై కోనేరు సత్య నారాయణ, నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది.సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్‌కు మంచి స్పందన రాగా, నర్గీస్ ఫక్రీ ప్రత్యేక పాత్రలో కనిపించిన ఈ పాటలో హవీష్, కావ్య థాపర్ కెమిస్ట్రీ ఆకట్టుకుంది. అలాగే రెండో సింగిల్ 'మెరుపులే మెరుపులే' కూడా యూత్‌ను ఆకట్టుకుంది. తాజాగా మేకర్స్ మూడో సింగిల్ 'మస్తు గుందిరా యవ్వారం'ను విడుదల చేశారు.లైవ్లీ ఫోక్ బీట్స్‌ను క్యాచీ పాప్ సౌండ్స్‌తో కలిపి రూపొందించిన ఈ పాట మొదటి నుంచే ఎనర్జిటిక్ వైబ్‌ను క్రియేట్ చేస్తుంది. మిక్కీ జే. మేయర్ స్వరపరిచిన ఈ పాటలో డ్రమ్స్‌కు ప్రాధాన్యత ఇస్తూనే, ఆధునిక సింథ్స్, హుక్స్‌ను చక్కగా మిక్స్ చేశారు. దీంతో పాటకు ఫుల్ ఎనర్జీతో కూడిన కమర్షియల్ టచ్ వచ్చింది.కాసర్ల శ్యామ్ రాసిన సాహిత్యం యూత్‌ఫుల్‌గా, సరదాగా, ఫ్లర్టీగా సాగుతూ ప్రేమ, యవ్వనం, యాటిట్యూడ్‌ను ప్రజెంట్ చేస్తోంది. అనురాగ్ కులకర్ణి, మానసి ఎరబతినీ తమ ఎనర్జిటిక్ వోకల్స్‌తో పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు.విజయ్ పోలాకి కొరియోగ్రఫీ పాటకు మరో హైలైట్‌గా నిలిచింది. మాస్ కమర్షియల్ డ్యాన్స్ స్టెప్స్‌ను ఫోక్ ఫ్యూజన్ మూవ్‌మెంట్స్‌తో మిక్స్ చేసి హై ఎనర్జీతో రూపొందించారు. హవీష్, కావ్య థాపర్ కూడా తమ డ్యాన్స్‌తో అదరగొట్టారు. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ, ఎనర్జీ పాటను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. 'నేను రెడీ'లో బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, మురళీ శర్మ, శ్రీలక్ష్మి , వీటీవీ గణేష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వీరి కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాకు మరింత బలాన్ని చేకూర్చనుంది.మిక్కీ జే. మేయర్ సంగీతం అందిస్తుండగా, నిజార్ షఫీ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా, విక్రాంత్ శ్రీనివాస్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు.వరుసగా విడుదలవుతున్న పాటలకు మంచి స్పందన వస్తుండటంతో 'నేను రెడీ' పై ఆసక్తి పెరుగుతోంది. త్వరలోనే సినిమా థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించనున్నారు.సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో హవీష్ మాట్లాడుతూ: హలో వరంగల్. మీరు ఇచ్చిన ఆదరణ మాకు గొప్ప కిక్ ఇచ్చింది.



# సెప్టెంబర్‌లో రిలీజ్‌కు "కెరూబ్" మూవీ

**వుదయం సినిమా:** విహాన్ కార్తీక్, దివ్య విశ్వకర్మ హీరో హీరోయిన్స్ గా నటిస్తున్న సినిమా "కెరూబ్". ఈ చిత్రాన్ని ఖుషి ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ బాలు బల్లెకారి నిర్మిస్తున్నారు. ఫాంటసీ థ్రిల్లర్ కథతో దర్శకుడు ఎం జె నాయుడు (జీవన్) రూపొందిస్తున్నారు. ఫస్ట్ కాపీ రెడీ చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. సెప్టెంబర్ లో "కెరూబ్" చిత్రాన్ని గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చేందుకు దర్శక నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.ఇప్పటికే "కెరూబ్" సినిమా నుంచి రిలీజ్ చేసిన టీజర్ హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. తాజాగా రిలీజ్ చేసిన "కెరూబ్" సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ వైవిధ్యంగా కనిపిస్తోంది. ఈ పోస్టర్ లో జలపాతంతో కూడిన ఆహ్లాదకరమైన ప్రకృతిలో హీరో వేణువు వాయిస్తున్న స్టిల్ తో ఫస్ట్ లుక్ పోస్టర్ చూడగానే ఆకట్టుకుంటోంది. ఒక సరికొత్త ఫాంటసీ థ్రిల్లర్ కథను "కెరూబ్" చిత్రంలో చూడబోతున్నామనే ఫీల్ ప్రేక్షకుల్లో కలుగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.నటీనటులు – విహాన్ కార్తీక్, దివ్య విశ్వకర్మ, కల్పలత, సుమన్ శెట్టి, రమేష్ కొనంభొట్ల, గడ్డం సురేష్, శ్రీధర్ మాడ, తదితరులు.




# హిస్టరీ క్రియేట్ చేసిన అఖిల్ అక్కినేని 'లెనిన్'..




**వుదయం సినిమా:** బాక్సాఫీస్ వద్ద సత్తా చాటిన అఖిల్ అక్కినేని 'లెనిన్' ఇప్పుడు తెలుగు ZEE5లోనూ అద్భుతమైన రికార్డు సృష్టించింది. కేవలం ఒక్క వారంలోనే 200 మిలియన్లకు పైగా స్ట్రీమింగ్ నిమిషాలను క్రాస్ చేయటం విశేషం. ఈ ఘనత సినిమాకు ఓ చారిత్రాత్మక స్ట్రీమింగ్ మైల్‌స్టోన్‌గా నిలిచింది. థియేట్రికల్‌గా బ్లాక్ బస్టర్ అయిన 'లెనిన్'పై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తి, సినిమాను చూసేందుకు కొనసాగుతున్న ఉత్సాహానికి ఇదొక ఉదారణ. మూడేళ్ల గ్యాప్ తర్వాత జూలై 10న థియేటర్లలో విడుదలైన 'లెనిన్' సినిమా ఆయన కెరీర్‌లోనే అత్యధిక ఓపెనింగ్‌ను సాధించింది. బాక్సాఫీస్ దగ్గర రూ.100 కోట్ల వసూళ్లతో లాభాల బాట పట్టిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి వచ్చిన మంచి స్పందన కొనసాగుతోంది. అదే ఆదరణతో 'లెనిన్' మంచి కమర్షియల్ సక్సెస్‌గా నిలిచింది.

# 21న 'ప్యార్ ప్రేమ కళ్యాణం'.. నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్



**వుదయం సినిమా:** ఎలన్, శాన్వీ మేఘన హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్యార్ ప్రేమ కళ్యాణం'. ఎ రైజ్ ఈస్ట్ ప్రొడక్షన్ బ్యానర్‌పై ఎలన్ దర్శకత్వంలో శ్రీనిధి సాగర్ నిర్మించిన ఈ చిత్రం నెట్ ఫ్లిక్స్ ఫిల్మ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ గురువారం హైదరాబాద్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో..నిర్మాత శ్రీనిధి సాగర్ మాట్లాడుతూ ''నేను గుంటూరు వాడిని. అయితే చెన్నైలో చదువుకున్నాను. అక్కడే సెటిలైయ్యాను. ఇది నెట్‌ఫ్లిక్స్‌లో నా రెండో సినిమా. ఈ ఏడాది మార్చిలో మేడిన్ కొరియా అనే సినిమాను రిలీజ్ చేశాం. దాని తర్వాత మేం చేసిన సినిమా ఇది. మా తొలి సినిమా లాగానే ఈ సినిమా కూడా ప్రేక్షకాదరణ పొందుతుందని భావిస్తున్నాం. ఓ సీరియస్ సబ్జెక్ట్‌ను కామెడీ కోణంలో చెప్పే ప్రయత్నం చేశాం. ఎలన్ మా బ్యానర్‌లో చేసిన రెండో సినిమా ఇది. మరో సినిమా కూడా కమిట్ అయ్యాడు. తనతో మా జర్నీ కంటిన్యూ అవుతుందని అనుకుంటున్నాను. శాన్వీ మేఘనను తమిళంలో నేనే లాంచ్ చేయాలనుకున్నాను. కానీ కుదరలేదు. మా ఫ్రెండ్స్ చేసిన కుడుంబస్తన్ సినిమాతో అక్కడ ఎంట్రీ ఇచ్చారు. ఇప్పుడు మా బ్యానర్‌లో ఈ సినిమా చేశారు. తను ఎంతో చక్కగా చేశారు. తమిళంలో తనే డబ్బింగ్ చెప్పుకున్నారు'' అన్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.